ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 191 పేజీలు: 10+4 వెల: 6.50


వచ్చే ఫిబ్రవరిలో బంగ్లా ఎన్నికలు

నిర్మలా సీతారామన్‌కు 'భారత్ లక్ష్మి' పురస్కారం

5

ఆపరేషన్ సిందూర్ వెనుక 'మేకిన్ ఇండియా'

3 వందేభారత్‌లను ప్రారంభించిన ప్రధాని మోడీ

కొత్తిసేపు మెట్రోలో ప్రయాణించిన ప్రధాని

## ప్రపంచం కొత్త భారత్‌ను చూస్తోంది



బెంగళూరులో మెట్రోను ప్రారంభించిన అనంతరం రైలులో ప్రయాణికులతో సంభాషిస్తున్న ప్రధాని మోడీ

**బెంగళూరు, ఆగస్టు 10:** ఆపరేషన్ సిందూర్ వెనుక భారతీయ సాంకేతికత, మేకిన్ ఇండియా కార్యాచరణలు ఉన్నాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దేశీయ టెక్నాలజీ, మేకిన్ ఇండియా కొన్ని గంటల్లో పాకిస్థాన్‌ను మోకరిల్లేలాచేసాయన్నారు. 'ఆపరేషన్ సింధూర్' సందర్భంగాప్రపంచం మొదటిసారి భారత్‌దేశం కొత్తముఖాన్ని చూసిందని, పాక్‌లోని ఉగ్రవాదస్థావరాలను నాశనంచేయడంలో దాని సామర్థ్యం చూపించిందని అన్నారు. బెంగళూరులో పర్యటించిన ప్రధానిమోడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంతోపోటీపడుతోందని ప్రధాని అన్నారు. అలాగే నాయకత్వం వహించేస్థాయిలో కూడా ఉన్నామని, మన నగరాలు స్మార్ట్‌గా, వేగంగా సమర్థవంతంగా ఉన్నపుడే దేశం అభివృద్ధిచెందుతుందని ఆధునిక మౌలిక సదుపాయాలను పూర్తిచేయడానికి మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. 21వ శతాబ్దంలో పట్టణ ప్రణాళిక >>2

## ఇద్దరు పిల్లల నిబంధనకు చెల్లు!



### గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆ రూల్ రద్దు?,

### త్వరలో అసెంబ్లీలో బిల్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు10:** గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న అభ్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించే దశాబ్దాల నాటి నిబంధనను రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని తొలగించే ప్రతిపాదనను తదుపరి మంత్రివర్గ సమావేశంలో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ప్రవేశపెట్టిన ఈ పరిమితిని ఎత్తివేయడానికి మంత్రులు ఇప్పటికే ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రణాళిక నేపథ్యంలో ఈ మార్పు అత్యవసరమని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఈ నిబంధనను తొలగించడం వలన రాజకీయ పార్టీలకు బీసీల నుండి మాత్రమే కాకుండా ఇతర వర్గాల నుండి కూడా అభ్యర్థులను ఎంపిక చేయడంలో మరింత సులభం అవుతుందని ఒక సీనియర్ అధికారి వివరించారు. 2026లో డీలిమిటేషన్ ఫ్రీజ్ ముగిసిన తర్వాత తరచుగా ఇద్దరు పిల్లల నిబంధన వంటి చర్యల ద్వారా జనాభా పెరుగుదలను సమర్థవంతంగా అరికట్టిన రాష్ట్రాలు రాజకీయ పలుకుబడిని, కేంద్ర నిధులను కోల్పోయే అవకాశం ఉందనే ఆందోళనల మధ్య ఈ చర్య వచ్చింది. గత సంవత్సరం ఆ మేరకు చట్టం ఆమోదించిన ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి ఆంక్షలను తొలగించాయి. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ మార్పును బిల్లు ద్వారా ప్రవేశపెట్టాలా వద్దా అనే విషయాన్ని >>2

# రాష్ట్రమంతా హై అలర్ట్

## జోరు పెరిగిన వాన

### 17 దాకా ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ

### 13 నుంచి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### హైదరాబాద్ అతలాకుతలం, అన్ని శాఖలకు హై అలర్ట్

### నాగార్జునసాగర్‌కు పెరిగిన వరద, 8 గేట్లు ఎత్తివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు10:** ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ఆదివారం కూడా వర్షాలు పడ్డాయి.నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 8 జిల్లాలకు >>2

'సాగర్' ఎడమ కాలువకు గండి 3

### నగర వరద ప్రాంతాలను పరిశీలించిన సిఎం రేవంత్

**హైదరాబాద్ (పంజగుట్ట), ఆగస్టు 10 (ప్రభాతవార్త):** గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నగరం అతలాకుతలమవుతోంది.లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమవుతున్నాయి. రోడ్లు చెరువులను తలపిస్తుంటే, ఫ్లైఓవర్లు జలపాతాల్లా మైమరిపిస్తున్నాయి..లోతట్టు కాలనీల్లో ఇళ్ళలోకి వరదనీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో సీయం రేవంత్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా తెలుసుకోవడానికి ఆదివారం ఆకస్మిక పర్యటన చేపట్టారు.నగరంలో కురుస్తున్న భారీ >>2



ఆదివారం హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న సిఎం రేవంత్



వంగవీడులో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి

## నీటిదోపిడీని సహించం

### బనకచర్ల, రాయలసీమ లిఫ్ట్‌ను నిలిపివేయాలి

### 'కాళేశ్వరం' పాపం గత పాలకులదే..

### వంగవీడులో రూ.630 కోట్లతో జవహర్ లిఫ్ట్ స్కీంకు భూమి పూజ

### హాజరైన డి.సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి, వాకిటి

**మధిర ఆగస్టు 10 ప్రభాతవార్త:** భవిష్యత్తు రాష్ట్ర ప్రయోజనాలు ప్రజల అవసరాలను కాదని బనకచర్ల, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా కృష్ణ గోదావరి జలాల తరలింపును చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గం పరిధిలో మధిర మండలం వంగవీడు గ్రామంలో వైరా నదిపై నూతనంగా రూ.630 కోట్ల రూపాయల అంచనాతో 33,000 ఎకరాల భూమికి సాగునీటి అందించే దిశగా నిర్మాణం చేపట్ట తలపెట్టిన జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, వైరా సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, మట్ట రాగమయి దయానంద్‌లు హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రోజుమూడు టీఎంసీల నీటిని తరలించకపోవడం ద్వారా నాగర్జునసాగర్ లెఫ్ట్‌కెనాల్‌పై ఆధారపడిన పాలేరు మధిర సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టు రైతాంగం తీవ్రంగా నష్టపోనున్నదని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి తక్షణమే రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును నిలుపుదల చేయాలని ఆయన సభా వేదికగా కోరారు. బనకచర్ల ప్రాజెక్ట ద్వారా గోదావరి నీటి తరలింపును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి చేస్తున్న ప్రయత్నాలు కృషిని ప్రశంసించిన భట్టి విక్రమార్క వారి పోరాటంలో తాము అడుగు >>2



## వాద్రాకు ఏడేళ్లు జైలుశిక్ష వేయండి

### ఛార్జిషీటులో ఇడి

### అక్రమ సంపాదన 38.69 కోట్లు ప్రభుత్వ పరం చేయాలి

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** కాంగ్రెస్ వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూపంలో భారీ షాక్ తగిలింది. 2008 నాటి గురుగ్రామ్ భూముల కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో వాద్రాకు >>2

### ఉపాధి హామీ కూలీలకు

## ఏదీ భరోసా?

### ఇంకా అందని రూ.12 వేలు

### మరో 5 లక్షల మంది ఎదురు చూపులు!




**హైదరాబాద్,ఆగస్టు 10ప్రభాతవార్త:** భూమిలేని ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా (ఐఏబీ) దక్కడంలేదు. సిఎం రేవంత్ రెడ్డి జనవరి 26న అట్టహాసంగా ప్రారంభించిన ఈ పథకం ముందుకు సాగడంలేదనే విమర్శలు వస్తున్నాయి.భూమిలేని రైతుకూలీలకు ఏడాదికి రెండు విడతల్లో రూ.12 వేలు అందిస్తామని సీఎం ఇచ్చిన హామీ అమలు కావడం లేదు.బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటా యించినప్పటికీ, ఇప్పటివరకు కేవలం 83,887 మందికి రూ.50.33 కోట్లు మాత్రమే అందించగా, మరో ఐదు లక్షల మందికి రూ.300 కోట్లు అందాల్సి ఉన్నట్లు తెలిసింది.ఫైనాన్స్ టోకేన్ల జారీ అయినా కూలీల ఖాతాల్లోకి సొమ్ము మాత్రం రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డబ్బులు ఎప్పుడు పడతాయాని రైతు కూలీలు నిరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థికభరోసా ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం అమలుకు అనేక ఆంక్షలు విధించినట్లు 2023-24లో మహాత్మాగాంధీ ఉపాధి కూలీలకు రూ.12 వేలు ఐఏబీ పేదలకు అందని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో తాత్కాలిక బ్రేక్ ఇప్పటివరకు 83,887 మందికి 50.33 కోట్లు జమ ఫైనాన్స్ టోకెన్లు ఇచ్చినా ఖాతాల్లో జమకాని సొమ్ము మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 రోజులు పనిచేసిన సొంత భూమిలేని కూలీలకు రూ.6 వేల చొప్పున రెండు దఫాల్లో ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని ప్రకటించింది. దీనికి కూడా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కాకుండా ఒక్కో జిల్లాలో ఒక్కో మండలంలోని ఒక్క గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. జనవరి 26న ఆయా గ్రామాల్లోని 18:180 మందికి రూ.6 వేల ఆర్థికసాయం అందించారు. మరుసటి రోజు ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది ఎన్నికల కోడ్‌ను సాకూగా చూపి తాత్కాలికంగా నిలిపివేసి అనంతరం మరో 63వేల మందికి నగదు జమచేసినట్లు తెలిసింది.ఇప్పటి వరకు కేవలం 83,887 మందికి >>2



ఆదివారం హైదరాబాద్‌లో బిజెపిలో చేరిన గువ్వల బాలరాజుకు గజమాల వేసిన అభిమానులు

## బిజెపిలోకి గువ్వల


**హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** బిజెపి పని సున్నా అనే బిఆర్ఎస్ పనే సున్నా అయ్యిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం అచ్చంపేట మాజీఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు కాషాయ కండువా కప్పి బాలరాజును పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ బిజెపి పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రధాని మోడీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాషాయ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గువ్వల బాలరాజు సేవలు వాడుకుంటామన్నారు.ప్రతి ఎన్నికల్లో >>2

## వారం గడచినా తేలని సినీ సమ్మె

### ఉద్రిక్తతలకు దారితీస్తున్న షూటింగ్స్

### విరమించేది లేదంటున్న ఫిల్మ్ ఫెడరేషన్

### ఇతర రాష్ట్రాలపైనా 'తెలుగు సమ్మె' ప్రభావం



**హైదరాబాద్, అగస్టు 10, ప్రభాతవార్త:** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కార్మికులు చేస్తున్న సమ్మె రానురాను బిగుస్తోంది. వేతనాల పెంపు కోసం చిత్ర పరిశ్రమకు చెందిన కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. సినీ కార్మికులకు వేతనాల పెంపు విషయంలో నిర్మాతల మండలికి, కార్మిక సంఘాలకు మధ్య నెలకొన్న వివాదం కారణంగా షూటింగ్‌లన్నీ నిలిచిపోయాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు, ఇతర రాష్ట్రాల్లో సైతం ఈ సమ్మె సినీ షూటింగ్‌లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎక్కటిక్కడ సినిమా, వెబ్ సిరీస్, లఘు చిత్రాలకు సంబంధించిన షూటింగ్‌లు బంద్ అయ్యాయి. దీనికితోడు కొన్నిచోట్ల జరుగుతున్న షూటింగ్‌లను అడ్డుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం మేరకు కార్మికులు షూటింగ్‌లకు హాజరుకావడం లేదు. వేతనాలు పెంచిన వారికి మాత్రమే పని చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్‌ను అడ్డుకోవడం పెద్ద వివాదంగా మారింది. >>2

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గోల్‌మాల్


### నకిలీ పేర్లతో మాజీ ప్రజాప్రతినిధి పిఎ స్వాహా

### విచారణ జరుపుతున్న పోలీసులు

**కోదాడ, ఆగస్టు 10, ప్రభాతవార్త:** కోదాడ నియోజకవర్గంలో సీ ఎం రిలీఫ్ ఫండ్ స్కాం బయటపడింది. బీ ఆర్ ఎస్ ప్రభుత్వం వున్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే పీ ఏ గా చెప్పుకున్న ఒక వ్యక్తి తో పాటు కొందరు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఈ స్కాంలో ఉన్నట్లు సమాచారం. తమకు ఆర్థిక సహాయం కావాలని దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు చెక్కులు మంజూరైన తరువాత లబ్దిదారులకు కాకుండా వారి పేర్లు, ఇంటి పేర్లతో సరిపోయే వేరే వ్యక్తులకు ఆ చెక్కులను ఇచ్చి వారితో ఆ మొత్తాన్ని డ్రా చేసుకొని వాటాలు వేసుకొని పంచుకున్నట్లు విశ్వసనీయ >>2

### ఫాస్టాగ్ వార్షిక పాస్

## 15 నుంచి అమలులోకి




### రూ.3 వేలు చెల్లిస్తే యేడాదిపాటు లేదా 200 ట్రిప్పుల దాకా ఫ్రీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) వాహనదారులకు ఒక శుభవార్త అందించింది. టోల్ ప్లాజాల వద్ద చెల్లింపులను మరింత సులభతరం చేసేందుక 'ఫాస్టాగ్ వార్షిక పాస్'ను ప్రవేశపెట్టనుంది. ఈ కొత్త పథకం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి రానుంది. తరచుగా జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి పదేపదే రీఛార్జ్ చేసుకునే శ్రమను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ వార్షిక పాస్ ధరను రూ. 3,000గా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని చెల్లించిన ప్రైవేట్ వాహన యజమానులు ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు టోల్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. ఈ పాస్‌ను కొనుగోలు చేయాలంటే వాహనానికి ఇప్పటికే ఫాస్టాగ్ యాక్టివ్‌గా ఉండాలి. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఎఐ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ఈ పాస్ కేవలం ఎన్‌హెచ్ఎఐ, కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ పరిధిలోని >>2



బెంగళూరులోని కెఎస్ఆర్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం 3 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోడీ

## కొత్త భారత్‌ను చూస్తోంది

>> మౌలిక సదుపాయాలు చాలా అవసరమని, బెంగళూరు వంటి నగరాలను భవిష్యత్తుకోసం సిద్ధంగా ఉంచాలన్నారు. బెంగళూరుకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు ఉందని, బెంగళూరు ఎల్లప్పుడూ నగరస్థాపకుడు కెంపేగౌడ వారసత్వాన్ని నిలబెట్టుకుందన్నారు. ఆయన కలలను నిజంచేస్తోందని, బెంగళూరును న్యూ ఇండియా ఎదుగుదలకు చిహ్నంగా మనం చూస్తున్నామని మోడీ చెప్పారు. 2014కు ముందు కేవలం ఐదునగరాలకే పరిమిం అయిన మెట్రోసేవలు నేడు 24 నగరాలకు విస్తరింపచేసామన్నారు. బెంగళూరు మెట్రోరైలు ప్రాజెక్టులోని ఆర్వీరోడ్డు, బొమ్మసంద్రమధ్య ఉన్న ఎల్లో లైన్‌ను ప్రధాని ప్రారంభించారు. నగరంలోని ఐటిహబ్‌ను అనుసంధానించే అనేక కారిడార్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించే లక్ష్యంతో దీన్ని తెచ్చారు. ఈ క్రమంలోప్రధానిమోడీ ప్రధాని ఆర్వీరోడ్డునుంచి ఎలక్ట్రానిక్ సిటీ మెట్రస్టేషన్‌వరకూ మెట్రోలో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో విద్యార్థులతో ముచ్చటించారు. రూ. 15,610 కోట్లతోకూడిన బెంగళూరు మెట్రోఫేజ్-3 ప్రాజెక్టును ప్రధాని ప్రారంబించారు. ఆర్వీరోడ్డునుంచి బొమ్మసంద్రవరకూ 19 కిలోమీటర్లకుపైగా ఉన్న ఈ మార్గంలో సుమారు 16 స్టేషన్లు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు 7160 కోట్లు అని మెట్రో ఎండి వివరించారు. కొత్తప్రాజెక్టుతో హోసూరురోడ్డు, సిల్క్‌బోర్డ్ జంక్షన్, ఎలక్ట్రానిక్స్ సిటీ జంక్షన్ వంటి అనేక రద్దీగా ఉండే కారిడార్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుందని ఎల్లోలైన్‌కోసం మూడు రైలు సెట్లు వచ్చాయని, నాలుగోది ఈనెలలోనే వస్తుందని మోడీకి అధికారులువివరించారు.

**మూడు వందేభారత్‌రైళ్లుప్రారంభం**

అంతకుముందు బెంగళూరు పర్యటనలో ప్రధానిమోడీ బెంగళూరు బెలగావి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. అక్కడినుంచే వర్చువల్‌గా అమృత్‌సర్ కాత్రా, నాగ్‌పూర్ పూణె, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా జెండా ఊపి ప్రారంభించారు. బెంగళూరు బెళగావి వందేభారత్‌ర ఐలులోప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా నగరంలోని ఆర్వీరోడ్డు బొమ్మసంద్రమధ్య ఎల్లోలైన్ 19.15 కిలోమీటర్ల మార్గాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికెశివకుమార్; కేంద్రమంత్రులు మనోహర్‌లాల్‌ఖట్టర్, శోభా క్లాందజే, గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని కెఎస్ఆర్ బెంగళూరు రైల్వేస్టేషన్ నుంచి ఆర్వీస్టేషన్‌వైపు కాన్వాయ్‌గా వస్తుండగా రోడ్డుకు ఇరువైపులా పెద్దసంఖ్యలో గుమికూడిన ప్రజలు మోడీ మోడీ అంటూ పెద్దపెట్టున నినాదాలుచేస్తూ మోడీ కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించారు.

## జైలుశిక్ష వేయండి

>> గరిష్ఠంగా ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించాలని కోరుతూ ఈడీ ఢిల్లీలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. దీంతోపాటు, ఈ కేసులో అక్రమంగా సంపాదించిన రూ. 38.69 కోట్ల విలువైన 43 స్థిరాస్తులను ప్రభుత్వపరం చేయాలని కూడా కోరింది. ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ కంప్లైంట్‌ను పరిశీలించిన ప్రత్యేక కోర్టు, వాద్రాకు నోటీసులు జారీ చేసింది. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించే అంశంపై నిర్ణయం తీసుకునేందుకు కేసును ఈనెల28వ తేదీకి వాయిదా వేసింది. గురుగ్రామ్‌లోని భూమి అమ్మకానికి సంబంధించి తప్పుడు వివరాలతో దస్తావేజులు సృష్టించారని ఈడీ తన చార్జిషీట్‌లో ప్రధానంగా ఆరోపించింది. భూమి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి చూపారని, దీనివల్ల హర్యానా ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ రూపంలో రూ. 44 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొంది. అమ్మకం దస్తావేజులో భూమి విలువను రూ. 7.50 కోట్లుగా చూపినప్పటికీ, వాస్తవానికి అంతకంటే ఎక్కువ మొత్తం చేతులు మారినట్లు ఈడీ తెలిపింది. ఈ లావాదేవీల ద్వారా రాబర్ట్ వాద్రా రూ. 58 కోట్ల వరకు అక్రమంగా ఆర్జించారని, ఇది మనీలాండరింగ్ ద్వారా వచ్చిన సొమ్ము అని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌లలో మనీలాండరింగ్ జరిగినట్లు దర్యాప్తులో గుర్తించామని వెల్లడించింది. కేసులోని నిందితులు, వారికి సంబంధించిన కంపెనీల కార్యాలయాలు, బ్యాంకు ఖాతాలు ఎక్కువగా ఢిల్లీలోనే ఉన్నందున, ఇక్కడి ప్రత్యేక కోర్టులో కేసు దాఖలు చేసినట్లు ఈడీ స్పష్టం చేసింది. ఈ కేసులో వాద్రా, ఇతర నిందితులకు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ 4 కింద గరిష్ఠ శిక్ష విధించడంతో పాటు, ఐపీసీ సెక్షన్ 423 (మోసపూరిత దస్తావేజుల సృష్టి) కింద కూడా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఈడీ కోర్టును అభ్యర్థించింది.

## తేలని సినీ సమ్మె

>> అంతేకాకుండా సారథి స్టూడియోస్‌లో జరుగుతున్న సీరియల్ షూటింగ్‌ను అడ్డుకునే క్రమంలో కాస్ట్యూమర్స్ యూనియన్‌కు చెందిన ఇద్దరి మధ్య గొడవ చోటుచేసుకుంది. యూనియన్ కార్యదర్శి నరసింహ, సభ్యుడు సత్యనారాయణ మధ్య జరిగిన వాగ్వాదం దాడి వరకూ వెళ్లింది. దీనిపై పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు అయింది. హీరోలకు వందల కోట్లు ఇచ్చే నిర్మాతలు, తమకు రోజువారీ వేతనం 100 రూపాయలు పెంచడానికి ఎందుకు వ్యతిరేకిస్తున్నారని సినీ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గత నాలుగేళ్లుగా వేతనాల పెంపు గురించి అడగలేదని, ఇప్పుడు అడిగితే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంబై నుంచి డాన్సర్లు, హెయిర్ డ్రెస్సర్లు, లైట్ మెన్లను తీసుకొచ్చే ఖర్చులో సగం తమకిచ్చినా తమ జీవితాలు మెరుగు పడతాయని అంటున్నారు. తక్కువ వేతనాలతో కాలం గడుపుతున్నామని, ఉద్యోగులకు ఎవరికైనా నెల మొత్తం జీతం వస్తే, తమకు నెలలో సగం రోజులు కూడా పని ఉండదని, అందుకే వేతనాలు పెంచాలని కోరుతున్నామని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక సంఘాలు, నిర్మాతల మండలి ఒకరిపై ఒకరు ఆరోపణలు, సవాళ్లు విసురుకుంటున్నాయి. కార్మికుల సమ్మెకు స్పందించిన నిర్మాతల మండలికూడా గట్టిగాసమాధానం ఇస్తోంది. యూనియన్ల నుంచి మాత్రమే కార్మికులను తీసుకోవాల్సిన అవసరం లేదని, దేశంలో ఎక్కడైనా లోకల్ టాలెంట్ అందుబాటులో ఉన్నప్పుడు ముంబై, చెన్నై నుంచి కూడా తీసుకొని షూటింగ్‌లు పూర్తి చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. వేతనాలు పెంచే విషయమై ఇప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఫిల్మ్ ఫెడరేషన్ నేతలు లేబర్ కమిషనర్‌ను కలిసి ఈ సమస్యను విన్నవించారు. చిరంజీవిని కలిశారు. ఇతర సినీ పెద్దలతోనూ చర్చలుజరుపుతున్నారు. కానీ ఇవేవీ పరిష్కారం దిశగా అడుగులు ముందు పడడం లేదు. పైగా తమ అనుమతి లేనిదే షూటింగ్‌లు నిర్వహించడానికి వీలులేదని, అలా కాదని జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మాతల మండలి హెచ్చరించింది.

## బిజెపిలోకి గువ్వల

>> తమ ఓటు షేర్ పెరుగుతుందని అన్నారు. తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచన చేస్తున్నానని, నగరంలో వర్షం పడుతుంది, పరిస్థితులు బాగాలేవు అన్నారు. ఢిల్లీకి వెళ్లకుండా నగరంలో ఉండి మున్సిపల్ శాఖ మీద సమీక్షా చేయాలని, జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నానని అన్నారు. హిమాచల్, కర్ణాటక, తెలంగాణాలో కాంగ్రెస్ గెలిచింది. అప్పుడు ఓట్ల చోరీ గుర్తు రాలేదా రాహుల్ గాంధీకి అంటూ ప్రశ్నించారు. ఫేక్ ఓట్ల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. దేశ రక్షణ కోసం ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. పదవుల కోసం నేను బిజెపిలో చేరలేదని, కార్యకర్తలకు చెప్పకుండా బిఆర్ఎస్‌కు రాజీనామా చేసినందుకు క్షమించాలని కోరారు. తెలంగాణ ఎవరి వల్ల వచ్చిందో జనాల్లోకి తీసుకువెళ్లడానికి నేను సిద్ధమని గువ్వల బాలరాజుకు అహంకారం ఎక్కువ కాబట్టి ఓడిపోయారు అన్నారు. మరి కెసిఆర్ ఎందుకు అధికారంలోకి రాకుండా పోయారు అంటూ ప్రశ్నించారు. కెటిఆర్‌నాకంటే 6 నెలలు పెద్ద అంతే.. నన్ను బచ్చ అంటున్నారు. గత ఎన్నికల్లో నా ఓటమి కోసం బీఆర్ఎస్ పెద్దలు ప్రయత్నం చేశారు. బీజేపీలో చేరుతుంటే సోషల్ మీడియాలో నాకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. అనవసరంగా బిఆర్ఎస్ నేతలు నా చేరికపై చర్చించవద్దని కోరుతున్నా అన్నారు. ఇష్టారాజ్యంగా పోస్టులు పెడితే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## నిబంధనకు చెల్లు!

>> తెలంగాణ మంత్రివర్గం నిర్ణయిస్తుంది. తెలంగాణ హైకోర్టు ఇంతకుముందు ఇద్దరు పిల్లల నిబంధనను సమర్థించింది, దీనిని తొలగించడం ప్రభుత్వమే నిర్ణయించాలని పేర్కొంది. పట్టణ మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటికే ఈ నిబంధనను రద్దు చేసినందున, గ్రామీణ అభ్యర్థులపై ఈ నిబంధన వివక్ష చూపుతుందని పిటిషనర్లు వాదించారు. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. ఈ నిబంధన పాతదని, చైనా కూడా ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రజలను ప్రోత్సహిస్తోంది. రాబోయే పంచాయతీ ఎన్నికలకు తెలంగాణ కూడా దీనిని తొలగించాలన్నారు. వృద్ధాప్య జనాభాపై ఆందోళనలు, యువతరాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నందున, ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేయడానికి దేశవ్యాప్తంగా పెరుగుతున్న ధోరణిని ఈ చర్య ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

11-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
విదియ ఉ.10.32
శతభిష మ.12.58
వర్జ్యం : సా.5.25-6.31
దు.మ.12.39-1.30, మ.3.12-4.03
శుభసమయం : ఉ.9.10-9.45, సా.6.30-7.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**వృషభం :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. షేర్ల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మిథునం:** గతంలో మీకు సహాయం చేసిన వారికి ఉప్పుడు మీరు మీవంతు సహాయసహకారాలు అందిస్తారు.

**కర్కాటకం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. వివాదాలకు దూరంగా ఉండండి.

**సింహం:** నూతన పెట్టుబడులకు అనుకూలకాలం. ముఖ్యమైన పనులలో తొందరపాటు వద్దు.

**కన్య :** ఉద్యోగులకు అనుకోకుండా బదిలీలు ఉంటాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**తుల :** రాజకీయ, పారిశ్రామిక రంగాల లోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి.

**వృశ్చికం:** సోదరులనుండి శుభవార్తలు అందుకుంటారు. జీవితభాగస్వామి సహాయసహకారాలు అందుకుంటారు.

**ధనుస్సు:** ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన. అహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పుతుంది.

**మకరం:** దూరప్రాంతాలలో ఉన్న మీవారి క్షేమసమాచారం ఆనందానికి కారణం అవుతుంది.

**కుంభం:** అనేకాంశాలు అనుకూలంగా ఉన్నా నిష్కారణమైన చికాకులు కొంత అశాంతికి గురిచేస్తాయి.

**మీనం :** జీవితభాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. సంతాన పురోభివృద్ధి బాగుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రమంతా హై అలర్ట్

>> ఆరెంజ్ అలర్ట్, 23 జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం బీభత్సం సృష్టించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వానలు పడ్డాయి. శనివారం రాత్రి సమయంలో నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, ఆదివారం మధ్యాహ్నం సమయానికే మళ్లీ భారీ వర్షం మొదలైంది. సాయంత్రం కూడా వర్షం కురిసింది. ఉప్పల్, రామాంతపూర్, బోడుప్పల్‌లో భారీ వర్షం కురిసింది. పిర్జాదిగూడ, మేడిపల్లి సహా పలు చోట్ల భారీ వర్షం పడింది. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అలర్ట్ మోడ్‌లోకి వచ్చింది. పరిస్థితిని నిరంతరం సమీక్షించాలంటూ ప్రభుత్వం అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా శనివారం పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. అబ్దుల్లాపూర్‌మెట్‌లో అత్యధికంగా 13.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బేగంబజార్ 12.4, ఖైరతాబాద్ 11.9, తొర్రూరులో 11.6, చార్మినార్11.2, నాదర్‌గూల్ 10.5, హిమాయత్ నగర్ 10.3, ముషీరాబాద్ 10.2, నాంపల్లి 10.1, ఆసిఫ్ నగర్ 9.7, హయత్‌నగర్ 9.5, అంబర్‌పేట 9.2, మైత్రీవనం 7.6, బంజారాహిల్స్ 6.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మెదక్ జిల్లా కాగజ్‌మద్దూర్‌లో 7.2 సెంటీమీటర్ల వర్షం పడింది. రుతుపవన ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల వల్ల రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కాగా, సోమవారం సైతం రాష్ట్రంలో ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. పలు జిల్లాల్లోనూ కుండపోత వాన కురిసింది. జోరు వర్షానికి జనం అవస్థలు పడ్డారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కృష్ణ మండలం గూడూరు దగ్గర ఈదురు గాలులతో కూడిన వర్షానికి రహదారిపై చెట్టు విరిగిపడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సంగంబండ జలాశయానికి భారీగా వరద వచ్చి చేరింది. భద్రాచలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వీధులు, రహదారులు జలమయం అయ్యాయి. వాహనాలు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. భద్రాద్రి సీతారామచంద్ర స్వామి వారి ఆలయం వద్ద గల అన్నదాన సత్రం ఎదుట రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు చేరింది. దీంతో సత్రంలోని టేబుల్లు, పాత్రలు వర్షపు నీటిలో తడిచాయి. శనివారం రాఖీ పండుగ కావడంతో బయటకెళ్లిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌లో ఎక్కడికక్కడ రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఎటూ కదలలేక పోయారు. వరద ప్రభావిత ప్రాంతాలకు ముందే చేరుకున్న హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. మూసీ పరివాహక ప్రాంతంలో వర్షం పడిన కొద్ది సమయానికే నాలాల నీరు రోడ్లపైకి చేరింది. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో వరద నీరు కారణంగా వాహనాలను రోడ్ డైవర్షన్ చేశారు. ఆదివారం కూడా వర్షాలు హైదరాబాద్‌ను ముంచెత్తాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలకు కీలక అలర్ట్ వచ్చేసింది. ఈ నెల 13వ తేదీ నుంచి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతోంది. ఈశాన్య బంగాళాఖాతం వరకు కొనసాగుతున్న ద్రోణి కారణంగాఈ వర్షాలు తెలంగాణతోపాటు ఏపీలో కూడా ప్రభావం చూపించనున్నాయి. ఈ క్రమంలో ఆగస్టు 14 నుంచి 17 వరకు తెలంగాణ అంతటా వర్షాల హెచ్చరిక జారీ అయింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఒకటి లేదా రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా.

స్వాతంత్ర దినోత్సవం (ఆగస్టు 15) నాడు కూడా వర్షాలు జోరుగా కురిసే అవకాశం ఉంది. కాగా, కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రాజెక్టులకు మళ్లీ వరద తాకిడి పెరిగింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం పూర్తి స్థాయిలో నిండగా, అక్కడి నుంచి లక్ష క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు అంతకంతకూ వరద ప్రవాహం పెరుగుతోంది. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం ఉంది. ప్రాజెక్టు 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 1.09 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

## నగర వరద ప్రాంతాలను పరిశీలించిన సిఎం రేవంత్

>> వర్షాలకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం నగరంలో ఆకస్మిక పర్యటన జరిపారు. వరద ప్రభావిత ప్రాంతాలైన అమీర్‌పేట, బుద్ధనగర్, బల్కంపేట, మైత్రీవనం ప్రాంతాలలో ముఖ్యమంత్రి పర్యటన చేశారు. బుద్ధనగర్‌లో డ్రైన్‌సిస్టమ్‌ను పరిశీలించి అధికారఉలకు తగు సూచనలు చేశారు. కాలనీ రోడ్డుకంటే డ్రైనేజి కాలువ ఎక్కువ ఎత్తులో ఉండడంతో ఇరుకుగా మారి వరద తీవ్రత పెరుగుతుందని సీయం అధికారులతో వ్యాఖ్యానించారు. వెంటనే డ్రైనేజ్ సిస్టంను స్ట్రీమ్‌లైన్ చేసి వరదనీరు సాఫీగా వెళ్ళేలా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. పక్కనే ఉన్న గంగూబాయి బస్తీ కుంటను కొంతమంది పూడ్చివేసి పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని స్థానికులు సీయంకు ఫిర్యాదు చేశారు. గంగూబాయి కుంట ప్రాంతాన్ని సీయం స్వయంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఒక ప్రత్యేక ట్రంక్‌లైన్ ఏర్పాటు చేసి వరద సమస్యకు శాశ్విత పరిష్కారం చూపాలని, వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయూలని అధికారులను ఆదేశించారు. ఇటీవల వరదనీరు నిలిచిపోయిన మైత్రీవనం వద్ద పరిస్థితిని పరిశీలించి స్థానికులనుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాశ్విత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు అక్కడికక్కడే పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు ముందుగానే పక్కాగా ప్రణాళిక వేసుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. వరద తీవ్రత, ముంపు ఏఏ ప్రాంతాలలో ఏర్పడతాయో ముందుగానే గమనించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు సమయంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా మ్యాన్‌హోల్స్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, అలాగే వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచనలు చేశారు. సీయం వెంట హైడ్రా కమీషనర్ రంగనాథ్. జీహెచ్ఎంసీ కమీషనర్‌తో సాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## ఫాస్టాగ్ వార్షిక పాస్ 15 నుంచి అమలులోకి

>> జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుబాటు అవుతుందని అధికారులు స్పష్టం చేశారు. ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే, సమృద్ధి మహామార్గ్, అటల్ సేతు వంటి రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని రహదారులపై ఈ పాస్ పనిచేయదు. అటువంటి మార్గాలలో ప్రయాణించేటప్పుడు ఫాస్టాగ్ వ్యాలెట్ నుంచి యథావిధిగా టోల్ రుసుము కట్ అవుతుంది. ఒక వాహనంపై తీసుకున్న పాస్‌ను మరో వాహనానికి బదిలీ చేయడానికి వీలుండదు. అలాగే, 200 ట్రిప్పులు లేదా ఏడాది గడువు ముగిసిన తర్వాత పాస్ గడువు ముగుస్తుంది. వినియోగదారులు కావాలనుకుంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పాస్‌కు ఆటో రెన్యూవల్ సౌకర్యం ఉండదు.



రాంచీలో ఆదివారం నిర్వహించిన తిరంగా యాత్రలో భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించిన దృశ్యం

## నీటిదోపిడీని సహించం

>> వేసి అండగా నిలబడతామని అన్నారు. రాష్ట్రంలో గత పాలకుల నిరక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు చేపట్టిన ప్రాజెక్టులను పట్టించుకోకపోయినా, ప్రస్తుతం తమ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకునేలా భవిష్యత్ తరాలకు మార్గదర్శకమైన రీతిలో ప్రాజెక్టుల నిర్మాణం పై దృష్టి సారించి తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు అవకాశాలపై దృష్టి సారించి పాలనను అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో లేని ముంపు మండలాలను కేసీఆర్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందాలతో దారా దత్తం చేసిందని, తద్వారా గిరిజన ఆదివాసి లకు చెందిన రెండు లక్షల ఎకరాల భూమి పోలవరం ప్రాజెక్టు కింద నష్టపోవాల్సి వచ్చిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో కృష్ణా గోదావరి జలాల లో తెలంగాణ వాటాను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి అంగుళం భూమిని సస్యశ్యామలం చేసుకోవడం జరుగుతుందని అన్నారు. మధిర నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం నిర్మాణం చేపడుతున్న జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా సాగర్ టెలెండ్ లో ఉన్న మధిర ఎర్రుపాలెం మండలాల పరిధిలోని 30 గ్రామాలకు చెందిన 33 వేల ఎకరాల భూమి కి సాగునీటి అందించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగర్ మూడో జోన్ కింద ఉన్న ఈ భూములను రెండోజోన్ కిందకు మార్పు చేసేందుకు నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం సర్వేలు ప్రతిపాదనలు పూర్తి చేసిందని తెలిపారు. మధిర నియోజకవర్గ ప్రజల ఆశలను ఆకాంక్షలను నెరవేర్చే విషయంలో నియోజకవర్గంలోని కట్టలేరు వైరా మున్నేరు నదుల ద్వారా ప్రవహించే నీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు 2009!! 14 కాలంలో ప్రాజెక్టులు స్కీముల కోసం నిధులు మంజూరు చేయించడం జరిగిందని, దానిలో భాగంగానే పండ్రేగుపల్లి వద్ద, జాలిముడి వద్ద సాగు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆనకట్టల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఆ తర్వాత పదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం నాటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, బసకచర్ల ప్రాజెక్టుపై వెనక్కు తగ్గేది లేదని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా నీటి తరలింపును ఇప్పటికే వ్యతిరేకించామని అన్నారు. గత పాలకులు లక్ష కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి కాలంలోనే కూలిందని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి పిసిఘోష్ నిర్వహించిన విచారణ నివేదిక ప్రాజెక్టు రూపకల్పన నిర్మాణం లోపాలు అన్నింటికి గత పాలకులదే బాధ్యత అని తేల్చిందని స్పష్టం చేశారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి జరిగిందని ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో నిరక్ష్యానికి గురైన రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణాలు అభివృద్ధి కార్యక్రమాలను రహదారుల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. రెవిన్యూ గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో పేదోడి సంక్షేమం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని అన్నారు. గత పాలకులు చేసిన 8 లక్షల కోట్ల రూపాయల అప్పులతో ఒకవైపు సతమతమవుతున్నా పదేళ్లలో అమలు కానీ పేదోని కలను సహకారం చేసేందుకు నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఇండ్లను విడతల వారీగా మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో టిఆర్ఎస్ బిజెపి పార్టీల నాయకులు మాట్లాడుతున్నట్లు అప్పులతో ఆర్థిక వెసులుబాటు పరిస్థితులు లేకున్నా ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనుభవజ్ఞులైన మంత్రులు అనితరమైన కృషితో అసాధ్యమని అనుకున్న వాటిని సుసాధ్యం చేసేందుకు ప్రయత్నిస్తూ ప్రజల్లో విశ్వాసం నమ్మకాన్ని కలిగించడం గర్వంగా ఉందని అన్నారు. అనుభవజ్ఞులైన మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇన్చార్జి మంత్రిగా పనిచేస్తున్నాననీ ఇది నా అదృష్టమని అన్నారు. ఈ బహిరంగ సభలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మాజీ మధిర శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు ఏదీ భరోసా?

>> మాత్రమే రూ.50.39 కోట్లు అందించినట్లు తెలిసింది. ఏఆర్ఈజిఏ ఎన్ఐసీ డేటా ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 48,13,966 జాబ్‌కార్డులు ఉండగా, వీటిలో 93,61,614 మంది కూలీలు మాత్రమే నమోదైనట్లు తెలిసింది. ఉపాధి హామీలో 20 రోజులు పని చేసిన వారు 3,82,209 ఉండగా సోంత భూమి ఉన్నవారు (20 రోజులు పని చేసినవారు) రైతుభరోసా లబ్దిపోందిన వారు 15,39,812 మంది మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం ఐఏబీ పథకం కింద 5,80,577 మంది ఉన్నట్లు గుర్తించి గ్రామాలవారీగా జాబితాలు విడుదల చేసింది. జాబితాలో లేని అర్హులైన కూలీలు దరఖాస్తు చేసుకోవచ్చని గ్రామసభల ద్వారా ఆహ్వానించింది ఆ సభల్లో 2.24 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వీటిలో 19,193 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. 59,542 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.

మరో 1,44,784 దరఖాస్తులను తిస్కరించినట్లు తెలిసింది. వీటిలో కూడా అనేక అంక్షలు, కోతలు విధించగా మొత్తం 5.80 లక్షల మందితోపాటు కొత్తగా దరఖాస్తులు చేసుకున్నవారు 20 వేల మంది ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే సుమారు 6 లక్షల మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయాల్సి ఉంటుందంటున్నారు.. ఈ ఇదే విషయాన్ని ప్రభుత్వం కూడా నిర్ధారించినట్లు తెలిసింది.

వీరందరికి ఆర్థిక భరోసా అందించాలంటే ఒక్కో విడత రూ.360 కోట్లు అవసరం అవుతాయి. బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.600 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిగాయి .మొదటి విడుతలో ఈ పథకానికి రూ.50.33 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇంకా 5లక్షల మందికి పైగా సుమారు రూ.6 వేలు అందించాల్సి ఉండగా ఇంత వరకు ఆ మొత్తం విడుదల చేయనట్లు తెలిసింది.

2023-24 ఆర్థిక సంవత్సరం ఎన్ఆర్ఈజిఏ, ఎన్ఐసి ప్రకారం ఉపాధి హామీ కూలీల వివరాలు ఇలా ఉన్నాయి.

**తెలంగాణలో ఉపాధి హామీ కూలీలు 93,61,614.**
**20 రోజులు పని చేసిన వారు 38,02,209**
**20 రోజులు పనిచేసిన రైతు భరోసా లబ్దిదారులు 15,39,812**
**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాని అర్హులు,5,80,577**

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గోల్‌మాల్

>> సమాచారం. ఈ వ్యవహారంలో సెక్రటేరియట్ కు చెందిన ఒక ఉద్యోగి ప్రమేయం కూడా ఉన్నదని, చెక్కులు మంజూరయ్యే సమయంలో లబ్ధిదారుల వివరాలను ఆయన ఇక్కడి వ్యక్తులకు చేరవేసేవాడనీ సమాచారం.

దీనితో ఎం ఎల్ ఏ క్యాంప్ కార్యాలయంలో పని చేసే వారు లబ్ధిదారుల పేర్లు, ఇంటి పేర్లతో సరిపోయే వ్యక్తుల వివరాలు వెతికి పట్టుకొని వారికి కొంత మొత్తం ఆశ చూపి వచ్చిన చెక్కులను నకిలీ లబ్ధిదారులకు అందించేవారు. చెక్కులు డ్రా చేసిన తరువాత వాటాలు వేసుకుని పంచుకున్నారు. ఈ విధంగా సింగారం కు చెందిన ఒక వ్యక్తి పేరిట మంజూరైన చెక్కును ఏకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట మండలం బూడవాడ కు చెందిన వ్యక్తి తో డ్రా చేయించారు. ఈ తంతు 2020 కరోనా సమయం నుండి జరుగుతున్నదని సమాచారం.

కరోనా సమయంలో సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులు మంజూరీ లో జాప్యం జరగడంతో అక్రమార్కులు ఇదే అవకాశంగా తీసుకుని ఈ దందా కు తెరలేపారు. సీ ఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొని సంవత్సరం గడిచిన చెక్కులు రానివారు క్యాంప్ కార్యాలయంలో సంప్రదిస్తే మీకు చెక్కులు రాలేదు, త్వరలోనే వస్తాయని చెప్పేవారు. ఈ విధంగా వారు గత 4 సంవత్సరాల్లో 100 కి పైగా చెక్కులను డ్రా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ స్కాం విలువ సుమారు కోటి యాభై లక్షలకు పై ఉందని సమాచారం. ఈ క్రమంలో తమకు చెక్కులు రాని కొందరు దరఖాస్తుదారులు ఇటీవల ప్రస్తుత ఎం ఎల్ ఏ పద్మావతి కి ఫిర్యాదు చేయడం తో చెక్కుల గోల్ మాల్ విషయం బయటపడింది. కాగా ఇప్పటివరకు ఎన్ని చెక్కులు ఇలా డ్రా చేశారు, ఎంత మొత్తం దుర్వినియోగం చేశారనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదు. చెక్కుల గోల్ మాల్ విషయం బయటకు తెలియడం తో గతంలో సీ ఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొని చెక్కులు రానివారు తమ వివరాలతో క్యాంప్ ఆఫీసుకు వెళుతున్నారు.

దీనిపై ఇప్పటికే పోలీసులు ప్రాథమికంగా విచారణ ప్రారంభించారని, బీ ఆర్ ఎస్ కు చెందిన నాయకుల ప్రమేయం పై విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకొని రహస్యంగా విచారణ జరుపుతున్నారని, ఈ స్కాంలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే విషయం పై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

మొత్తం ఈ వ్యవహారం కోదాడ నియోజకవర్గం లో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఆసుపత్రులలో చికిత్స పొంది, ఆర్థికంగా నిస్సయ స్థితిలో ఉన్నవారి చెక్కులను నకిలీ పేర్లతో కాజేయడం పట్ల లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




# నోయిడాలో నకిలీ పోలీస్‌స్టేషన్!

**లక్నో, ఆగస్టు 10:** ఘరానా మేధావి నేరగాళ్లు ఏకంగా నకిలీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. నకిలీపత్రాలు, నకిలీ ఐడీలు, పోలీసుల చిహ్నాలతో డబ్బులు దోచుకుంటున్నారు. వైబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విరాళాలు కూడా సేకరిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. నోయిడాలోని ఫేజ్ 3 ప్రాంతంలో నకిలీ అంతర్జాతీయ పోలీస్ కార్యాలయం, అంతర్జాతీయ నేర దర్యాప్తు సంస్థను కొందరు వ్యక్తులు ఏర్పాటు చేశారు. అంత ర్జాతీయ దర్యాప్తు సంస్థ సభ్యులుగా వారు నటిస్తున్నారు. నకిలీ పత్రాలు, నకిలీ గుర్తింపు కార్డులు, పోలీస్ చిహ్నాలను ఉపయోగించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఐఎన్‌టి ఎల్‌పిఎస్‌క్రిమ్‌డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విరాళాలు కూడా సేకరిస్తున్నారు. దీని కోసం నకిలీ జాతీయ, అంతర్జాతీయ ధృవీకరణ పత్రాలను అందులో పోస్ట్‌చేశారు. కాగా, ఇటీవలే ఏర్పాటు చేసిన ఈ నకిలీ ఇంటర్నేషనల్ పోలీస్‌స్టేషన్ గురించి నోయిడా పోలీసులకు తెలిసింది. దీంతో వారు అక్కడకు వెళ్లి తనిఖీ చేయడంతోపాటు దానిని సీజ్ చేశారు. నకిలీ ఐడీలు, నకిలీ పత్రాలు, పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఇటీవల బహిర్గతమైన నకిలీ విదేశీ రాయబార కార్యాలయం మాదిరిగా ఈ నకిలీ అంతర్జాతీయ పోలీస్ స్టేషన్ వెలుగులోకి రావడం కలకం రేపింది.

# అటవీ అధికారుల దాడి ఘటన

## 35 మందిపై కేసు నమోదు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణ కేంద్రం పరిధిలో గల జన్నారం అటవీ డివిజన్‌లో అటవీ శాఖ అధికారులపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో 35 మంది గిరిజనులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శుక్రవా రం సాయంత్రం పోడు భూమి విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం కారణంగా గిరిజనులు అటవీ శాఖ అధికారులపై దాడులకు పాల్పడ డం తెలిసిందే. కవ్వాల్ సెక్షన్‌లోని పాలగోరి అటవీ ప్రాంతంలో సిర్పూర్ (యు)కు చెందిన కొందరు గిరిజనులు గుడిశెలు వేసుకోవడం, వాటిని అట వీ శాఖ అధికారులు తొలగించడంతో నెలకొన్న వివాదం ఈ దాడికి దారి తీసింది. ఒక పథకం ప్రకారం కొందరు గిరిజనులు అటవీ శాఖ అధికారుల కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారని ఇంధన్‌పల్లి రేంజి అధికారి శ్రీధరా చారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో ఇద్దరు అటవీ అధికారులు గాయపడ్డారని ఆయన తెలిపారు. కాగా ఈ ఫిర్యాదు మేరకు 35 మందిపై కేసులు నమోదు చేయగా ఈ ఘటనలో గిరిజనలను మోతీరాం అనే వ్యక్తి దాడికి ఉసిగొల్పినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనలో నిందితులపై అటవీ, వన్యప్రాణి చట్టాల ప్రకారం కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో నిందితులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

# సాగర్ ఎడమకాలువకు గండి

## గేట్లు మూసివేసి నీళ్లు వదిలారు

## కుంచపత్తి వద్ద తెగిపోయిన కాలువ

## వరదకు కొట్టుకుపోయిన వరి పొలాలు

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త :** నీటిపారుదల శాఖ అధికారులు కళ్లు మూసు కున్నారు ఎడమకాలపై దించి ఉన్న గేట్లను ఎత్తకుండానే నీటిని విడుదల చేయడంతో ఒక్కసారిగా కాలువ గండిపడి వందలాది ఎకరాల్లో సాగులో ఉన్న వరి పంటకు నష్టం జరిగింది వేంసూరుమండలం కుంచపత్రి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది ఎగువన కురుస్తున్న వర్షాలకు నాగార్జునసాగర్ జలాశయం నిండిపోవడంతో పాలేరు రిజర్వాయర్కు నీటిని విడుదల చేశారు దీంతో పాలేరు రిజర్వాయర్ నుంచి నీటిని ఇటీవల సాగర్ ఎడమ ప్రధాన కాలువకు వదిలారు మంత్రులు అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు కానీ అధికారులు నిరక్ష ్యంల్ల వహించడం వలన కనీసం నీళ్ళు వదిలే సమయంలో కాలువలను పరిశీలించి ఎక్కడెక్కడ గేట్లున్నాయి వాటి పరిస్థితి ఏంది అనే విషయాన్ని కూడా పరిశీలించకపోవడంతో సాగర కాలువకు గండి పడింది ఈ సంఘటన పూర్తిగా ఇరిగేషన్ శాఖ అధికారుల నిరక్ష ్యంల్లగానే చెప్పుకోవచ్చు వరి నాట్లు వేసే సమయంలో ప్రధాన కాలువకు గండిపడటంతో ఈ ప్రాంతంలో రైతాంగం ఆందోళన చెందుతున్నారు అంతేగాక వందలాది ఎకరాల్లో వేసిన వరి పైరు కొట్టక పోయింది సత్వరమే గండిని పూడ్చి నీటిని తిరిగి విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుకుంటున్నారు అలాగే గత దశాబ్ద కాలంగా సాగరు ఎడమ ప్రధాన కాలువకు ఎలాంటి మరమత్తులు చేయలేదు.

దీంతో కాలువపై ఉన్న యూటలు మేజర్లు మైనర్లు ఆనవాళ్లు కోల్పోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి ప్రధాన కాలువ చెట్లు ముళ్లపొదలతో నిండిపోయిందిదీంతో కాలువల్లోనీరు సక్రమంగా ప్రవహించడం లేదు ఒకవైపు కాలువల పరిస్థితి ఇలా ఉంటే అధికారులు నీళ్లు వదిలి కళ్ళు మూసుకొని ఉండటంతో గండి పడింది నీళ్లు విడుదల చేసే సమయంలో కాలువపై ఎక్కడెక్కడ మేజర్లు ఉన్నాయి ఎక్కడెక్కడ మైనర్లు ఉన్నాయి ఎక్కడెక్కడ లాక్కులు ఉన్నాయనే విషయాన్ని కూడా పరిశీలించకుండా విడుదల చేయటం అధికారుల నిరక్ష ్యంల్ల నిరక్ష్యాన్లికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు నీటిపారుదల అధికారులు ఇంతటి నిరక్ష ్యంల్లతో రైతులు తీవ్రంగా నష్టపోయారు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొని కాలువకు తక్షణమేనీటిని విడుదల చేయాలని గండి పడిన కాల్వకు మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో ముగ్గురి అరెస్టు

## రూ.60 లక్షల విదేశీ గంజాయి జప్తు

## బ్యాంకాక్ నుంచి వస్తుండగా పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో విదేశాల నుంచి స్మగ్లింగ్ అవుతున్న గంజాయి ఆగడం లేదు. ఇప్పటికే ఆరు నెలల వ్యవధిలో నాలుగు ముఠాలు హైబ్రీడ్ గంజాయిని విదేశాల నుంచి భారత్‌కు రవాణా చేస్తూ దొరికిపోగా తాజాగా మరో ముగ్గురు ఇదే తరహాలో పట్టు బడ్డారు. పట్టుబడ్డ ముగ్గురు భారత్‌కు చెందిన వారుగా తేలింది. ఈ నెల ఏడవ తేదీన రాత్రివేళ బ్యాంకాక్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో వచ్చిన ఇద్దరు యువకులు తమ లగేజ్ బ్యాగ్‌లో హైబ్రీడ్ గంజాయిని ప్యాకింగ్ చేసి వుంచి తీసుకు వస్తుండగా ఇందిరా గాంధీ అంతర్జా తీయ విమా నాశ్రయంలో కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తుండగా దొరికి పోయారు. దీని తరువాత థాయి ఎయిర్‌లైన్స్‌లో బ్యాంకాక్ నుంచి ఢిల్లీకి వచ్చిన మరో యువకుడు కూడా ఇదే తరహాలో లగేజ్ బ్యాగ్‌లో హైబ్రీడ్ గంజాయి దాచివుంచి తీసుకురాగా పట్టు బడ్డాడు. ముగ్గురి వద్ద పట్టుబడ్డ గంజాయి ఆరు కిలోలుగా నిర్ధా రించారు. దీని విలువ అంతర్జా తీయ మార్కెట్‌లో 60 లక్షల రూపాయలుగా కస్టమ్స్ అధికారులు తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాం డుకు తరలించారు. వీరికి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలతో సంబంధం ఉందనే కోణంలో విచారిస్తున్నారు.



ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుబడిన గంజాయి

# హెచ్‌సిఎ అక్రమాలపై సిఐడికి ఆగని ఫిర్యాదులు

## ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి గోల్‌మాల్‌కు పాల్పడినట్లు మాజీ కోశాధికారి శ్రీధర్ ఫిర్యాదు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాలపై సిఐడికి ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే వుంది. గత ఐపిఎల్ సీజన్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ యాజ మాన్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు గొడవలు పెట్టు కుంది మొదలుకుని వరుసగా హెచ్‌సిఎకు షాకులు తగులుతుండడం తెలిసిందే. హెచ్‌సిఎ అక్రమాలపై ఇంతకు ముందే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ జరిపి భారీగా అక్రమాలు జరిగి నట్లు నిర్ధారించగా దీని తరువాత ఈ వ్యవహా రాలపై సిఐడి విచారణకు సర్కారు ఆదేశించడం విదితమే. ఈ క్రమంలో నెల రోజుల క్రితం హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు సహా ఐదుగురు కార్యవర్గ సభ్యులను సిఐడి అరెస్టు చేసింది. ఈ కేసు ఇంకా విచారణలో వుంది. కాగా తాజాగా హెచ్‌సిఎలో ఉపాధ్యక్షుడుగా వున్న దల్జీత్‌సింగ్, జాయింట్ సెక్రటరీగా వున్న బసవ రాజుపై హెచ్‌సిఎ మాజీ కోశా ధికారి చిట్టి శ్రీధర్ సిఐడికి ఫిర్యాదు చేశారు. వీరిద్దరు మల్టీపుల్ క్లబ్ ఓనర్‌షిప్ ప్రయో జనాలతో హెచ్‌సిఎ ఎన్నికల్లో గెలుపొందారని చిట్టి శ్రీధర్ తన ఫిర్యాదులో తెలిపారు. సిఐడితోపాటు హెచ్‌సిఎను ప్రస్తుతం పర్యవేక్షిస్తున్న అంబుడ్స్‌మెన్‌కు కూడా ఆయన ఫిర్యాదు చేశారు. 2022 వరకు కమర్షి యల్ ట్యాక్సెస్ క్రికెట్ క్లబ్‌కు బసవరాజు ప్రాతినిథ్యం వహించారని శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం నుంచి పదవీవిరమణ తరువాత బసవరా జు దల్జీత్‌సింగ్ కుటుంబానికి చెందిన అమీర్‌పేట్ క్రికెట్ క్లబ్ ఉపాధ్యక్షుడుగా 2023లో బాధ్యతలు చేబట్టారని ఆయన తెలి పారు. అయితే దల్జీత్ సింగ్ కుటుంబం ఆధ్వర్యంలో అమీర్‌పేట్ క్రికెట్ క్లబ్, ఖాల్సా క్లబ్‌లు నడుస్తున్నాయని శ్రీధర్ తెలిపారు. గతంలో మల్టిపుల్ క్లబ్ ఓనర్‌షిప్ ప్రయోజనాల కారణంగా 57 క్లబ్‌లపై జస్టిస్ లావు నాగేశ్వరరావు వేటు వేశారని, ఇదే నిబంధనల ప్రకారం దల్జీత్‌సింగ్ కుటుంబానికి చెందిన క్లబ్‌లపైనా వేటువేయాలని శ్రీధర్ కోరారు. ఈ రెండు క్లబ్‌ల నుంచి హెచ్‌సిఎ ఉపా ధ్యక్షుడు, జాయింట్ సెక్రటరీ పోస్టులను దల్జీత్‌సింగ్, బసవ రాజులు దక్కించుకున్నారని ఆయన ఆరోపిం చారు. అక్రమంగా ఎన్నికైన హెచ్‌సిఎ కార్యవర్గా న్ని రద్దుచేసి తక్షణమే ఎన్నికలు నిర్వహిం చాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. హెచ్‌సిఎ అంబుడ్స్ మెన్‌కు అందిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి అధి కారులు శ్రీధర్ నుంచి వివరాలు సేకరించారు.

# సృష్టి ఫర్టిలిటీ కేంద్రం గోల్‌మాల్‌పై రంగంలోకి ఇడి

## వివరాలు ఇవ్వాలని సిటీ పోలీసులకు లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సృష్టి ఫర్టిలిటీ కేంద్రం గోల్‌మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) రంగంలో దిగింది. హైదరాబాద్ పోలీసులు సృష్టి ఫర్టిలిటీ కేంద్రంలో జరుగుతున్న చైల్డ్ ట్రాఫికింగ్ అక్రమాలను రట్టు చేయడం తెలి సిందే. పిల్లలు కలగని దంపతులకు సరోగసి ద్వారా పిల్లలు కనేలా చేస్తామని లక్షలాది రూపాయలు దండుకుని, నవజాత శిశు విక్రయ ముఠాల నుంచి పిల్లలను కొనుగోలుచేసి ఈ పసికందులను దంపతులకు అంటగడుతున్నట్లు పోలీసులు తేల్చడం విదితమే.

ఈ కేసులో ఇప్పటి వరకు కేం ద్రం నిర్వా హకురాలు డాక్టర్ నమ్రతతో పాటు 30 మంది అరెస్టు చేయగా మరో 20 మందికిపైగా పరారీలో వున్నారు. వీరికోసం దేశవ్యాప్తంగా గాలి స్తున్నారు. కాగా సృష్టి ఫర్టిలిటీ కేంద్రం దేశవ్యాప్తంగా గల శిశువిక్రయ ముఠా లతో సం బంధాలు కలిగి వుండి, పదుల కోట్ల రూపాయలను దండుకుందని, ఇదంతా మనీలాండరింగ్ కోణంలో జరిగిందని నిర్ధారించిన ఇడి దీనిపై విచారించేం దుకు నిర్ణయించింది. సృష్టి ఫర్టిలిటీ కేంద్రంపై ఐదేళ్లుగా అనేక ఆరోపణలు వస్తుండడం కూడా ఇడి రంగంలో దిగేందుకు కారణమయ్యింది. ఈ క్రమం లో సృష్టి ఫర్టిలిటీ కేంద్రంపై హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను తమకు అందించాలని ఇడి అధికారులు లేఖ రాశారు.

# నేను అలా అనలేదు.. ఫ్లోలో వచ్చిందంతే!

## మాజీమంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** సమావేశం ఏదైనా.. ఎక్కడా తడబడ కుండా.. ఉన్నది ఉన్నట్లు చెప్తూ.. ప్రజల్లో తనదైన శైలిలో గుర్తింపు పొందిన మాజీమంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. శనివారం రాఖీ పండుగ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తనకు 73 యేళ్లు వచ్చాయని.. రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఆలోచిస్తున్నానని చెప్పిన మల్లారెడ్డి.. ఇప్పుడు మాటమార్చారు. ఆదివారం జవహర్‌నగర్‌లో మీడియాతో మాట్లా డుతూ.. తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని అనలేదని స్పష్టం చేశా రు. తన మిత్రుడితో జపాన్‌లో ఎలాగైతే ఉద్యోగాలకు రిటైర్మెంట్ ఉండదో, రాజకీయాలకూ రిటైర్మెంట్ ఉండదనే చెప్పానని మల్లారెడ్డి వివరణ ఇచ్చారు.


**భారత్ డైనమిక్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) రక్షణ మంత్రిత్వ శాఖ
గచ్చిబౌలి, హైదరాబాద్ - 500032

రిఫరెన్స్: BDL/CC/OT/GT/003/2025-26 తేది: 11.08.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
స్వదేశీ పోటీ బిడ్డింగ్‌కు ఆహ్వానిస్తూ

| క్ర.సం. | టెండర్ ID | వివరణ | అంచనా రూ.లలో |
|---|---|---|---|
| 1 | 66438 | BDL రూప్స్, ఐరాచ్ వద్ద ఫ్లేమ్ ప్రూఫ్ విద్యుత్ పనులు నిర్వహణ | 359.53 లక్షలు |

తదుపరి వివరాలకు డ్యాష్‌బోర్డ్‌పై ఆన్‌లైన్ టెండర్స్ సెలక్ట్ https://bdltenders.abcprocure.com వెబ్‌సైట్ దయచేసి వీక్షించండి. బిడ్స్ ఆన్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయవలెను. "ఏదైనా సవరణ, మా ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే జారీ చేయబడును మరియు వార్తా పత్రికలలో కాదు"
*బిడ్డర్లు BDL వెబ్‌సైట్ https://bdl-india.in/registration-contractors నిబంధనావళిలో, ఆన్‌లైన్ విక్రేత నమోదు నిమిత్తం దరఖాస్తు చేయవలసినదిగా కోరడమైనది.

అడిషనల్ జనరల్ మేనేజర్ (Corp Comml)

**భారత్ డైనమిక్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) రక్షణ మంత్రిత్వ శాఖ
గచ్చిబౌలి, హైదరాబాద్ - 500032

రిఫరెన్స్: BDL/CC/OT/GT/004/2025-26 తేది: 11.08.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
స్వదేశీ పోటీ బిడ్డింగ్‌కు ఆహ్వానిస్తూ

| క్ర.సం. | టెండర్ ID | వివరణ | అంచనా రూ.లలో |
|---|---|---|---|
| 1 | 66439 | BDL, ఇబ్రహీంపట్నం యూనిట్ వద్ద ప్రహరీ గోడ యొక్క నిర్మాణం | 93.19 లక్షలు |

తదుపరి వివరాలకు డ్యాష్‌బోర్డ్‌పై ఆన్‌లైన్ టెండర్స్ సెలక్ట్ https://bdltenders.abcprocure.com వెబ్‌సైట్ దయచేసి వీక్షించండి. బిడ్స్ ఆన్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయవలెను. "ఏదైనా సవరణ, మా ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే జారీ చేయబడును మరియు వార్తా పత్రికలలో కాదు"
*బిడ్డర్లు BDL వెబ్‌సైట్ https://bdl-india.in/registration-contractors నిబంధనావళిలో, ఆన్‌లైన్ విక్రేత నమోదు నిమిత్తం దరఖాస్తు చేయవలసినదిగా కోరడమైనది.

అడిషనల్ జనరల్ మేనేజర్ (Corp Comml)





వార్త


ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.

**న-సోక్రటీస్**

# బాధల 'భాగ్య'నగరం!

పాలకుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్లు స్వలాభాపేక్ష, మితిమీరిన రాజకీయ జోక్యం, వీటన్నింటిని మించిన దళారుల ఆధిపత్యం, అవినీతితో దక్షిణభారతదేశంలోనే గుర్తింపు పొందిన అత్యంత ప్రతిష్టాకరమైన హైదరాబాద్ మహానగర పరిస్థితి రానురాను దారుణంగా తయారవుతున్నది. ఒకపక్క నేతలు భాగ్యనగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తుంటే మరొకపక్క నగరవాసులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. మొన్న గురువారం నుండి సాయంత్రం వేళల్లో కురుస్తున్న వర్షాలకు రోడ్లు చెరువుల్లాగా మారి ముఖ్యంగా కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు పడిన వెతలు అన్నీఇన్నీ కావు. శనివారం రాత్రి వరుణుడు మరింతగా విజృంభించాడు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం వరదప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు.భారీ వర్షాలకే కాదు చిన్నపాటి జల్లులకు కూడా బాగ్యనగర్ ప్రజలకు బాధలు తప్పడంలేదు. వేలాది పంచాయతీలకు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఆదర్శంగా ఉండాల్సిన ఈ కార్పొరేషన్ పరిస్థితి దినదినం దిగజారుతూనే ఉన్నది. ఒకపక్క రోడ్ల వెడల్పు పేరుతో ఇండ్లు కూలగొడుతున్నారు. మరొకపక్క రోడ్లను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రాతో కొంతలో కొంత మేలు జరుగుతున్నా పూర్తిస్థాయిలో ఆక్రమణలను నిరోధించలేకపోతున్నారు. రాజకీయ కారణాలతోపాటు ఇంకెన్నో కారణాలు తోడుకావడంతో పెద్దపెద్ద ఆక్రమణలవైపు కన్నెత్తి చూడలేకపోతున్నది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా కార్పొరేషన్ నుంచి అనుమతి పొందిన ప్లాన్లలో మార్పులు చేసి నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ఇక చెరువులను ఆక్రమించుకొని ప్లాట్లు చేసి అమ్ముకోవడం ప్రస్తుతానికి కొంతమేరకు తగ్గింది. మురికికాలువలను కూడా వదిలిపెట్టడం లేదు. మరమ్మతుల పేరుతో రోడ్లపై కోట్లాది రూపాయలు గుమ్మరిస్తున్నారు. ఒకపక్క రోడ్లు వేస్తుంటే మరొకపక్క పెచ్చులేచి గుంతలు ఏర్పడుతున్నాయి. మొన్న ఏకంగా ట్యాంకరే నడి రోడ్డులో ఏర్పడిన ఒక గుంతలో దిగబడిపోయింది.అందులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను,క్లీనర్‌ను స్థానికులు స్పందించి కాపాడగలిగారు.అదే ప్రయాణీకులతో వెళుతున్న బస్సు ఇలా ప్రమాదానికి గురైతే వూహించడానికే భయం వేస్తుంది. ఇక చిన్నచిన్న గల్లీల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. డ్రైనేజీల పైపుల సైజులు పెంచకుండా ఇష్టానుసారంగా వందల సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇస్తున్నారు. దీంతో మురుగు నీరు పట్టక పైపులు పగిలి రోడ్లపైకి ప్రవహిస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో వరద నీరు వెళ్లే పైపుల్లోకే మురికి నీరు కలపడంతో దుర్గంధభూయిష్టంగా మారి రోడ్లు నిండిపోతున్నాయి. ఈ పరిణామాలు దోమలకు స్థావరాలై మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫ్లూలాంటి జ్వరాలు పెరిగిపోతున్నాయి. వీటి నిర్మూలనకు వాడే మందుల గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు చెప్తున్నా నిధుల్లో ఏమేరకు క్షేత్రస్థాయికి చేరుకుంటున్నాయో ఒక్కసారి నగరపరిస్థితి పరిశీలిస్తే చెప్పకనే చెబుతున్నది. ఒకనాడు మంచినీటి వనరుగా ఉన్నమూసీ నది హైదరాబాద్ నగర విస్తరణతో కాలుష్యకాసారంగా మారిపోయింది. నదీ పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు కూడా కలుషితమైపోయాయి. మూసీలోకి వచ్చే మురికి నీటిని పూర్తిగా శుద్ధి చేసి తిరిగి నదిలోకి వదిలే ప్రాజెక్టు కింద కోట్లాది రూపాయలు వెచ్చించినా ఫలితం లేకుండా పోతున్నది.గతంలో మూసీ నదిలో ఆక్రమణలు తొలగించి సుందరీకరణ చేపట్టడానికి మహానగర పాలకసంస్థ రూ.750 కోట్లతో ఒక ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.ఇప్పుడు నూతనంగా మూసీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నడుం కట్టింది. వేలాది కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. వాస్తవంగా చూసినా హైదరాబాద్‌నగర పాలక సంస్థకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఒక నిర్ధిష్ట ప్రణాళిక ప్రకారం హైదరాబాద్‌ను విస్తరించారు. 1869 వరకు హైదరాబాద్‌కు ప్రత్యేక పరిపాలనా సంస్థ అంటూ ఏమీ లేదు. మొదటిసారిగా మహ్మద్ కులికుతుబ్‌షాహీ కాలంలో పది చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చార్మినార్ పరిసరప్రాంతాలను 12 మెహలాల్ (మండలాలు)గా విభజించారు. ఒక్కొక్క మెహలాల్‌లో వీధికి ఇరువైపులా వెయ్యి ఇళ్ల చొప్పున పన్నెండువేల ఇళ్లను నిర్మించారు. నగర పోలీసు కమిషనర్‌కు చీఫ్ మెజిస్ట్రేట్ మున్సిపల్ కమిషనర్ అధికారాలు కూడా అప్పగించారు. 1934లో ప్రజలు పాలక మండలిని ఎన్నుకునే అవకాశం కల్పించారు. దీంతో సిటిజన్ కౌన్సిలింగ్ ఆవిర్భవించింది. కానీ 1942లో ప్రభుత్వ అధికారులకు పాలక మండళ్ల మధ్య వివాదం ఏర్పడడంతో కౌన్సిల్‌ను రద్దు చేసి పాలనా బాధ్యతలను అధికారికి అప్పగించారు. 1957లో సికింద్రాబాద్ కూడా హైదరాబాద్‌తో కలిసి వంద మున్సిపాల్ డివిజన్ కార్పొరేషన్‌గా అవతరించింది. ఇలా అంచెలంచెలుగా విస్తరిస్తూ గ్రేటర్ హైదరాబాద్‌గా అవతరించింది. ఇంకా రోజురోజుకు విస్తరిస్తూనే ఉంది. గ్రామాల్లో నెల కొన్న పరిస్థితుల దృష్ట్యా పల్లెల నుంచి వలసబాటలు పెరిగిపోయాయి. ఇప్పటికే జనాభా కోటిదాటి ఉండొచ్చు. విశ్వనగరం చేస్తే చేయండి కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మీనమీషాలు లెక్కించకుండా పెరిగిన పెరుతున్న జనా భాకు అనుగుణంగా కనీస మౌలిక వసతులు కల్పించి భాగ్యనగర వాసుల బాధలు కొంతవరకైనా తగ్గించాలిన బాధ్యత పాలకులపై ఉంది.

ఇరవై యేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్క కాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.



సిసిరో

ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణుకువతో మెలగాలి.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### మద్యం విక్రయ కేంద్రాలను తొలగించాలి

**ఇటీవల** ఏపిలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జనవాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడు వివిధ జంక్షన్‌లోకి వచ్చే జనం ఆ మార్గం గుండావస్తారు.మద్యసేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతి మించి కొట్టుకుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగా పడిపోయి అక్కడే పడుకుంటున్నారు. కుటుంబాల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్నారు. దుకాణదార్లు ఏమిచేయలేక పోతున్నారు. ఇకపై కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది .

- బొల్లోజు మేఘానథ్, విశాఖపట్నం

### ఇజ్రాయెల్ ఆట కట్టించాలి

**పాలస్తీనా** దేశంతో చేసిన యుద్ధంలో గాజా పౌరులు దాదాపు డెబ్బై వేలమందిసైనికులు,సామాన్యులు చనిపోవడమేగాక, స్థిర చరాస్తులు కూడా నాశనమైనాయి. మరో ఘోరమైన దుర్ఘటన ఏమంటే గాజాలో ఆకలిగొన్న వారికి ఆహారం తీసుకొస్తున్న వాహనాన్ని తన సైనిక బలంతో ఆపివేయడం వలన ఆకలి బాధ భరించలేక అనేక పసి ప్రాణాలు గాలిలో కలసి పోయాయి. ఇజ్రాయెల్ ప్రధాని అసలు మనిషేనా అనే అనుమానం వస్తోంది. ఈదురాగతాన్ని చూస్తూ ఊరుకుంటున్న సభ్య దేశాలు ఇజ్రాయెల్‌ను గట్టిగా మందలించలేవా?బ్రిటన్,ఫ్రాన్స్,కెనడా స్వల్పంగా మందలించడంతో కడుపు నిండని ఆహార పదార్థాలను అందించడానికి ఒప్పుకున్నాడట. లేకపోయినట్లయితే ఈ పాపంలో అన్ని దేశాలు పాలుపంచుకున్నట్లే.

- ఎన్. రామారావు, నల్గొండ

### డిఏ బకాయిలు చెల్లించాలి

సామాన్య ప్రయాణికులకు అందుబాటులేని టికెట్స్ ధరలతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, బుల్లెట్ రైళ్ల పేరుతో హడావుడి చేయడం మినహా సాధారణ ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా రెగ్యులర్‌రైళ్లను నడపకపోవడం, కొన్ని పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడం పలువురి ప్రాణాలను బలిగొంటోంది. సామాన్యుల బాధను ప్రభుత్వం ఎప్పుడు గుర్తిస్తుందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుల బాధలు పట్టించుకోండి.

- డి. వెంకట్, కర్నూల్

### విద్యావిధానాల్లో సమూల మార్పులు రావాలి

**చైనాలో** వ్యవసాయానికి విద్యకు చాలా ప్రాధాన్యత ఇస్తారు. చైనాలో విద్య వాళ్ల మాతృభాషలో ఉంటుంది. బాగా చదివి చైనా విద్యార్థులు చైనా కోసమే పని చేస్తారు. మనదేశంలో కూడా విద్యా విధానాల్లో సమూల మార్పులు తీసుకురావాలి. ప్రతి గ్రామంలోనూ ఈరోజుల్లో పదవ తరగతి పాసైన యువతులు ఉన్నారు. ఎల్కేజీ నుండి 5వ తరగతి వరకు ప్రతి పాఠశాలలో ఎలిమెంటరీ స్కూల్‌ను ఆ గ్రామంలో పెళ్లి కాని యువతుల చేతరన్ చేయించాలి. ఆరవ తరగతి నుండి ప్లస్‌టు వరకు హైస్కూల్ విద్యగానే మార్పులు చేసే ప్రతి సబ్జెక్టు వంద మార్కులు ఉండేలాగా చూడాలి. అవసరంలేని ఆర్ట్స్ కామర్స్ సబ్జెక్టులు మూసివేయాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### కఠిన చర్యలు అవసరం

**మద్యం** సేవించి డ్రైవింగ్ హైదరాబాద్‌లో ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారింది.వాహనదారులే కాకుండా, అమాయక ప్రయాణికులు, బాటసారులు కూడా ఈ ప్రమాదానికి గురవుతున్నారు. పట్టుబడిన వారిలో ఎక్కువమంది 18 నుండి 40 ఏళ్ల మధ్యవారే. వారిరక్తంలో మద్యం స్థాయిలు ప్రమాదకరంగా ఎక్కువగా ఉన్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం సేవించి డ్రైవింగ్ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం.మద్యం సేవించి వాహనం నడపడం కేవలంచట్ట ఉల్లంఘనేకాదు, ఇదిప్రాణాలకు ప్రమాదకరం. దీనివల్ల ప్రమాదాలు, గాయాలు,మరణాలు జరుగుతున్నాయి. కుటుంబాలు దెబ్బతింటున్నాయి. ఆరోగ్య సేవలపై భారం పెరుగుతోంది.

- వి. కృష్ణ కుమార్, హైదరాబాద్

### జీవవైవిధ్య పరిరక్షణ

**మానవునికి** ప్రకృతి, జీవవైవిధ్యం రెండు కళ్లు వంటివి. ఆధునిక మానవుని జీవనశైలి మార్పు వలన పర్యావరణ లేమితో పుడమి వేడెక్కిపోవటంతో పాటు జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వన, జల, జీవరాశులున్న దేశాల్లో ఇండియ స్థానం8వది. ఈసంవత్సరం జీవవైవిధ్య దినోత్సవం నినాదం ప్రకృతితో సామరస్యం, స్థిరమైన అభివృద్ధి. భారత్‌లో ఉన్న 18 జీవావరణ ప్రదేశాల పరిరక్షణ కోరకు ప్రజల్లో జీవ, పర్యావరణంపై అవగావనను ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలి. కళాశాలలో గ్రీన్ క్లబ్ ద్వారా పచ్చదనం పెంపొందించాలి.

-షేక్ మీరా, రాజమండ్రి

**మన వేదిక** **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అనాదిగా బిసిలకు అన్యాయమే!

*ఇటీవల కాలంలో బీహార్‌లో ఐదు వారాల్లోనే కులగణన చేశారనే విషయాన్ని ప్రభుత్వం గు ర్తుంచుకోవాలి. బీసీల రిజర్వేషన్లు పెరిగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, మండల పరిషత్ ఛైర్మన్, జెడ్పిటిసి, జిల్లా పరిషత్ ఛైర్మన్, పట్టణ కౌన్సిలర్, మున్సిపల్ ఛైర్మన్,నగర కార్పొరేటర్,నగర మేయర్ లాంటి ఉన్నత పదవుల్లో బీసీల రిజర్వేషన్లు ఎంతగానో ఉపకరిస్తాయి. ఇలా బీసీల రాజకీయ ప్రాధాన్యం, ప్రాతినిధ్యం కూడా పెరుగుతుంది. కాబట్టి బీసీ నాయకులు ఏ పార్టీలో ఉన్నా కూడా రాజకీయ విభేదాలు పక్కన పెట్టి ఐక్యతగా ఉండి ముందుకు నడిచినప్పుడే రాజ్యాధికారం చేపట్టగలుగుతారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్టు బోధించు, సమీకరించు, పోరాడు వంటి సందేశాన్ని బీసీలు ఆదర్శంగా తీసుకొని ఒక ఉద్యమాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. అలా చేసినప్పుడే బీసీల లక్ష్యాలు, సామూహిక డిమాండ్లు నెరవేరుతాయి. అప్పుడే బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక ఎదుగుదల సాధ్యమవుతుంది.*



డాక్టర్ మోటె చిరంజీవి

తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులు, వృత్తి, విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కుటుంబ పరిస్థితులు ఆర్థిక స్థితిగతులు ఇలా మొదలైనటువంటి వివరాలను సేకరించాలనే ఉద్దేశంతో ఈ కుల గణన చేయాలని నిశ్చయించుకున్నారు. 1931 తర్వాత కులగణన జరగకపోవడం వల్ల చాలా కులాలకు సంక్షేమ ఫలాలు అందక అభివృద్ధిలో కూడా వెనుకబడిపోయారు. ఈ సంపూర్ణ కులగణన ద్వారా వారి స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలవడంతోపాటు, వారికి ఏం చేయాలో అనేటువంటి విషయం కూడా తెలుస్తుందని ప్రభుత్వం యోచించి, సంపూర్ణ కుటుంబ సర్వే వల్ల జనాభా ప్రాతిపదికన బడ్జెట్, నిధులు, రిజర్వేషన్లు పెంచడం వీలవుతుంది. గతంలో తమిళనాడులో 1982లో అంబాకర్ కమిషన్ నూరు శాతం జనాభా కులగణన కుటుంబ సర్వే వల్ల 69 రిజర్వేషన్లకు ఆధారమైంది. 2016లో కర్ణాటకలో ఇలాంటి సంపూర్ణ సర్వే నిర్వహించారు. నిజానికి కులగణన డిమాండ్ 1950 నుంచి ఉన్నది. బ్రిటిష్ పాలనలో 1881 నుంచి 1931 వరకు ప్రతి పదేండ్లకు ఒకసారి జరిగే జనాభా గణనలో కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించారు. నిజాం రాష్ట్రంలో కూడా సెన్సస్‌తో పాటు కులగణన జరిగింది కానీ 1951 సెన్సెస్ లో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఓబీసీల కులగణనను సమ్మతించకపోవడం వల్ల అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ డిమాండ్ కొనసాగుతూ ఉంది. ఈ మధ్య జాతీయ ప్రాధాన్యత అంశంగా మారింది. లెక్కల ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్టీలకు 1947 నుంచి, ఎస్టీలకు 1950 నుంచి రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఓబీసీలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ తీర్పు 1962 ప్రకారం రిజర్వేషన్లు 50 మించకుండా మండల కమిషన్ నివేదిక ప్రకారం ఉద్యోగాలలో 27, 1993 నుంచి, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో 93వ రాజ్యాంగ సవరణ ద్వారా 2006 నుంచి కల్పిస్తున్నారు. బీసీలను రాజకీయ పార్టీలు ఎప్పటికీ కార్యకర్తల్లాగానే చూస్తున్నాయి. వారికి ఉన్నత పదవులను కట్టబెట్టడం లేదు. ఓట్ల కోసం మాత్రమే వారిని వాడుకుంటున్నారు. బీసీలపై ప్రేమ చూపినట్టు నటించి, హామీలిచ్చి, అధికారంలోకి రాగానే బీసీలను పట్టించుకోవడం లేదు. అందుకే బీసీ నాయకులు ఉన్నతమైన రాజకీయ పదవులలో కనిపించడం లేదు. అందుకోసం బీసీలంతా ఐక్యంగా పోరాడవలసిన సమయం ఆసన్నమైంది. స్థానిక సంస్థల ఎన్నికలతో ఈ కులగణనకు ప్రత్యక్ష సంబంధం ఉంది. దీని ద్వారా రాజకీయ ముఖచిత్రమే మారిపోయే అవకాశంఉంది.పార్లమెంటు, అసెంబ్లీ,స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు ఉన్నాయి. వాటిని ఎవరూ కూడా మార్చలేరు. కానీ




బీసీలకు స్థానిక సంస్థల్లోనే తప్ప, పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో రిజర్వేషన్లు లేవు.స్థానిక సంస్థల ఎన్నికలముందు రిజర్వేషన్లను ప్రభుత్వాలు మార్చడం, చాలామంది కోర్టుకు వెళ్లడం, రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆధారమైనటువంటి కుల జనాభా లెక్కలు అడగడం గత ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నటువంటి విషయం. గతంలో 1986లో ఎన్టీ రామారావు ప్రభుత్వం హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయి. అప్పుడు 20శాతంగా ఉండేది. తర్వాత కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో 34 శాతానికి పెరగగా, 2019లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం దాన్ని 22 శాతానికి తగ్గించింది. ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితుల్లో బీసీ కులాల జనాభా వివరాలు సేకరిస్తే ఆ తర్వాత చట్టసభల్లో కూడా తమ సీట్ల సంఖ్య పెరగాలని,రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ వస్తుందనే నేపథ్యంలో పాలకవర్గాలకు చెందినటువంటి అగ్రనేతలు కొంత అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు బీసీకులాల జనాభా వివరాలను శాస్త్రీయంగా సేకరించాలి.ఈచేపట్టిన సర్వేకేంద్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం కూడా వీటిని గుర్తించేలా ఉండాలి. దేశజనాభాలో 56శాతంగా ఉన్నటువంటి బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఇటు అసెంబ్లీలోను, అటు పార్లమెంట్‌లోను ఎక్కువ సంఖ్యలో బీసీలు నష్టపోతున్నారు. బిసి నాయకులు ఉన్నత పదవుల్లో కనిపించడం లేదు. పార్లమెంట్‌లో 15 శాతం కూడా బీసీల బలం లేదు. దేశంలో 16 రాష్ట్రాల నుంచి ఒక్క బీసీ ఎంపీ కూడా లేరు.రిజర్వేషన్‌లు లేకపోవడం వల్ల ఆర్థికంగా ఉన్నటువంటి వారు మాత్రమే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తరతరాలుగా బీసీలకు అన్యాయం జరుగుతుంది. వారిని ఇప్పటికే ఎన్నో పార్టీలు మోసం చేశాయి. దేశంలో అధిక సంఖ్యలో ఉన్నటువంటి బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు కూడా లేవు. బీసీ బిల్లు కోసం ఉద్యమిస్తున్న వారి డిమాండ్లను ఎన్డీఏ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణనలోనైనా బీసీ జనగణన చేపట్టాలి. తెలంగాణలో వేగంగా కులగణన కార్యక్రమాన్ని చేపట్టిందికానీ దాని వివరాలు సంపూర్ణంగా లేవని బిసి నాయకుల వాదన. ఇటీవల కాలంలో బీహార్‌లో ఐదు వారాల్లోనే కులగణన చేశారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. బీసీల రిజర్వేషన్లు పెరిగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, మండల పరిషత్ ఛైర్మన్, జెడ్పిటిసి, జిల్లా పరిషత్ ఛైర్మన్, పట్టణ కౌన్సిలర్, మున్సిపల్ ఛైర్మన్,నగర కార్పొరేటర్,నగర మేయర్ లాంటి ఉన్నత పదవుల్లో బీసీల రిజర్వేషన్లు ఎంతగానో ఉపకరిస్తాయి. ఇలా బీసీల రాజకీయ ప్రాధాన్యం, ప్రాతినిధ్యం కూడా పెరుగుతుంది. కాబట్టి బీసీ నాయకులు ఏ పార్టీలో ఉన్నా కూడా రాజకీయ విభేదాలు పక్కన పెట్టి ఐక్యతగా ఉండి ముందుకు నడిచినప్పుడే రాజ్యాధికారం చేపట్టగలుగుతారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్టు బోధించు, సమీకరించు, పోరాడు వంటి సందేశాన్ని బీసీలు ఆదర్శంగా తీసుకొని ఒక ఉద్యమాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. అలా చేసినప్పుడే బీసీల లక్ష్యాలు, సామూహిక డిమాండ్లు నెరవేరుతాయి. అప్పుడే బీసీల రాజకీయ,ఆర్థిక , సామాజిక ఎదుగుదల సాధ్యమవుతుంది. ●

# తూర్పు తీరానికి వాణిజ్య ద్వారం


అప్పన్న గొనప

శ్రీకాకుళం జిల్లా తూర్పు తీర ప్రాంతం అభివృద్ధిలో అగ్రభాగంగా మారుతున్న ప్రాజెక్టు మూలపేట పోర్ట్. ఇది కేవలం ఓ పోర్ట్ కాదు, ఒక జిల్లా, ఒక ప్రాంతం, ఒక రాష్ట్రం ఆర్థిక-సామాజిక రంగాల్లో ఎలా పురోగమించగలదో చాటిచెప్పే చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. రాష్ట్రప్రభుత్వ విధానాలు, కేంద్ర ప్రభుత్వ మద్దతు, సంబంధిత శాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోంది. దీని ప్రభావం స్థానిక గ్రామాల జీవన విధానాల నుంచి అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులకు దారితీసే మార్గాల వరకూ విస్తరించబోతుంది. మూలపేట పోర్ట్ నిర్మాణానికి సుమారు రూ.4,362 కోట్ల పెట్టుబడి మంజూరై, దాదాపు 1,250 ఎకరాల్లో ఇది అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం నాలుగు బెర్తు (గోదాములు) నిర్మించబడుతున్నాయి. ప్రాథమికంగా ఇది సంవత్సరానికి 23.5 మిలియన్ల టన్నుల వాణిజ్య సామర్థ్యం కలిగిన పోర్టుగా అభివృద్ధి చెందుతుంది. బహుళ రవాణా విధానాలకు అనుకూలంగా ఉండేలా, 16-18 మీటర్ల లోతుతో నిర్మిస్తున్న ఈ పోర్ట్‌లో ప్యానమాక్స్, కేప్‌సైజ్ వాణిజ్య నౌకల రాకపోకలకు వీలుంటుంది. పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌తో మొదటి దశలో దాదాపు 25,000 ఉద్యోగాలు, తరువాత దశల్లో 35,000కు పైగా నేరుగా, పరోక్షంగా ఉద్యోగాలు కలుగుతాయని అంచనా. పరిశ్రమలు, హార్బర్లు, రవాణా కేంద్రాలు, ఉపశాఖలు ఏర్పడటంతో మిగిలిన గ్రామాలు నగరాల్లా మారే అవకాశముంది. ఈ ప్రాజెక్టుకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 200 కిలోమీటర్ల కోస్తా హైవే అనుసంధానం ప్రత్యేకంగా చెప్పుకోదగిన అంశం. భోగాపురం విమానాశ్రయం నుంచి మూలపేట పోర్ట్ వరకూ, అక్కడి నుంచి భీమిలి వరకూ ఈ హైవే సాగనుంది. ఇది సముద్ర-గగన రవాణా మౌలిక సదుపాయాలను సమన్వయం చేస్తుంది. ఈ మార్గాలు లాజిస్టిక్స్ రంగాన్ని వేగవంతం చేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడుల ప్రవాహానికి సహకరిస్తాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ కార్పొరేషన్' ఏర్పాటు చేస్తామనీ, 2026 డిసెంబర్ నాటికి మొదటి దశ పనులు పూర్తవుతాయనీ తెలిపారు. ఇప్పటికే మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ గేట్వే పోర్టుల ప్రగతికి సంబంధించి సమీక్షలు జరిగాయి. ఇందులో మూలపేట ప్రాజెక్ట్ 46.59పురోగతితో ఉంది. శ్రీకాకుళం జిల్లా తూర్పు తీరానికి అమలవుతున్న మూలపేట పోర్ట్ ప్రాజెక్ట్‌కి అనుకూలంగా, వివిధ రంగాల్లో పలు పరిధిలో అంతర్జాతీయ పెద్ద పెట్టుబడిదారులు ఆసక్తి కనబరిచారు. అంతర్జాతీయస్థాయి కంపెనీలు, గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లు, న్యూక్లియర్ రవాణా పథకాలు అనుసంధానం కలిగి ఉన్నాయి. సుమారు 10,000 కోట్ల పెట్టుబడితో చేపట్టబోయే ఈ ప్రాజెక్టు, 2029 నాటికి 180 కిలోటన్నులకు గ్రీన్ హైడ్రోజన్,1 మిలియన్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తికి లక్ష్యంగా ఉంది. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఎక్స్ ఆన్‌మొబిల్ కంపెనీ ఇప్పటికే 83,500 కోట్ల పెట్టుబడితో పెద్ద పరిమాణంలో పాలీమర్ పరిశ్రమ నెలకొల్పడానికి ముందుకొచ్చింది. వారు పరిశీలించిన భూమి ప్రదేశంలో 1,250 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ పరిశ్రమ నిర్మాణానికి తగిన వాతావరణం ఉందని నిర్ధారణకు వచ్చారు. ఇది రాష్ట్రానికి పరిశ్రమల పరంగా అత్యంత కీలక మలుపు. అలాగే యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన యంనా కంపెనీ సైతం మూలపేట సమీపంలో 20,000 కోట్ల విలువైన గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదన ఇచ్చింది. మరోవైపు కోల్‌కతా ఆధారిత హాల్దియా పెట్రోకెమికల్స్ సంస్థ శ్రీకాకుళం జిల్లాలో 1.2 లక్షల కోట్లతో పెద్ద కెమికల్ పార్క్ ఏర్పాటుపై ముందడుగు వేసింది. ఈ పరిశ్రమ కోసం దాదాపు 3,000 ఎకరాలు అవసరం అవుతుందని అంచనా.ఇక ముంబయిలోని కళ్యాణి స్టీల్స్ సంస్థ 30,000 కోట్ల పెట్టుబడితో, 2,000 ఎకరాల్లో పోర్ట్ ఆధారిత స్టీల్ ఫ్యాక్టరీను నెలకొల్పే ప్రతిపాదన తెచ్చింది. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కూడా ఈ ప్రాజెక్టులో 49శాతం వాటా కోసం ఆసక్తి చూపినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనపై సమీక్ష చేస్తోంది. 2030 నాటికి 145 మిలియన్ టన్నుల రవాణా సామర్థ్యం సాధించడమే లక్ష్యం.2047నాటికి దేశ రవాణాలో 20శాతం వాటా పొందాలని యోచన. అలాగే రాష్ట్ర జిడిపిలో లాజిస్టిక్స్ ఖర్చు 14 శాతం నుంచి 6-8 శాతానికి తగ్గించాలన్నది లక్ష్యంగా ఉంది. పోర్ట్ అభివృద్ధివల్ల కేవలం రవాణా రంగం మాత్రమే కాదు, మత్స్యకారులకు, ఫిషింగ్ హార్బర్లకు, అనుబంధ పరిశ్రమలకుఅనేక అవకాశాలు లభించనున్నాయి.పర్యాటకరంగానికి ఇది తోడ్పాటు కలిగించనుంది. ఆర్థిక కార్యకలాపాలు విస్తరించడంవల్ల పేదరికం తగ్గించడంలో ఇది ఓ కీలకపాత్ర పోషిస్తుంది. అదే సమయంలో విద్య,శిక్షణ,ఉపాధి అవకాశాలు పెరగడంవల్ల స్థానిక యువత ఉద్యోగ విభాగాల్లో ప్రవేశించగలుగుతారు. అయితే,ఈ ప్రాజెక్టుతోపాటు పర్యావరణ పరిరక్షణ,భూసేకరణ సమస్యలు, రైతుల హక్కులు, స్థానిక జనాభా మీద ప్రభావం వంటి అంశాలపై ప్రభుత్వం శ్రద్ధ వహించాల్సిన అవసరంఉంది.భూముల అభివృద్ధిలో రైతుల అభిప్రాయాలను, పునరావాసాన్ని గౌరవించాలి. పర్యావరణ అనుమతులు, అడవుల భూముల సమస్యలు, కోస్తా జోన్ నిబంధనలు - ఇవన్నీ సున్నితమైన అంశాలు కావడంతో ప్రాజెక్ట్ సుస్థిరతకు వీటిపై స్పష్టత అవసరం. ప్రభుత్వం తయారుచేసిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లో పర్యావరణ ప్రభావ అధ్యయనం కోస్తా రెగ్యులేషన్ జోన్ రూల్స్,ఫారెస్ట్ క్లీరెన్సెస్ మొదలైనవి పరిగణనలోకి తీసుకుంటూ ప్రణాళిక రూపొందించారు.ఈఅధ్యయనాల్లో స్థానిక సమాజాల అభివృద్ధి, వారికి కలిగే ప్రయోజనాలు, భూసేకరణ పరిహారాలు మొదలైన అంశాలు సైతం చేర్చబడ్డాయి. ఈపోర్ట్ కేవలం రవాణాకేంద్రంగా మాత్రమేకాకుండా, తూర్పుతీర అభివృద్ధికి దిశానిర్దేశకంగా మారుతోంది.ఇది దేశీయ వాణిజ్యానికి, అంతర్జాతీయ పెట్టుబడులకు తలుపులు తెరుస్తోంది. ●

# విద్యావ్యవస్థలో ఉన్నత ప్రమాణాలు పెరగాలి

డాక్టర్. వై. సంజీవ కుమార్

నాటి విద్య వ్యవస్థలో ఆధునిక వసతులు లేకున్నా, ఉపాధ్యాయులు, లెక్చెరర్ల, ప్రొఫెసర్లు నిజాయితీగా, నిబద్ధతతో ప్రతి విదార్థిపట్ల శ్రద్ధ తీసుకొని, నాణ్యమైన విద్యను అందించేవారు. అప్పటి చిన్నారులే నేడు అత్యున్నతమైన స్థానాలలో ఉన్నారు. కఠినమైన దండన విధించే స్వేచ్ఛ ఉండేది విద్యాపకులకు. నేటి విద్యావ్యవస్థలో అన్ని ఆధునీకమే అయినా సరైన విద్యను అందించలేకపోతున్నారు. నేడు అన్ని హంగులు, ఆర్భాటాలే, ప్రచారంలో తల్లిదండ్రుల ఆలోచనలను, ఆశలను గాలిలో విహరింపచేస్తున్నారు. నాడు ఉన్నతమైన విద్యలోకి అడుగు వేయడానికి పిల్లల మైండ్ సర్దుబాటు అవుతుందా లేదా, ఆ చదువుకు తట్టుకోగలరా లేదా అనేవి అన్ని అలోచించి అడుగు ముందుకు వేసేవాళ్లు. నేడు ప్రతి తల్లిదండ్రి కోరిక పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు, పెద్ద ఉన్నతమైన స్థానంలోకి వెళ్లాలి అనే ఆశలతోనే ఉంటున్నారు. వీళ్ల ఆలోచనలకూ తగ్గట్టు కార్పొరేట్ విద్యాసంస్థలు గాలిలో మెడలు కట్టిస్తున్నారు. తల్లిదండ్రులు తమ స్తోమతను మించి అడుగు ముందుకు వేస్తున్నారు. మరీ ముఖ్యంగా తమ పిల్లలు వత్తిడిని తట్టుకోగలరా లేదా అనేది ఆలోచించడం మానేశారు. ఉపాధ్యాయుల దండనకు కూడా తల్లిదండ్రులు యుద్ధానికి వెళ్తున్నారు. చదువుల్లో వెనకపడ్డామని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చదువు అందరికి అవసరమే ఆలా అని ప్రాణాలు తీసుకునే చదువులు అవసరం లేదు. తల్లిదండ్రుల అత్యాశకు విద్యార్థులు వత్తిడికి లోనవుతూ బలిదానం చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు క్షేత్రస్థాయి పరిశీలన చేయడంలేదు. విద్యార్థులకు సరైన అవగాహన కలిపించే వాళ్లు కరువైనారు. ప్రమాదం జరిగినప్పుడే హడావుడి చేసి మర్చిపోతున్నారు. నేటి విద్యావ్యవస్థలో వంద శాతంలో నుంచి 0.01 శాతంమంది మాత్రమే ఉన్నత చదువులో రాణిస్తున్నారు,మిగితా 99.99 శాతం విద్యపట్ల అవగానలేకపోవడం, వత్తిడికి లోనవడం, అనేక ఇతర కారణాల వలన మధ్యలో విఫలమవుతున్నారు. మరి కొందరు అన్నిట్లో ఉన్నతమైన మార్కులు వచ్చినా, చదివిన చదువులో ప్రాక్టికల్ నాలెడ్జి లేకపోవడం వలన కూడా విఫలమవుతున్నారు. పదవతరగతి తరవాత సరైన అవగాహన లేకపోవడం వలననే అనేక మంది విద్యార్థులు వేసే తప్పటడుగు వాళ్ల జీవితాలలో భారీమూల్యం చెలించుకోవలసి వస్తుంది. పలానా వాళ్లు ఈ కోర్స్ తీసుకున్నారు మనం కూడా ఆ కోర్స్ తీసుకోవాలి, వాళ్లుఈ పని చేసారు, నేను ఈ పని చేయాలి, వాళ్ళు ఎం సెంట్‌కి ప్రిపేర్ అవుతున్నారు, నేను ప్రిపేర్ అవ్వాలి, వాళ్ల పాలనా కాలేజీలో చేరినారు, మేము మా పిల్లలను అందులో చేర్పించాలి, అనే



ఆలోచనల నుంచి బయటపడ్డప్పుడే విద్యా వ్యవస్థలో వారికి ఏది అవసరం, ఏది చేయగలరు అనే మార్గం గోచరిస్తుంది. హంగు హార్భాటాలు ప్రచారం చేసుకునే విద్యాసంస్థలలో చేరాలి, అక్కడ చేరితేనే స్టేటస్ పెరుగుతుంది అనే ఆలోచనల నుంచి తల్లిదండ్రలు బయటకు రావాలి. ఎనిమిదవ తరగతి నుంచే ప్రతి విద్యార్థికి చదువులలో రకాలు, ఎం చదివితే ఏ వైపు వెళ్తే ఏవిధంగా జీవితం ఉంటుంది అనేది తెలియజేయగలిగితే పదవతరగతి వచ్చేసరికి వాళ్ళ ఆలోచనలు పరిణితి చెంది వాళ్ల విజయం సాదిస్తాం అనుకునే కోర్స్‌లోనే చేరుతారు. అలానే కష్టపడతారు, విజయం సాధిస్తారు. చదువుతోపాటు చిన్నప్పటినుంచే విద్యార్థులకు ఆటల పట్ల అవగహన కలిపించే విధంగా ప్రతి శనివారం ఆటల రోజుగా నిర్ణయించి అన్నిరకాల ఆటలు ఆడిస్తే విద్యార్థులలో ఆత్మస్థైర్యంతోపాటు ఆటల్లో ప్రావీణ్యం పొందే అవకాశం ఉంటుంది. నచ్చిన ఆటనుస్ఫూర్తిగా తీసుకోని ఆటలో రాణించడానికి అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు భవిష్యత్‌లో అన్నిరంగాలలో వచ్చేమార్పులను వివరించగలితే వాళ్ళమేధాశక్తి పెరుగుతుంది. ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు సాగుతారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ విషయానికి వస్తే నేటికీ మరుగుదొడ్లు, మూత్రశాలలు లేని పాఠశాలు దర్శనమిస్తాయి. ఉపాధ్యాయులు టెక్నాలజీ తగ్గట్టు విద్యార్థులకు నెరిపించే నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రతిబడిలో ఉన్నతమైన ప్రమాణాలు పాటించినప్పుడే విద్యార్థులకు చిన్నప్పటి నుంచే మంచి అవగాహనా అలవర్చుకోవడానికి అవకాశముంటుంది. విద్యావ్యవస్థను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికుంది. తల్లిదండ్రులు కూడా పాఠశాలలో, కళాశాలల్లో చేర్పించాము మా పనైపోయింది అనే భావన నుంచి బయటకు వచ్చి వాళ్ళుఎలా చదువుతున్నారు, వాళ్ళ విద్యాప్రమాణాలు ఎంతవరకు మెరుగుపడ్డాయి, పిల్లల ప్రవర్తన ఎలా ఉంది అన్ని గమనిస్తూ లోపాలను సరిచేస్తూ ఉన్నప్పుడే వాళ్ల ఉన్నతమైన చదువుచదవడానికి అవకాశం ఉంటుంది. ఉన్నతమైనస్థానాలను పొందేమార్గం ఏర్పడుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇచ్చి ఉపాధ్యాయులను ఉపయో గించుకోవడం తగ్గించి వాళ్ల పిల్లలకు భోదించే విద్యకు మెరుగైన ప్రమాణాలు జోడించి ప్రతి సంవత్సరం ఒక నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వగలిగితే ఉపాధ్యాయులు కూడా విద్యలో మెరుగవుతారు. విద్యార్థులకు మరింత సరి కొత్త విద్యను అందించే అవకాశం ఉంటుంది. మార్పు ఒక్క రోజుతో సాధ్యం కాదు, నిరంతరంగా ప్రక్రియ మార్పులు కొనసాగించినంత కాలం విద్యలో అనేక పెనుమార్పులు సంభవిస్తాయి. చదువును ఆధునీకరణ చేయడానికి అవకాశం ఉంటుంది. ●

# వచ్చే ఫిబ్రవరిలో బంగ్లా ఎన్నికలు

## మొదటి వారంలోనే నిర్వహణకు బంగ్లా ఇసి ఏర్పాట్లు, కచ్చితమైన తేదీ రెండు నెలల ముందే వెల్లడిస్తాం: ఇసి



**ఢాకా,ఆగస్టు 10:** బంగ్లాదేశ్‌లో 13వ పార్లమెంట్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో దేశంలో సాధారణ ఎన్నికల నిర్వహించనున్నట్లు బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడం సవాలుతో కూడుకున్న పని అని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం. నసీరుద్దీన్ అన్నారు. ఎన్నికలు నిర్వహించే కచ్చి తమైన తేదీని షెడ్యూలు ప్రకటించడానికి రెండు నెలల ముందే వెల్లడిస్తామని చెప్పారు. ప్రజలు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కోల్పోయారని, ఎన్నికల కమిషన్‌ది, ఎన్నికలు నిర్వహించే పరిపాలనా యంత్రాంగానిదీ అదే పరిస్థితి అని వెల్లడించారు. కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధ రించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామన్నారు. వచ్చే ఫిబ్రవరిలో దేశ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మొహ్మద్ యూనస్ ఈ నెల 5న ప్రకటించిన విషయం తెలిసిందే. రాబోయే రంజాన్ కంటే ముందుగానే అంటే 2026 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని ఈసీని కోరనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, జులై 2024 తిరుగుబాటు తర్వాత షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం పతనమైన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తిరుగుబాటు చేయడంతో చివరకు హసీనా ప్రభుత్వం ఆగస్టు 2024న పడిపోగా ఆమె భారత్‌కు చేరుకుంది. ఆ తర్వాత యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. గత కొన్ని నెలలుగా బంగ్లాదేశ్‌లోని రాజకీయ పార్టీలు తాజా సార్వత్రిక ఎన్నికలను డిమాండ్ చేస్తున్నాయి. కాగా, మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన ఆవామీలీగ్ కార్యకలాపాలను తాత్కాలిక ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో మరో మాజీ ప్రధాని ఖలీదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఈ ఎన్నికల్లో విజయం సాధించనుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికల్లో తాము పాల్గొంటామని బీఎన్‌పీ తాత్కాలిక అధ్యక్షుడు, ఖాలీదా కుమారుడు తారెఖ్ రెహ్మాన్ వెల్లడించారు. అయితే జూలైలో తిరుగుబాటు చేసిన నాయకుల నుంచి ఏర్పడిన కొత్త రాజకీయ పార్టీ నేషనల్ సిటిజన్ పార్టీ సైతం రానున్న ఎన్నికల్లో పోటీ చేయనుంది. దీంతో బంగ్లాదేశ్ ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచిచూడాల్సిందే.



## బీహార్ డిప్యూటీ సీఎంకు రెండు ఓటరు కార్డులు!

### ఆర్జేడి చీఫ్ తేజస్వి యాదవ్ ఆరోపణ

**పాట్నా, ఆగస్టు 10:** బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ వివాదం కొత్త మలుపు తిరిగింది. బీజేపీ నేత, డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు రెండు ఓటరు కార్డులున్నాయని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలను మీడియా ముందు బయట పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిన్హాకు వేర్వేరు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండు ఎపిక్ నంబర్లు ఉన్నాయని ఆరోపించారు. ఈ రెండు ఓటరు కార్డుల్లో ఆయన వయస్సు కూడా భిన్నంగా ఉన్నదని విమర్శించారు. బంకిపూర్ సెగ్మెంట్‌లో ఉన్న ఓటరు కార్డులో 60ఏళ్ల వయస్సు, లఖిసరాయ్‌లోని ఓటరు కార్డులో 57 ఏళ్ల వయస్సు ఉన్నదని తెలిపారు. 'ఈ రెండు ఎపిక్ నంబర్‌ల జారీకి సంబంధించిన పత్రాలపై ఆయన సంతకం చేసి ఉండాలి లేదా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ మొత్తం మోసపూరితమైనది' అయి ఉండాలి అని ఆరోపించారు. ఈ మోసానికి పాల్పడిన సిన్హాపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, తేజస్వి యాదవ్ ఆరోపణలను డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ఖండించారు. తన కుటుంబం గతంలో బంకిపూర్ అసెంబ్లీ ప్రాంతంలో నివసించిందని తెలిపారు. దీంతో అక్కడి ఓటరుజాబితా నుంచి తన పేరును తొలగించాలని కోరుతూ ఫారమ్ నింపినట్లు చెప్పారు. లఖిసరాయ్ ఓటరు జాబితాలో తన పేరును చేర్చినట్లు వివరించారు. 'జంగిల్ రాజ్ యువరాజు మోసం చేస్తాడు. మేం అలాంటి చర్యలకు పాల్పడం. దురదృష్టవశాత్తు రాజ్యాంగ పదవిలో ఉన్న ఒకరు సరైన జ్ఞానం లేకుండా రాజకీయాలను దుర్వినియోగం చేస్తున్నారు' అని తేజస్వి యాదవ్‌పై ఆయన మండిపడ్డారు.

# నిర్మలా సీతారామన్‌కు 'భారత లక్ష్మి' పురస్కారం



**ఉడుపి, ఆగస్టు 10:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కర్ణాటక ఉడుపిలోని శ్రీకృష్ణ మఠంలో పర్యటన సందర్భంగా ఆమెకు ఉడుపిలోని చారిత్రాత్మక శ్రీ కృష్ణ మఠం 'భారత లక్ష్మి' అనే ప్రతిష్ఠాత్మక బిరుదును ప్రదానం చేసి గౌరవించింది. ఆర్థిక మంత్రిగా ఆమె దేశానికి అందిస్తున్న నిస్వార్థ సేవలకు, నిజాయితీతో కూడిన అంకితభావానికి గుర్తింపుగా ఈ బిరుదును అందించారు. ఈ సత్కారాన్ని పర్యాయ పుత్తిగే మఠం పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామి స్వయంగా ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, ఉడుపి అష్ట మఠాలు తమ సేవా సంస్కృతితో దేశానికి స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా అన్నబ్రహ్మ సంప్రదాయం ద్వారా వేలాది మందికి నిస్వార్థంగా అన్నదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. భగవద్గీత సందేశాన్ని వ్యాప్తి చేయడానికి నిర్వహిస్తున్న కోటి గీత లేఖన యజ్ఞ వంటి ఆధ్యాత్మిక కార్యక్ర మాలు అద్భుతమైనవని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజంలో ధర్మం, సేవ, ఆధ్యాత్మికత పెంపొందుతాయని ఆమె పేర్కొన్నారు. పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామి ఆమెకు 'భారత లక్ష్మి' బిరుదును ప్రదానం చేస్తూ ఆమె ఆర్థిక మంత్రిగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, సామాన్యుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. నిజాయితీ, నిబద్ధతతో కూడిన ఆమె సేవలు దేశానికే గర్వకా రణమని ఆయన అన్నారు. ఈ పర్యటనలో నిర్మలాసీతారామన్ కేవలం సత్కారం మాత్రమే అందుకోలేదు. శ్రీకృష్ణ మఠం చుట్టూ నిర్మించిన సంప్రదాయ శైలియాలి అనే ప్రత్యేకనిర్మాణాన్ని కూడా ఆమె ప్రారంభించారు. 20 అన్నబ్రహ్మ సన్నిధిలో వంట తయారీలోనూ పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితాపై సొంతపార్టీనేతల పైనే మంత్రి రుసరుసలు

**బెంగళూరు, ఆగస్టు 10:** లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. కర్ణాటక లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 16 సీట్లు గెలుస్తుందని ఇంటర్నల్ పోల్స్ అంచనా వేశాయి. అయితే కాంగ్రెస్‌కు 9 సీట్లు మాత్రమే వచ్చాయని, దీనికి కారణం ఓట్లను చోరీ చేయడమేనని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై కర్ణాటక మంత్రి కేఎన్ రాజన్న స్పందిస్తూ రాహుల్ గాంధీకి మద్దతు ప్రకటించారు. అదే విధంగా కర్ణాటకలోని సొంత పార్టీ నేతలపై కేఎన్ రాజన్న తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను తయారు చేశారని రాజన్న పేర్కొన్నారు. మరి ఆ ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగితే ఆ సమయంలో ఎవరూ ఎందుకు మాట్లాడలేదు? ఎందుకు మోనంగా ఉన్నారని కాంగ్రెస్ నేతలను బహిరంగంగా ప్రశ్నించారు. ఓటర్ లిస్ట్‌లో అవకతవకలు జరగడంతోనే మోదీ మరోసారి ప్రధాని పదవి చేపట్టారన్నారు. ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల ఓటరు జాబితాను మార్చిందనేది 100 శాతం నిజం అని స్పష్టం చేశారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలో మోసం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా తయారు చేసినప్పుడు, దాన్ని పర్యవేక్షించడం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత కాదా అని ప్రశ్నించారు. ఈ అక్రమాలన్నీ మన కళ్ల ముందే జరిగాయి. అప్పుడు మౌనం వహించడం సిగ్గుచేటు. ఇలాంటి మోసాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని, రాహుల్ గాంధీ నాయకత్వంలో పటిష్టంగా పని చేయాలన్నారు. రాజన్న వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత చర్చకు దారి తీశాయి. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలో లక్షకు పైగా నకిలీ ఓటర్లు, నకిలీ చిరునామాలు, బల్క్ ఓటర్లు ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ దర్యాప్తులో తేలింది. బెంగళూరులోని మహాదేవపుర అసెంబ్లీ స్థానంలో 6.5 లక్షల ఓట్లలో లక్షకు పైగా ఓట్ల 'దొంగతనం' జరిగింది. కర్ణాటకలోని అనేక బూత్‌లలో వేర్వేరు రాష్ట్రాలలో ఓటు వేసిన సుమారు 11వేల మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించాం. ఈ ఓటర్లపేర్లు, బూత్ నంబర్లు, చిరునామాల జాబితా మా వద్ద ఉంది అని ఇటీవల రాహుల్ గాంధీ పేర్కొన్న సంగతి తెలిసిందే.

## అమెరికాలోని జార్జియాలో ఉల్క శకలం

### అది భూమి కంటే ప్రాచీనం: శాస్త్రవేత్తలు

**వాషింగ్టన్, ఆగస్టు 10:** ఈ యేడాది జూన్ 26న జార్జియాలోని ఓ ఇంటిపై పట్టపగలు పడిన ఉల్క రహస్యాన్ని శాస్త్రవేత్తలు ఛేదించారు. మెక్‌డొనౌగ్‌లోని ఓ ఇంటిపై ఉన్న ఇన్సులేషన్, ఇతర అడ్డంకులను ఛేదించుకొని భూమిపై సెంటీమీటరున్న చిన్న గుంతకు ఆ ఉల్క కారణమైంది. ఈ ఘటన జార్జియా, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. చిన్న చెర్రీ టమాటా సైజులో ఉన్న ఈ ఉల్క శకలం 23గ్రాములే ఉంది. ఇది సూపర్ సోనిక్ వేగంతో భూమిపై పడినప్పుడు వచ్చిన శబ్దం చుట్ట పక్కల కౌంటీలకూ వినిపించింది. జార్జియాలోని శాస్త్రవేత్తలు ఈ శకలంపై పరిశోధనలు చేశారు. ఇది దాదాపు 4.56 బిలియన్ సంవత్సరాల క్రితం తయారైనట్లు జియాలజిస్ట్ స్కాట్ హారిస్ గుర్తించారు. అంటే భూమి కంటే 2కోట్ల సంవత్సరాల పూర్వమని అభిప్రాయ పడ్డారు. భూమి 4.54 బిలియన్ యేళ్ల క్రితం ఏర్పడిందన్న అంచనాలున్నాయి. ఈ శకలం అంగారకుడు, బృహస్పతికి మధ్య ఉన్న ఓతోకచుక్క నుంచి విడిపోయి ఉంటుందని భావించారు.


ఈ ఉల్క శకలంపై శాస్త్రవే త్తతో సదరు ఇంటి యజమాని మాట్లాడారు. తన లివింగ్ రూమ్‌లో ఇప్పటికే ఖగోళ ధూళి కణాలు ఉన్నట్లు పేర్కొన్నాడు. తన ఇంటిని ఢీకొన్న వేళ సోనిక్ బూమ్, పైకప్పును తాకిన చప్పుడు, నేలను తాకిన శబ్దం వినిపించాయన్నారు. ఓ భారీ రైఫిల్‌ను తనకు దగ్గరగా పేల్చినట్లు అనిపించిందన్నారు.

# వరదసాయంపై ఉత్తరాఖండ్ బాధితుల ఆగ్రహం



**ఉత్తరకాశీ,ఆగస్టు 10:** ఉత్తరాఖండ్ ఇటీవలి వర్షాలు, వరద బాధితులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు జరిగిన నష్టంతో పోలిస్తే ప్రభుత్వం అందిస్తున్న సాయం చాలా తక్కువని ఆవేదన వ్యక్తం చేస్తూ, తక్షణ సాయం కింద ఇచ్చిన రూ.5,000 చెక్కులను తిరస్కరించారు. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీజిల్లా ధరాలి గ్రామంలో చోటుచేసుకుంది. కొన్ని రోజుల క్రితం సంభవించిన ఆకస్మిక వరదలకు ధారాలి, హర్షిల్ గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ధరాలి గ్రామం అయితే కొన్ని గంటల్లోనే మరుభూమిగా మారిపోయింది. వరద బురదకు ఇళ్లన్నీ నేలమట్టం అయిపోయాయి. సర్వం కోల్పోయిన బాధితులు ప్రభుత్వసాయంపై గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోని ప్రభుత్వం బాధితులకు తక్షణ సాయం కింద రూ.5,000 చొప్పున చెక్కులను పంపిణీ చేసింది. అయితే, తమ ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు సర్వం కోల్పోయిన తమకు ఈ సాయం అవమానకరంగా ఉందని గ్రామస్థులు నిరసన తెలిపారు. ఈ విషయంపై ఉత్తరకాశీ జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్ ఆర్య స్పందిస్తూ.. ఇది కేవలం తక్షణ ఉపశమనం కోసం ఇచ్చిన మధ్యంతర సాయం మాత్రమేనని తెలిపారు. "పూర్తి నష్టాన్ని అంచనా వేసి, నివేదిక సిద్ధం చేశాక బాధితులకు సరైన పరిహారం అందజేస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. కాగా, వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. వరదల్లో ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రకటించారు. బాధితులకు పునరావాసం, జీవనోపాధి కల్పించే ప్రణాళికను సిద్ధం చేయడానికి రెవెన్యూ కార్యదర్శి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. వారం రోజుల్లోగా ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. నిన్న ఐదో రోజు కూడా సహాయక చర్యలు కొనసాగాయి. హెలికాప్టర్ల ద్వారా మారుమూల ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు, ఆహార పొట్లాలను జారవిడుస్తున్నారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) జాగిలాలు, థర్మల్ ఇమేజింగ్ పరికరాలతో ధారాలి బజార్‌లోని శిథిలాల కింద గాలింపు చర్యలు చేపట్టింది. ఈ విపత్తులో ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించగా, ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరో 49 మంది గల్లంతైనట్లు తెలిపారు. వెయ్యి మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్‌లను పునరుద్ధరిస్తూ, సామూహిక వంటశాలల ద్వారా బాధితులకు ఆహారం, దుస్తులు అందిస్తున్నారు.

## ఇండిగో సీటు శుభ్రతలేనందుకు రూ.1.5 లక్షల జరిమానా



**బాకు,ఆగస్టు 10:** విమానంలో తనకు కేటాయించిన సీటు అపరిశుభ్రంగా ఉందని పింకీ అనే మహిళా ప్రయాణికురాలు ఇండిగో ఎయిర్ లైన్స్ పై వినియోగదారుల హక్కుల ఫోరంను ఆశ్రయించింది. అజర్ బైజాన్ దేశంలోని బాకు సిటీ నుంచి ఢిల్లీకి వస్తుండగా తనకీ పరిస్థితి ఎదురైందని, ఎయిర్ లైన్స్ సిబ్బంది తీరుతో తాను మానసిక వేదనకు గురయ్యానని ఆరోపించింది. ఈ ఫిర్యాదును విచారించిన వినియోగదారుల హక్కుల ఫోరం ప్రయాణి కులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించలేదని తేల్చింది. ఇది సేవాలోపం కిందకే వస్తుందని స్పష్టంచేసింది. అయితే, సీటు బాగాలేదని పింకీ ఫిర్యాదుచేయడంతో ఆమెకు వేరే సీటు కేటాయించామని ఇండిగో సంస్థ వివరణ ఇచ్చింది. ఆ సీటులో కూర్చుని పింకీ ఢిల్లీకి చేరు కుందని తెలిపింది. ఈ వాదనను వినియోగ దారుల ఫోరం పరిగణనలోకి తీసుకోలేదు. టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులకు సరైన సదుపాయాలు కల్పించడం ఎయిర్ లైన్స్ కంపె నీల విధి అని, ఈ విషయంలో ఇండిగో సంస్థ విఫలమైందని తేల్చింది. పింకీ ఎదుర్కొన్న మాన సిక వేదనకు, ప్రయాణంలో ఆమెకు కలిగిన అసౌకర్యానికి రూ.1.5లక్షల పరిహారం చెల్లించా లని తీర్పు చెప్పింది. దీంతోపాటు మరో రూ.25 వేలు లీగల్‌ఖర్చుల కింద చెల్లించాలని ఆదేశించింది.

## సంక్షిప్తంగా..

### భవిష్యత్తు విదేశాంగ మంత్రి అనుకుంటే అరెస్టయ్యారు



**బీజింగ్, ఆగస్టు 10:** చైనాలో కీలక నాయకుల అరెస్టుల పరంపర కొనసాగుతోంది. భవిష్యత్తులో మంత్రి పదవి చేపడతారనుకొన్న ఓ దౌత్యవేత్త ఇప్పుడు ఊచలు లెక్కపెడుతున్నారు. లియు జియాంచావ్ అనే సీనియర్ దౌత్యవేత్తను అధికారులు అరెస్టుచేసి ప్రశ్నిస్తున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆదివారం కథనం ప్రచురించింది. లియు భవిష్యత్తులో విదేశాంగ మంత్రి పదవి చేపట్టొచ్చని చాలా కాలంగా ప్రచారం జరుగు తోంది. ఈ యేడాడి జూలైలో లియు ఓ విదేశీ పర్యటన ముగించుకొని బీజింగ్ తిరిగి రాగానే అధికారులు ఆయనను బంధించినట్లు వాల్‌స్ట్రీట్ వెల్లడించింది. తాజాగా ఈ అంశంపై స్టేట్ కౌన్సిల్ ఇన్ఫర్మేషన్ ఆఫీస్ వెంటనే ఎటువంటి కామెంట్ చేయలేదు. 61యేళ్ల లియు కమ్యూనిస్టుపార్టీ విదేశీరాజకీయ పక్షాలతో సంబంధాలు నిర్వహించే సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### రెండు నెలల్లోనే రెండోసారి ఆసిఫ్ మునీర్ యుఎస్ పర్యటన



**ఇస్లామాబాద్, ఆగస్టు 10:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికాలో పర్యటించారు. అక్కడి రాజకీయ, సైనిక ఉన్నతాధికారుల తోపాటు ప్రవాస పాకిస్థానీలతోనూ భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్ విందులో పాల్గొన్న మునీర్.. రెండు నెలల వ్యవధిలోనే మరోసారి అక్కడ పర్యటించారు. ముఖ్యంగా భారత్‌పై అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ తాజా పరిణామం చోటు చేసుకుంది. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అమెరికాలో అధికారిక పర్యటన చేస్తున్నట్లు పాక్ ఆర్మీ ఓ ప్రక టన చేసింది. అయితే, ఆయన ఎప్పుడు చేరుకున్నారు? ఎన్ని రోజులు ఉంటారనే విషయాలను వెల్లడించలేదు. యుఎస్ సెంట్రల్ కమాండర్ జనరల్ మైఖేల్ ఇ.కురిల్లా పదవీవిరమణ కార్య క్రమంలో మునీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షికసైనిక సహకారంలో కురిల్లా నాయకత్వం ఎంతగానో దోహదపడిం దన్నారు. ఈ సందర్భంగా యుఎస్‌కు చెందిన ఇతర సైనికాధికారులతో మునీర్ భేటీ అయ్యారు.

# అమెరికాతో పుతిన్ మైండ్‌గేమ్

### మైండ్ బ్లాక్ అయిన సిఐఎ

**మాస్కో, ఆగస్టు 10:** అంతర్జాతీయ రాజకీయాల్లో తనదైన శైలితో ప్రత్యర్థులకు చుక్కలు చూపే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, తాజాగా అమెరికాను ఇరుకునపెట్టేలా సంచలన ఎత్తుగడ వేశారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్‌నే లక్ష్యంగా చేసుకుని ఆయన ఆడిన మైండ్‌గేమ్‌తో వాషింగ్టన్ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరఫున ప్రత్యేక దూతగా క్రెమ్లిన్‌కు వచ్చిన స్టీవ్ విట్కాఫ్‌తో సమావేశమైన పుతిన్, ఓ అనూహ్య బహుమతిని ఆయన చేతికి అందించి కలకలం రేపారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ జూలియన్ గల్లినా కుమారుడైన మైఖెల్ గ్లోస్‌కు 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకాన్ని బహూకరిస్తున్నట్లు పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతూ మైఖెల్ వీరమరణం పొందాడని, ఆయన ధైర్యసాహసాలకు గుర్తుగా ఈ పతకాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ పతకాన్ని జూలియన్‌కు చేరవేయాలని విట్కాఫ్ ను పుతిన్ కోరారు. ఈ చర్యతో అమెరికా గూఢచార వర్గాల్లోనే అనుమానాలు రేకెత్తించాలని, అమెరికాను ఆత్మరక్షణలోకి నెట్టాలని పుతిన్ ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది. ఈ సంఘటన వెనుక పుతిన్ ఉద్దేశం అమెరికా సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడు రష్యా పక్షాన యుద్ధంలో పాల్గొన్నాడనే ప్రశ్నలను లేవనెత్తడమేనని నిపుణులు అనుమానిస్తున్నారు. మైఖెల్ గ్లోస్ గతంలో సోషల్ మీడియాలో రష్యాకు మద్దతుగా పోస్టులు పెట్టాడని, మాస్కోలో ఉన్న చిత్రాలు కూడా బయటకు వచ్చాయని సమాచారం. అతడు 2024 ఏప్రిల్‌లో తూర్పు ఐరోపాలో మరణించినట్లు వార్తలొచ్చాయి. మైఖెల్ మృతదేహం అమెరికాకు చేరిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో సీఐఏ ఓ ప్రకటన విడుదల చేసింది. మైఖెల్ మరణానికి, జాతీయ భద్రతకు ఎలాంటి సంబంధం లేదని, అతడు కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని ఆ ప్రకటనలో పేర్కొంది. పుతిన్ ఇచ్చిన పతకాన్ని విట్కాఫ్ స్వీకరించారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై అటు రష్యా గానీ, ఇటు అమెరికా, సీఐఏ లేదా విట్కాఫ్ వర్గాలు గానీ ఇప్పటివరకు అధికారి కంగా స్పందించలేదు. కేవలం అమెరికాను రెచ్చగొట్టేందుకే పుతిన్ ఈ చర్యకు పాల్పడ్డారని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## 'ఓట్ చోరీ' వెబ్‌సైట్ ప్రారంభించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** బీహార్, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలకు సంబంధించి విపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఇండియా కూటమి పార్టీలుకూడా భారీ స్థాయిలో ఆందోళన వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. బెంగళూరులో జరిగిన సభలో కూడా రాహుల్ గాంధీ ఈసీని సవాల్‌చేస్తూ ఓటర్ల డిజిటల్ జాబితాలు బయటపెట్టాలని డిమాండ్ చేసారు. బీహార్ ప్రత్యేక రివిజన్ 'సర్'లో అక్రమాలు భారీగా జరిగాయని ఆయన ఆరోపించారు. ఇందుకోసమే తాము 'ఓట్ చోరీ' వెబ్‌సైట్ ప్రారంభించామన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తనవిమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు 'ఓట్ చోరీ' పేరుతో నేడు ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. "వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రచారానికి మద్దతుగా వెబ్‌సైట్‌నుసందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు. గత 10ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని ఆగస్టు 8న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈసీని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

## దేశవ్యాప్తంగా 144 వందే భారత్ రైళ్లు

**హైదరాబాద్, ఆగస్టు10, ప్రభాతవార్త:** భారత రైల్వే వ్యవస్థ రూపురేఖలనే దశలవారీగా కేంద్రం మార్పులు చేపడుతుంది. ఎప్పటికప్పుడు ప్రజలను దృష్టిలో పెట్టుకుని రైల్వేకు భారీ నిధులను సైతం సమాకూరుస్తుంది. జెట్‌స్పీడ్ వేగంతో ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దేశవ్యాప్తంగా విజయవంతంగా నడుస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని బ్రాడ్ గేజ్ విద్యుదీకరణ నెట్‌వర్క్‌లో మొత్తం 144 వందే భారత్ సర్వీసులు నడుస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. రైల్వే మౌలిక సదుపాయాలను ఆధునికీకరించాలనే ప్రభుత్వ లక్ష్యం. ఇటీవల రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. అధిక రద్దీ ఉన్న మార్గాల్లో ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ సెమీహై స్పీడ్ రైళ్లను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికుల నుంచి ఈ రైళ్లకు అద్భుతమైన స్పందన వస్తోందని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 3 కోట్ల మంది ప్రయాణించగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ మధ్య 93 లక్షల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని పేర్కొన్నారు. వందే భారత్ రైళ్లలో అత్యాధునిక భద్రతా ఫీచర్‌గా ఖికవచ్‌ఖి యాంటీకొలిజన్ సిస్టమ్‌ను అమర్చారు. వీటితో పాటు ఆటోమేటిక్ డోర్లు, ప్రయాణికులు సులభంగా నడిచేందుకు వీలుగా బోగీల మధ్య పూర్తిగా మూసి ఉండే మార్గాలు, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో తిరిగే కుర్చీలు, ప్రతి సీటు వద్ద మొబైల్ ఛార్జింగ్ సాకెట్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక టాయిలెట్లు, సీసీటీవీ నిఘా వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయి.


# రేప్‌చేస్తానని బెదరించిన భర్తను వెనకేసుకొచ్చిన భార్య



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** విమాన సిబ్బందితో అత్యంత దారుణంగా ప్రవర్తించి, అత్యాచారం చేసి చంపుతానని బెదిరించిన కేసులో జైలు పాలైన ఓ బ్రిటిష్ వ్యాపారవేత్తను అతని భార్య వెనకేసుకొచ్చారు. తన భర్త ప్రవర్తనకు మానసిక ఆరోగ్య సమస్యలే కారణమని, అతనిపై సానుభూతి చూపాలని కోరింది. స్టాఫింగ్ మ్యాచ్ అనే రిక్రూట్‌మెంట్ సంస్థ వ్యవస్థాపకుడైన సల్మాన్ ఇఫ్తికార్‌కు ఆగస్టు 5న బ్రిటన్‌లోని ఐల్‌వర్త్ క్రౌన్ కోర్టు 15 నెలల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పు వెలువడిన రెండు రోజుల తర్వాత, ఆగస్టు 7న అతని భార్య, పాకిస్థాన్‌కు చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అబీర్ రిజ్వీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేశారు. మానసిక ఆరోగ్యం అనేది హాస్యాస్పదమైన విషయం కాదు. ప్రతి కథ వెనుక మీరు చూడని బాధ ఉంటుంది. ఇతరులను నిందించే ముందు, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. దయతో, మానవత్వంతో ఉండండని ఆమె పేర్కొన్నారు. సల్మాన్‌కు యూకేలో మరో భార్య కూడా ఉన్నట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. 2023 ఫిబ్రవరి 7న లండన్ నుంచి లాహోర్ వెళ్తున్న వర్జిన్ అట్లాంటిక్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫస్ట్ క్లాస్‌లో తన ముగ్గురు పిల్లలతో ప్రయాణిస్తున్న సల్మాన్ విమానంలో అధికంగా మద్యం సేవించి సిబ్బందితో గొడవకు దిగాడు. ఆంగీ వాల్ష్ అనే మహిళా సిబ్బందిపై జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ, నిన్ను ఏం చేయాలో నాకు చెప్పొద్దు అని అరవడం మొదలుపెట్టాడు. అనంతరం అతను మరింత రెచ్చిపోయి, నువ్వు చచ్చిపోతావు. నువ్వు ఉండే హోటల్ పేలిపోతుంది. నీ జుట్టు పట్టుకుని గదిలోంచి బయటకు లాగి, సామూహిక అత్యాచారం చేసి నిప్పంటిస్తారు అంటూ అత్యంత దారుణంగా బెదిరించాడు. విమానం లాహోర్‌లో ల్యాండ్ అయ్యాక అతడిని అరెస్ట్ చేయలేదు. కానీ, 2024 మార్చి 16న ఇంగ్లండ్‌లోని అతని ఇంట్లో బ్రిటిష్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వల్ల తాను తీవ్ర మానసిక క్షోభకు గురయ్యానని, 14 నెలల పాటు ఉద్యోగానికి వెళ్లలేకపోయానని బాధితురాలు ఆంగీ వాల్ష్ కోర్టుకు తెలిపారు. తమ సిబ్బంది భద్రతకే తొలి ప్రాధాన్యం ఇస్తామని, ఇలాంటి ప్రవర్తనను ఉపేక్షించబోమని వర్జిన్ అట్లాంటిక్ సంస్థ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## ఉపరాష్ట్రపతి ఆచూకీ చెప్పాలి హోంమంత్రీజీ..

### కేంద్ర మాజీ మంత్రి కపిల్‌సిబాల్



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** భారత మాజీ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్ ఖడ్ అకస్మాత్తుగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలే కారణమని ఆయన స్వయంగా ప్రకటించినా బీజేపీ హైకమాండ్ ఆయనతో బలవంతంగా రాజీనామా చేయించిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఆయన ఎక్కడ, ఎలా ఉన్నారో చెప్పాలంటూ కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ కేంద్ర హోంమంత్రిని ప్రశ్నించారు. గత నెల 22న ధన్ ఖడ్ ఉపరాష్ట్ర పతి పదవికి సడెన్‌గా రాజీనామా చేశారని, అప్పటి నుంచి నేటి వరకు ఆయన ఎక్కడ ఉన్నారో తెలియడం లేదన్నారు. దీనిపై కపిల్ సిబల్ వ్యంగ్యంగా స్పందిస్తూ.. 'లాపతా లేడీస్ (మహిళల అదృశ్యం) గురించి విన్నాను కానీ లాపతా వైస్‌ప్రెసిడెంట్ (ఉపరాష్ట్రపతి అదృశ్యం) గురించి ఎక్కడా వినలేదు' అని అన్నారు.

# ఆన్‌లైన్‌లో ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ

## సులభంగా నిర్మాణ పురోగతి తెలుసుకునే అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు గుడ్‌న్యూస్. ఇకపై ఇళ్ల నిర్మాణం ఏస్థాయిలో ఉంది, బిల్లుల చెల్లింపు తదితర వివరాలు ఈజీగా ట్రాక్ చేయవచ్చు. ఆ వివరాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో అందు బాటులో ఉంటాయి. పారదర్శకతను పెంచే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల వెబ్‌సైట్‌లో అధికారులు మార్పులు చేశారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ వివరాలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ భాషల్లో సులభంగా చూసుకోవచ్చు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు శుభవార్త. ఇకపై ఇంటి నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపు వంటి సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనున్నాయి. ప్రభుత్వం పారదర్శక తను పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల వెబ్‌సైట్‌లో మార్పులు చేసి, లబ్ధిదారుల సమాచారాన్ని నేరుగా చూసుకునే వీలు కల్పించినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఈ సౌకర్యం వల్ల లబ్ధిదారులు ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. కార్యాలయాల చుట్టూ తిరిగేందు సమయం, డబ్బులు వృథా అవుతుండగా.. ఆ సమస్యకు చెక్ పెట్టేందుకు వెబ్‌సైట్‌లో మార్పులు చేశారు. ప్రజల సౌకర్యార్థం ఈ వెబ్‌సైట్‌లో సమాచారం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ భాషల్లో అందుబాటులో ఉంచారు. దీనివల్ల భాషాపరమైన సమస్యలు లేకుండా ప్రజలు సులభంగా తమ వివరాలను తెలుసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 లక్షల ఇళ్లను ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేయగా.. వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మార్క్ అవుట్, పునాదులు, గోడలు, స్లాబ్ వంటి నిర్మాణ పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగానే లబ్ధిదారులకు నాలుగు విడతలుగా రూ.5 లక్షల ఆర్థిక సాయం విడుదల చేస్తున్నారు. తమ ఇంటి నిర్మాణ బిల్లు ఏ స్థాయిలో ఉంది? ఏ అధికారి వద్ద ఆగిపోయింది? వంటి వివరాల కోసం లబ్ధిదారులు గతంలో హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయాలు, కలెక్టరేట్లు, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ సమాచారం అంతా ఆన్‌లైన్‌లోనే లభిస్తుంది. బిల్లు ఏ కారణంతో ఆగి పోయిందో కూడా తెలుసుకునే వీలు ఉండటంతో, లబ్ధిదారులు ఆ లోపాలను సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. లబ్ధిదారులు తమ వివరాలు తెలుసుకు నేందుకు ఇందిరమ్మ ఇల్లు అనే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ బటన్‌పై సెర్చ్ చేయాలి. అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. ఇందిరమ్మ ఇల్లు అనే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ సెర్చ్ బటన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత సెర్చ్ బై ఆప్షన్‌లో ఆధార్ లేదా మొబైల్ నెంబర్ వంటి వివరాలను ఎంచుకోవాలి. వివరాలు నమోదు చేయగానే, స్క్రీన్‌పై లబ్ధిదారుని పూర్తి సమా చారం, ఇంటి నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపు తేదీలు, చెల్లించిన మొత్తం వంటి వివరాలు కనిపిస్తాయి. అంతేకాకుండా, లబ్ధిదారుల సమాచారంలో ఏవైనా లోపాలు ఉంటే, అవి కూడా వెబ్‌సైట్‌లో కనిపిస్తాయి. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ విపి గౌతమ్ సూచించారు.

## 18, 19న చలో ఢిల్లీ.. ఒబిసిల జాతీయ సదస్సు

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్ని కల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఒబిసి జాతీయ సెమి నార్లు జరపాలని ఈ నెల 18, 19న చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపి, జాతీయ బీసీ సంఘం అధ్యకుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ కార్య క్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుండి ప్రొఫె సర్లు, మేధావులు ఈ సెమినార్‌లో 8 మంది కేంద్రమంత్రులు, 20 మంది వివిధ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతుంది. ఇది దేశచరిత్రలో రికార్డు, 76 సంవత్సరాల చరిత్రలో ఏ పార్టీ కూడా కులగణన చేయలేదు. కులగణన తర్వాత బిసిలకు అన్ని రంగాల్లో ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ, సామజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా ప్రకారం వాటా లభిస్తుంది. అన్ని కోణా లలో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుంద న్నారు. 75 కోట్లకుపైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల కులగణన డిమాండ్‌ను కేంద్రం గౌరవించినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ధన్య వాదాలు తెలిపారు. పార్లమెంట్‌లో బిసి బిల్లుపెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్ని కలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి. కేంద్రంలో బిసిలకు ప్రతేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలి. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలి. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలి. బిసిల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై యున్న క్రిమిలేయర్‌ను తొలగించాలి. బి.సిలకు పారిశ్రా మిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో ఎస్సీ/ఎస్‌టి/బిసి రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. ప్రైవేటు రంగం లో ఎస్సీ/ఎస్‌టి/బిసిలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, ఆర్వీ మహేందర్, రాజేష్ తదితరులు

## సమగ్ర కులగణనలో మున్నూరుకాపును తక్కువగా చూపారు

### రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** సమగ్ర కులగణనలో మున్నూరు కాపు లను కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువజేసి చూపించిందని, రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదుతో తమ బలం, బలగాన్ని చాటుతామని తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ అన్నారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వ్యాప్త సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి, బీసీల నేత పుంజాల శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 40 లక్షలకు పైగా ఉన్న మున్నూరుకాపులను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా తక్కువ చేసి చూపించిందన్నారు. తప్పుల తడకగా చేసిన కుటుంబ సర్వే వల్ల మున్నూరుకాపులు బీసీ జానాభాలో ఐదో స్థానానికే పరిమితమయ్యారన్నారు. ఫలితంగా విద్య, ఉద్యోగ, రాజకీయంగా తీవ్రంగా నష్టపోయామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పది మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులకు అవకాశం కల్పించారని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొక్కుబడిన సీట్లు కేటాయించడంతో పాటు కనీసం మంత్రి పదవీ కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతామని, తద్వారా మున్నూరుకాపుల సమగ్ర సర్వే నిర్వహిస్తామన్నారు. తమ సభ్యత్వ నమోదు కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టుకానుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయమంటే ఢిల్లీకి పోయి ధర్నాలు చేస్తున్నారని, సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో మున్నూరుకాపులు అత్యధికంగా పోటీ చేయాలని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ పేరు చివరన పటేల్ అని రాయాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ మున్నూరుకాపు సంఘం గ్రేటర్ అధ్యక్షులు ఆర్వీ మహేందర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. రాజేశ్, సతీశ్, వెంకటేశ్ పటేల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా తర్వాత సింగరేణి యాత్ర చేస్తా

### కెటిఆర్‌కు రాఖీ ఎందుకు కట్టలేదంటే..

### కల్వకుంట్ల కవిత దాటవేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** మాజీ మంత్రి కేటీఆర్‌తో గ్యాప్‌పై మాట్లాడటానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇష్టపడలేదు. కేటీఆర్‌కు రాఖీ ఎందుకు కట్టలేదనే మీడియా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఆమె దాటవేశారు. బీఆర్ఎస్‌పైనే ఎందుకు ఫోకస్ చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒక మాట, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోమాట మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చినా.. బీజేపీ హై కమాండ్ ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి తాను గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. రాబోయే రోజుల్లో లెఫ్ట్ సంఘాలతో కలసి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈసారి సింగరేణి కార్మికులకు దసరా బోనస్‌ను 37శాతం ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లాభాలను ఎందుకు తక్కువ చేసి చూపిస్తోందని కవిత ప్రశ్నించారు. దసరా తర్వాత సింగరేణి యాత్ర చేస్తానని ప్రకటించారు సింగరేణి కార్మికులకు భరోసా కల్పించేందుకే ఈ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలపై హెచ్‌ఎంఎస్‌తో కలసి అలయన్స్‌గా పనిచేస్తామని వెల్లడించారు.

# ప్రజల ఆరోగ్యానికి కేంద్రం పెద్దపీట


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి పిఎంబిఐని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

## రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్‌ను తిరిగి ప్రవేశపెట్టాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 10, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. ఆదివారం ఉప్పల్‌లోని ఇండస్ట్రి యల్ ప్రాంతంలో ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన తెలంగాణ మార్కెటింగ్ కం డిస్ట్రిబ్యూషన్ వేర్ హౌజ్‌ను లార్విన్ ఫార్మా అండ్ సర్జికల్స్ సంస్థ సహకారంతో ఉప్పల్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పీఎంబీజేపిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపీ ఇటల రాజేందర్‌తో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ విషయంలో గత ప్రభుత్వం నిరక్ష్యం చేసి వెళ్లి పోయిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభు త్వం అయినా ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జనౌషధ కేంద్రాలకు మెడికల్ డిపోగా ఉప్పల్లో ప్రధాన మంత్రి భారతీయ జనౌషధ పరియోజన తెలంగాణ మార్కెటింగ్ కమ్ డిస్ట్రిబ్యూషన్ వేర్ హౌస్‌ను ఏర్పాటు చేసు కున్నామని తెలి పారు. మోడీ ప్రభుత్వం 70 సంవత్సరాలు నిండిన వృద్ధులకు, ఆస్తితో, పెన్షన్‌తో సంబంధం లేకుండా రూ. 5 లక్షల వరకు ఏ రాష్ట్రంలోనైనా, ఏ నగరంలోనైనా కోరుకున్న హాస్పిటల్లో వైద్యం చేయించుకునేవిధంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని కిషన్‌రెడ్డి చెప్పారు. మార్కెట్‌లో ఉన్న మెడిసిన్ ధరలతో పోల్చితే జనౌషధ కేంద్రాలలో 50 శాతం నుంచి 90 శాతం వరకు తక్కువ ధర ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయుష్మాన్ భవను ప్రతి పేద వాడికి అందేలా చూడాలని డిమాండ్ చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ.. నాణ్యమైన ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేవాలనే మన లక్ష్యాన్ని మరింత ముందుకు తీసు కెళ్లే దిశగా, పిఎంబిఐ-లార్విన్ జనఔషధి డిస్ట్రిబ్యూషన్ మార్కెటింగ్ వేర్‌హౌస్‌ను మీతో కలిసి ప్రారంభించుకోవడం నాకు ఎంతో ఆనందం కలిగిస్తోంది. ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన మన ప్రభుత్వంలోని అత్యంత ప్రభావవంతమైన ప్రజా ఆరోగ్య కార్యక్రమాలలో ఒకటి నాణ్యమైన జనరిక్ మందులను తక్కువ ధరకే అందించడం జరుగుతుందన్నారు. ఇది రాష్ట్రానికి గర్వకారణమైన రోజు అన్నారు. ఉప్పల్ లో ఈ ఆధునిక వేర్‌హౌస్ ప్రారంభంతో రాష్ట్రం లోని ప్రతి మూలకూ తక్కువ ధరలో మందులు వేగంగా, సమర్థవంతంగా చేరేలా చేసే బలమైన సరఫరా వ్యవస్థను ఏర్పరుస్తున్నామని చెప్పారు. జనఔషధి మందుల పంపిణీ బాధ్యతను తెలంగాణలో ముందుకు తీసుకెళ్తున్న యువ, చురుకైన పారిశ్రామికవేత్త వరుణ్ విహార్ మడుపడుగ, లార్విన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, అలాగే రాము మడుపడుగ, లార్విన్ గ్రూప్ సిఇఒకు హృదయ పూర్వక అభినందలను అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి చేస్తున్న కృషిని కూడా నేను అభినందిస్తున్నానని చెప్పారు.

ఈ సదుపాయం సుమారు 3,000 ముఖ్యమైన మందులు శస్త్రచికిత్సా వస్తువుల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. తక్కువ ధరలో మందులు అందుకోవడం ప్రత్యేక హక్కు కాదు, అది ప్రతి ఒక్కరి హక్కు అని అన్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

### జిఒ 34 విడుదలపై దివ్యాంగుల ఉద్యోగ సంఘాల నేతల హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** దివ్యాంగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని, దివ్యాంగుల కుటుంబాలు, వారి తల్లితండ్రుల కళ్లలో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దివ్యాంగుల ఉద్యోగ సంఘం నేతలు ఆదివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యని గజమాలతో ఘనంగా సత్కరించారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వ ర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కార్యాల యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగుల ఉద్యోగుల బదలీల్లో రిజర్వేషన్‌లు కల్పిస్తూ మాన సిక దివ్యాంగుల కుటుంబాలకు కూడా వర్తింపచేస్తూ ప్రభుత్వం జి.ఓ.నెంబరు 34 విడుదల చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల స్వయంసమృద్ధి కోసం వేల సంఖ్యల్లో దివ్యాంగుల స్వయం సహా యక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సంఘాలకి ఆర్థికంగా ఊతం ఇస్తూ, వారిని వ్యక్తిగతంగా ఆర్థికంగా వృద్ధిచెందేలా చేయడమే లక్ష్యంగా రుణాలి స్తున్నామని అన్నారు. రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల ఉద్యోగుల బదలీ విషయంలో గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. నేటి ప్రజాపాలన ప్రభుత్వంలో దివ్యాంగుల ఉద్యోగులకు బదలీల్లో రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మానసిక దివ్యాంగులున్నా కుటుంబసభ్యులుగా కలిగి ఉన్నా ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించడం అనేది దేశ చరిత్రలోనే మొదటిసారి జరిగిందన్నారు.

# బడుగుల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

## ఆయన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి: మంత్రి పొన్నం

### ఘనంగా పాపన్నగౌడ్ 375వ జయంతి వారోత్సవాలు


సభలో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై వి.రామారావుగౌడ్, మహేష్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జయదేవ్, భరత్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 10, ప్రభాత వార్త :** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కేవలం గౌడ్‌లకే కాదు బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప పోరాట యోధుడని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముం దుకుపోవాలని బిసి సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న మహరాజ్ ధర్మ పాలన సంస్థ, జైగౌడ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో వట్టి కూటి రామారావుగౌడ్ అధ్యక్షతన జరిగిన పాప న్నగౌడ్ 375వ జయంతి జాతీయ వారో త్సవాలకు ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, బిసి కార్పొరేషన్ అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్, మాజీ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, జోగి రమేష్, ఎంపిలు భరత్‌గౌడ్, మధుయాష్కిగౌడ్, గుల్బర్గా ఎమ్మెల్సీ జయదేవ్‌గుత్తా, జైగౌడ తెలంగాణ అధ్యక్షుడు నారాయణగౌడ్, ఎపి అధ్యక్షుడు చిట్టి బొమ్మకిషోర్‌గౌడ్, కె.అశోక్‌గౌడ్ తదితరులతో కలిసి పాపన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించి ప్రసంగించారు. వృత్తిని కాపాడుకుంటూనే నేటి పోటీ ప్రపంచంలో మన పిల్లలు ఉన్నతవిద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలు పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గం లోని సర్వాయిపేటలో పాపన్నగౌడ్ కోటకు 5 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తా మని భరోసానిచ్చారు. అలాగే ఈ నెల 17న సైదాపూర్‌లో పాపన్నగౌడ్ విగ్ర హావిష్కరణ చేస్తున్నామన్నారు. కరీంనగర్‌లో పెద్ద గౌడహాస్టల్ నిర్మించా మన్నారు. గౌడ కులానికి చెందిన వ్యక్తిగా రాష్ట్రంలో అన్ని బలహీనవర్గాల సంక్షే మానికి అందరినీ కలుపుకుని పనిచేస్తానన్నారు. ఈ యేడాది 40 లక్షల మొక్క లు నాటి సంరక్షిస్తామని చెప్పారు. ప్రభుత్వ స్థలాలున్న చెరువుకట్టలపై ఈత మొక్కలు నాటామని, సర్వాయి పాపన్నగౌడ్ వారసులుగా వృత్తిని రక్షణ చేసుకోవాలని మంత్రి పిలుపు నిచ్చారు. పిసిసి ప్రధాన కార్యదర్శి డా. వట్టికూటి రామారావుగౌడ్ అధ్యక్షోపన్యాసం అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పాపన్నగౌడ్ జయంతి వేడుకలను అన్నివర్గాల ప్రజలు జరుపుకోవాలని సూచించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయల సేద్యం

## తొలిదశలో 4,500 కేంద్రాల్లో సాగు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** అంగ్‌నవాడీ కేంద్రాల్లో చదువుకునే పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సంద్ర ప్రభుత్వ పోషణ్ వాటిక పథకం కింద రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో కూరగాయల తోటలను పెంచాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 35,700 అంగన్వాడీ కేంద్రాలుండగా.. మొదటి విడతలో 4500 కేంద్రాల్లో టమాట, వంకాయ, దొండ కాయ, పాలకూర, తోటకూర, మెంతికూరలను పండించేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా.. వీటి విత్తనాలను జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్సీ) పంపిణీ చేయనుంది. పెంపకం అనం తరం వీటిని లబ్దిదారుల వంటల కోసం వినియో గిస్తారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. కొన్ని సమయాల్లో వాటిలో నాణ్యత లోపించడం, వాతావారణ పరిస్థితులు కారణంగా అవి సకాలంలో సరైన అందుబాటులో లేకపోవడం, ఒకవేళ ఉన్నా అవి అందుబాటు ధరల్లో ఉండకపోవడంతో వాటిని ఆయా కేందాల్లో చదువకునే పిల్లలకు అందించడం కష్టంగా మారింది. ఇటువంటి పరిస్థితులపై ప్రత్యేకంగా కేంద్రం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పోషణ్ వాటిక పథకం అమలుపై సమీక్ష సందర్భంగా ఈ అంశాలన్నింటినీ చర్చించి అన్ని రాష్ట్రాల్లో ఈ పథకం చేపట్టాలని కేంద్రం సూచించింది. దీనికి అవసరమైన విత్తన కిట్లను తయారు చేసి రాష్ట్రాలకు పంపిణీ చేయాలని ఎన్ఎస్సీకి ఆదేశించింది. వీటిని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారు. రాష్ట్ర ఉద్యాన అధికారులు కేంద్రాలను సందర్శించి కూరగాయల సాగుకు అనువైన సౌకర్యాలు కల్పిస్తారు. విత్తనాలు వేసిన తర్వాత వాటి పెంపకాన్ని పర్యవేక్షిస్తారు. ఈ పథకం విజయవంతంగా అమలయితే ఆయా కేంద్రాల్లో ఉండే పిల్లలకు మంచి పోషణ లభించడమే కాకుండా వారికి నాణ్యమైన కూరగాయలను అందించినట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# సిద్దిపేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

## సిఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** రైతాంగం అంశాలపై కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది, వ్యవసాయరంగానికి సంబంధించిన సమస్యలపై విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఫామాయిల్ పంటల దిగుబడి గణనీయంగా ఉన్నందున కొన్ని చోట్ల ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల సిఎంకు వివరించారు. అశ్వరావుపేట, సిద్దిపేట జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటుకు వీలుగా ఏదో ఒక చోట ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. దాంతో 15 ఆగస్టు త్వరాత సిద్దిపేట జిల్లాలో ఏర్పాటుచేసే కార్యక్రమానికి హాజరవుతానని సిఎం రేవంత్‌రెడ్డి మంత్రి తుమ్మలకు స్పష్టత ఇచ్చారు. అదేవిధంగా మిగతా అంశాలపై త్వరలోనే చర్చించి నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# రాజగోపాల్‌రెడ్డి అంశం మా దృష్టికి రాలేదు

### కొండా మురళి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు

### పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

### కాంగ్రెస్ పార్టీనే తమ రక్తంలో ఉంది: కొండా మురళి

### గాంధీభవన్‌లో క్రమశిక్షణా సంఘం సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించారు. క్రమ శిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి అధ్యక్షతన దాదాపు రెండుగంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలపై చర్చ చేశామని, భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, అన్నింటిలో కలసి పని చేయడానికి ఒప్పుకున్నారన్నారు. నేతలు కలిసి పనిచేయడానికి ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు. అనిరుధ్ రెడ్డి అం శంపై చర్చించ్చినట్లు, రాజగోపాల్ రెడ్డి అంశంపై చర్చ జరగలేదన్నారు. రాజ గోపాల్‌రెడ్డి ఇష్యూ కమిటీ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. కొండా మురళి లి ఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేలు కూడా లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారని వివరించారు. కాంగ్రెస్ నేత కొండా మురళి పిసిసి క్రమశిక్షణా కమిటీ ముందు హాజరయ్యారు. ఆయన ఇప్పటికే ఒకసారి హాజరై వివరణ ఇచ్చారు. ఇటీవల ఓ కార్యక్రమంలో వరంగల్‌లోని నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను గతంలో పిసిసి క్రమశిక్షణ కమిటీ గాంధీ భవన్‌కు పిలిచి వివరణ కోరింది. దీనిపై లిఖిత పూర్వక వివరణ కోసం మళ్లీ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. ఈక్రమంలో ఆయన కమిటీ ముందు ఆదివారం మరోసారి హాజరై లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీనే తమ రక్తంలో ఉందన్నారు. పార్టీ ఏ ఆదేశమిచ్చినా తప్పక పాటిస్తామని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తమ లక్ష్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చినట్లు కొండా మురళి తెలిపారు.



# వ్యవసాయ మార్కెట్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

### రూ.70 లక్షల విలువైన 7లక్షల గన్ని సంచులు దగ్ధం?

### ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ అశోక్‌కుమార్, డిఎం జితేంద్రప్రసాద్

**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** మెటుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పాత గన్ని సంచుల గోదాంలో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకోగా..సుమారు రూ.70 లక్షల విలువ గల 7లక్షల పాత గన్ని సంచులు దగ్ధం అవగా..రాత్రి 8 గంటల వరకు ఫైర్ అధికారి కృష్ణకాంత్ ఆధ్వర్యంలో, ఫైర్ సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్ ల సహాయంతో గోదాంలో సంచులకు అంటుకున్న అగ్నిని ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..గోదాం ఇంచార్జి బూరం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గల పురాతన గన్ని సంచుల గోదాంలో ఆదివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో మంటలు చెలరేగిన విషయమై స్థానికులు సమాచారమిచ్చిన వెంటనే..పోలీసులకు అగ్నిమాపక సిబ్బందికి గోదాం అధికారులు సమాచారం అందించారు. దీంతో మూడు ఫైర్ ఇంజన్ లు, మున్సిపల్ వాటర్ ట్యాంకర్ సహాయంతో, గోదాంకు ఉన్న కిటికీ ప్రాంతంలో గోడను జేసీబీ సహాయంతో తొలగించి మంటలను ఆర్పే ప్రయత్నం రాత్రి వరకు కొనసాగుతుంది. కాగా గత 7 ఏళ్లుగా గోదాంలో వాడకానికి పనికిరాని 9 లక్షల గన్నీ సంచులు ఉండగా, వాటిలో సిబ్బంది సహాయంతో సుమారు 2లక్షల వరకు బయటకు తీసామని, దగ్ధం అయిన సంచుల విలువ సుమారు రూ.70 లక్షల వరకు ఉంటుందని గోదాం ఇంచార్జి సురేష్ తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ఘటనలో ఇంకా భారీ నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదాంలోని ఎలాంటి విద్యుత్ సరఫరా లేకపోగా..మూసి ఉన్న గోదాంలో అగ్నిప్రమాదం జరగడం వెనుక కారణం మాత్రం ఎవరికి అంటుపట్టడం లేదన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సివిల్ సప్లై డిఎం జితేంద్ర ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్ మెట్పల్లి డీఎస్పీ రాములు, తహసీల్దార్ నీత, సిఐ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ లు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

# 90 లక్షల ఎకరాలకు చేరిన ఖరీఫ్

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** తెలంగాణలో మొత్తం ఖరీఫ్ విస్తీర్ణం 1.52 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 90 లక్షల ఎకరాలకు సాగు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో 73.65 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి, మొక్కజొన్న వంటి పంటలు స్థిరమైన పురోగతిని కనబరుస్తున్నాయి, అయితే, వరి నాట్లు మందకొడిగా సాగయ్యాయి. 66 లక్షల ఎకరాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు కేవలం 35 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. అలాగే ఇప్పటివరకు 43.71 లక్షల ఎకరాల్లో పత్తి నాటగా, ఇది గత ఏడాది ఇదే సమయానికి సాగైన దాని కంటే 2.50 లక్షల ఎకరాలు ఎక్కువ. గత ఏడాది ఇదే సమయానికి 41.37 లక్షల ఎకరాలు వేశారు. అలాగే మొక్కజొన్న 5.52 లక్షల ఎకరాల్లో, సోయాబీన్ 35.58 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అయితే కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌లు పనిచేయకపోవడం వల్ల ఆయకట్టు కింద నీరు విడుదల చేయని సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు వేయడంలో ఇంకా వేగం పుంజుకోలేదు.

# 14 నుంచి రైతు బీమా

## కొత్త పాస్‌బుక్‌లకు అర్హత

## 13లోగా క్షేత్రస్థాయి వెరిఫికేషన్ పూర్తి

## వ్యవసాయశాఖ మార్గదర్శకాల విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 సంవత్సరానికి సంబంధించిన రైతు బీమా ఈనెల 14 నుంచి అమలు కానుంది. దీనికి సంబంధించి వ్యవసాయశాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నిబంధనల మేరకు కొత్త రైతుల నమోదు, రెన్యూవల్స్ చేపట్టాలని క్షేత్ర స్థాయి అధికారులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల్లో బీమాకు అర్హులైన వారిని వ్యవసాయశాఖ గుర్తించనుంది. భూ భారతిలో నమోదై, సీసీఎల్ఎల్‌లో నమోదైన భూములు కలిగిన రైతుల్లో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ అందించే డాటా ఆధారంగా రైతుబీమా కల్పించనున్నారు. ఈ మేరకు కొత్త వారందరూ ఈనెల 13లోగా క్షేత్ర స్థాయిలో ఏఈవోలు, ఏవోలతో వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. 2025-26 రైతు బీమా కోసం క్షేత్రస్థాయి అగ్రికల్చర్ అధికారులకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి రైతు బీమా పోర్టల్‌లో అధికారులు అప్లోడ్ చేయనున్నారు. రైతు బీమా పథకానికి అర్హులై ఉండి అప్లయ్ చేసుకోని వారికి సైతం తాజాగా దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అయితే, ఐదెకరాలలోపు భూమి ఉండి కూడా గతంలో అప్లయ్ చేసుకోని రైతులకే ఈ దఫా అవకాశం కల్పిస్తున్నట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సంవత్సరం కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు, గతంలో అర్హత ఉండి ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వారందరూ కలిపి దాదాపు 2 లక్షల వరకు ఉండొచ్చని ప్రాథమిక అంచనా. కొత్త బీమా సంవత్సరంలో ఇప్పటికే రైతు బీమా కలిగిన లబ్ధిదారులైన రైతుల రెన్యూవల్స్‌కు సంబంధించి డేటా పరిశీలన ఈనెల 12లోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయి అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

60 సంవత్సరాలు నిండిన వారిని తొలగించి మిగిలిన అర్హులైన రైతులకు బీమాను రెన్యూవల్ చేయాలని సూచించారు. రైతు బీమా పోర్టల్లో రెన్యూవల్ అప్లోడ్ ప్రక్రియ పూర్తి అయిన వారికి ఈనెల 14వ తేదీ నుంచి కొత్త బీమా అమలు చేయనున్నారు. ఒకే రైతుకు రెండు అంతకంటే ఎక్కువ గ్రామాల్లో భూమి పట్టా పాస్‌బుక్ కలిగి ఉన్నప్పటికీ ఒకే పాలసీకి వర్తింపు ఉంటుందని తాజా మార్గదర్శకాల్లో అధికారులు పేర్కొన్నారు. అయితే, భూ భారతిలో జూన్ 5వ తేదీ వరకు పట్టా పాస్‌బుక్, సీసీఎల్ఏలో నమోదైన రైతులకు మాత్రమే రైతు బీమా వర్తింపు ఉంటుందని అధికారులు తెలిపారు. సీసీఎల్ఏలో లేని భూములున్న రైతులకు బీమా వర్తింపు ఉండదని తాజా సర్క్యూలర్ లో స్పష్టం చేశారు. రైతు బీమా కలిగిన రైతులు సహజ మరణమైనా, ఏ విధంగా చనిపోయినా సదరు రైతు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందుతుందని వ్యవసాయశాఖ పేర్కొంది.



మార్గమధ్యంలో బిడ్డకు జన్మనిచ్చిన కౌసల్యాబాయి.

# నిండుగర్భిణిని 2 కి.మీ. మోసుకెళ్లిన భర్త

## మార్గమధ్యంలోనే ప్రసవం

**నాగల్‌గిద్ద, ఆగస్టు 10, ప్రభాతవార్త :** తన భార్య పురిటి నొప్పులతో బాధ పడుతుం డడంతో భర్త చేతులపై 2 కి.మీలు ఎత్తుకెళ్లిన సంఘటన సంగారెడ్డి జిల్లా నాగలిగిద్ద మండలం శాంతినగర్ తండా పంచాయతీ పరిధిలోని మున్యానాయక్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నాగలిగిద్ద మండలం మున్యానాయక్ తండాకు చెందిన కౌసల్యాబాయి(26) మూడవ ప్రసవం కోసం ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంకు సమాచారం అందించారు. దీంతో 108 వాహనం తండాకు బయలు దేరగా, తండాకు 2కి.మీల దూరంలో వాహనం ఆగిపోయింది. ఇటవల కురుస్తున్న వర్షాలతో తండాకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో పాటు గుంతలు ఏర్పడి వాహనం వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. దీంతో భర్త వాసుదేవ్ తండా నుండి దాదాపు 2 కి.మీల వరకు తన భార్య కౌసల్యాబాయిని 108 వాహనం వరకు చేతులపై ఎత్తుకొని తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు ఎక్కువై మార్గమధ్యలోనే ఆమెకు ప్రసవం జరిగింది. దీంతో ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చింది. అనంతరం అక్కడికి నడుచుకుంటూ చేరుకున్న 108 సిబ్బంది ఆమెను చేతులపై తీసుకెళ్లి వాహనంలోకి ఎక్కించారు. అనంతరం కౌసల్యాబాయిని కరస్‌గుత్తిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీంతో ఆమెకు వైద్యులు చికిత్స అందించడంతో తల్లి. బిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

# 20 నెలలు ఎదురుచూశాం

## సెప్టెంబర్ 13న చలో హైదరాబాద్‌కు తరలిరండి

## రేవంత్‌రెడ్డి పెన్షన్ పెంచడు.. కెసిఆర్ అడగడు

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ



**భద్రాచలం, ప్రభాతవార్త :** పెన్షన్ పెంచుతామని ఆశ చూపి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని .. 20 నెలలు ఎదురు చూసి ఓపిక నశించిందని .. ఇక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెన్షన్ పెంచుడో .. గద్దె దిగి ఇంటికి పోవుడో తేల్చుకుందామని పద్మశ్రీ అవార్డు గ్రహీత మాదిగ హక్కుల రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో కేకే ఫ్యాలెస్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగులు, వితంతు, ఒంటరి, మహిళ, వృద్ధుల పెన్షన్‌దారుల పెన్షన్ పెంపు మహాగర్జన సన్నాహక సదస్సు కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... కాంగ్రెస్ ఎన్నికల ముందు పెన్షన్ లబ్ధిదారులను నమ్మించి మోసం చేశారని, దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు ఇస్తామని, ఈ నెల మాకు ఓట్లేయ్యండి... కేసీఆర్‌ను గద్దె దించండి .. వచ్చే నెలలో మీకు పెన్షన్ పెంచుతామని చెప్పారని, అది నమ్మిన లబ్ధిదారులు ఓటు వేస్తే అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పెన్షన్ పెంచలేదని మండిపడ్డారు. దీని వల్ల లబ్ధిదారులకు దక్కాల్సిన నెలకు రూ.1000కోట్లు, 20 నెలల్లో రూ.20 వేలకోట్లు డబ్బును దోచి రైతు రుణాల పేరుతో భూస్వాములకు కట్టబెట్టారని ఆరోపించారు. ఇటువంటి తరుణంలో 20 నెలలు పెన్షన్ లబ్ధిదారులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిం చాల్సిన బీఆర్ఎస్ పార్టీ అడిగిన పాపాన పోలేదన్నారు. ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకు వెళ్ళట్లేదని, ప్రజల్లోకి రావడం లేదని, అత్యంత పేద ప్రజల సమస్యలను ఎజెండాగా తీసుకుని మాట్లాడట్లేదని దుయ్యబట్టారు. మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళముందు కనిపిస్తున్నా ప్రశ్నించే ప్రతిపక్షం తెలంగాణలో లేకుండా పోయిందని వాపోయారు. రాష్ట్రంలో 2023లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే.. ఆంధ్ర రాష్ట్రంలో 2024లో ఎన్నికలు జరిగాయని, ముందు ఎన్నికలు జరిగిందని తెలంగాణలోనేనని, మరి అక్కడ పెరిగిన పెన్షన్, ఇక్కడ ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీని ఆంధ్ర రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలా నిలబెట్టుకున్నాడో .. ఆయన్ని చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని కోరారు. మన సమస్యలు మనం పరిష్కరించుకునే విధంగా మన పోరాటం సాగించుకునే పెన్షన్ సాధించుకునే దిశగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎమ్మార్పీఎస్ భద్రాద్రికొత్తగూడెం ఇంచార్జ్ ములకలపల్లి రవి, జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సూర్యవాణి, భద్రాచలం మండల అధ్యక్షుడు బొక్క వినీష్, మండల ఇంచార్జ్ కనుకు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు బొక్క రాంబాబు, ఎంఎంఎస్ మండల అధ్యక్షురాలు గుండె సుహాసిని, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి తెల్లం సమ్మక్క, పెన్షనర్సు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్‌పై 'రీల్స్'.. రైల్ ఢీకొట్టడంతో మృతి

## సోషల్ మీడియాలో విడియో వైరల్

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** రైల్వే ట్రాక్స్‌పై రైళ్లతో ప్రమాదమనే భయం లేకుండా ఇష్టారాజ్యంగా రీల్స్ చేస్తూ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇండోనేషియాలోని ఘటన సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఆదివారం మిజా గని మోలానా ఫిర్దౌస్ (21) అనే యువకుడు తన స్నేహితుడితో కలిసి రైల్వే ట్రాక్స్‌పైకి వెళ్లాడు. మోలానా తన చేతిలో జెండా పట్టుకుని రైల్వే ట్రాక్స్ పక్కన నడుచుకుంటూ వెళ్తున్నారు. దూరంగా ఉన్న అతడి స్నేహితుడు నానాంగ్ విడియో తీస్తున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలును రీల్స్ ధ్యాసలో వారు గుర్తించలేకపోయారు. దీంతో ఫిర్దౌస్‌ను ఢీకొని కొంత దూరం లాక్కెల్లింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

# రూ.వెయ్యి కోట్ల రుణానికి ఇండెంట్

## ఇప్పటి వరకూ రూ.30,900 కోట్లు సమీకరణ

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** రిజర్వ్ బ్యాంకు వద్ద మరో రూ.వెయ్యి కోట్ల రుణం సేకరించేందుకు రాష్ట్ర సర్కార్ సిద్ధమైంది. ఇందుకు గాను ఈ మేరకు రుణం అవసరం ఉందని, ఆ మేరకు మొత్తాన్ని మంజూరు చేయాలని రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతిపాదన పంపించింది. రిజర్వు బ్యాంకు ఈ నెల 12వ తేదీ బహిరంగ మార్కెట్లో నిర్వహించే ఈ వేలంలో పాల్గొని ఈ మొత్తాన్ని సేకరిస్తామని పేర్కొంది. అందుకు గాను 35 ఏండ్లకు తెలంగాణ ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు పెట్టింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్లో రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరిస్తామని 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకూ అంటే ఈ నెల ఐదో తేదీ నాటికి ఒక్క రిజర్వ్ బ్యాంకు నుంచే రూ.30,900 కోట్లు రుణ సమీకరణ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకూ తొలి త్రైమాసికంలో రూ.17,400 కోట్లు రుణ సమీకరణ చేసింది. తదుపరి జూలై నుండి సెప్టెంబరు వరకూ కలిగిన రెండో త్రైమాసికంలో రూ.12 వేల కోట్లు రుణం తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపింది. అయితే, ఈ క్వార్టర్‌లో ఒక్క జూలై నెలలోనే రూ.8.500 కోట్లు సేకరించింది. ఇప్పుడు తొలివారంలోనే ఆర్బీఐ నుంచి మరో రూ.5 వేల కోట్లు రుణం సేకరించింది. ఈ విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచే రూ.30,900 కోట్లు రుణ సమీకరణ చేసింది.

# రాహుల్‌గాంధీకి బెంగళూరు ఎన్నికల సిఇఓ నోటీసులు

**బెంగళూరు, ఆగస్టు 10:** కర్ణాటక ఎన్నికల్లో ఓట్ల అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సిఇఓ) స్పందించారు. రాహుల్ గాంధీ ఆరోపించినట్లుగా షకున్ రాణి లేదా ఇతర ఏ వ్యక్తులు రెండుసార్లు ఓట్లు వేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన తేల్చి చెప్పారు. ఆరోపణలకు తగిన ఆధార పత్రాలు ఇవ్వాలని నోటీసుఇచ్చారు. రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలకు సంబంధించిన పత్రాలను అందజేయాలని కర్ణాటక సిఇఓ సంజాయిషీ కోరారు. ఈ ఆరోపణలకు ఆధారాలు చూపిస్తే, వాటిపై విచారణ జరుపు తామని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ఈ నెల 7న ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ (ఈసీ), బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో ఓట్లజాబితాల పరంగా అవకతవకలు జరిగాయని, దీని వెనుక అధికార పార్టీ, ఎన్నికల కమిషన్ ఉన్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఇప్పుడు కర్ణాటక సిఇఓ స్పందించడం ద్వారా, ఈ వివాదం మరింత ముందుకు సాగుతోంది.



# ఆదిలాబాద్ ఐటి టవర్ పురోగతిపై మాజీమంత్రి కెటిఆర్ హర్షం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** ఆదిలాబాద్ ఐటీ టవర్ పురోగతిపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. కెసిఆర్ హయాంలో ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ పరిశ్రమను విస్తరించి.. నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, సిద్దిపేటలో ఐటీ హబ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇప్పుడు ఆదిలాబాద్ కూడా ఐటీ టవర్ల జాబితాలో చేరిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ సంకల్పాన్ని కొనసాగి స్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా ఐటీ ఉద్యోగాలు అందుబాటులోకి తెచ్చి యువతకు ఉపాధి కల్పించేందుకు ఆదిలాబాద్‌కు మంజూరైన ఐటీ టవర్ నిర్మాణం పూర్తి కావొస్తున్న సంగతి తెలిసిందే. రెండుమూడు నెలల్లో భవనం పూర్తయ్యేలా పనులు కొనసాగుతున్నాయి.



# ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ఉపరాష్ట్రపతి జగదీప్‌దన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఎన్నిక జరగనున్న ఈ పదవికి ఇండియా కూటమి అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించింది. అయితే ఉపరాష్ట్రపతిపదవి సాధించేందుకు ఎన్డీయే కూటమికి సంపూర్ణమద్దతు ఉంది. అయితే విపక్ష కూటమి కూడా నిలబెట్టాలని నిర్ణయించడం, ఎఐసిసి అధ్యక్షుడుమల్లిఖార్జున్‌ఖర్గే వివిధ కూటమి పార్టీలతో సంప్రదింపులు జరుపుతుండటంతోపోటీ అనివార్యమని తెలుస్తోంది. ఏకాభిప్రాయ సాధనకోసం ఖర్గే సంప్రదింపులు ముమ్మరం చేసారు. కూటమి నేతలమధ్య నడుస్తున్న చర్చల్లో ఉమ్మడి అభ్యర్థిని నామినేట్‌చేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. బిజెపి అభ్యర్థిని ప్రకటించిన తర్వాతనే ఇండియా కూటమి తన అభ్యర్థిని నిలెబట్టాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితం ఎలా ఉన్నప్పటికీ ఒక బలమైన రాజకీయ సందేశం పంపించాలని ప్రతిపక్ష పార్టీలు యోచనచేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా విపక్షాల ఐక్యతను కూడా చూపించాలనికూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగానే ఇటీవల రాహుల్‌గాంధీ విందు కూడా ఇచ్చారు. ఈ విందులో 25 పార్టీలనుంచి అనేకమంది నాయకులు పాల్గొన్నారు. వీరిలో ఖర్గే, సోనియా గాంధీ, శరద్‌పవార్; ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, అఖిలేష్‌యాదవ్, తేజస్వియాదవ్, అభిషేక్ బెనర్జీ, ఉద్ధవ్‌థాకరే, తిరుచ్చి శివ, టిఆర్‌బాలు, సిపిఎంకి చెందినెంఎ బేబీ, సిపిఐకి చెందిన రాజా, సిపిఐఎంఎల్‌కి చెందిన దీపాంకర్ భట్టాచార్య కమల్ హసన్ తదితరులు ఉన్నారు. ఈ సమావేశాన్ని అత్యంత విజయవంతమైన సమావేశాల్లో ఒకటిగా కెసి వేణుగోపాల్ అభివర్ణించారు.

# ఫోర్త్ సిటీలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మిస్తాం

## ప్రఖ్యాత క్రికెటర్ సయీద్ కిర్మాణీ ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరించిన క్రీడల శాఖ మంత్రి వివేక్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** ఫోర్త్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు క్రీడా, మైనింగ్ శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి స్పోర్ట్స్ పాలసీని త్వరలోనే ప్రవేశపెట్టనున్నారని పేర్కొన్నారు. ప్రఖ్యాత భారత క్రికెటర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సయీద్ కిర్మాణీ ఆత్మకథ స్టంప్డ్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్, టీమ్ ఇండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌తో పాటు పలు క్రీడా ప్రముఖులు హాజర య్యారు.

మంత్రి వివేక్ మాట్లాడుతూ 1983 వరల్డ్ కప్ విజయం తనకు ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకమని, చిన్నప్పుడు ఎల్బీ స్టేడియంలోనే క్రికెట్ నేర్చుకున్నానని అన్నారు. హైదరాబాద్ నుంచి భారత క్రికెట్‌లో మహ్మద్ సిరాజ్ ఒక గొప్ప ఐకాన్‌గా నిలిచారని ప్రశంసించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను తయారు చేయడం సిఎం లక్ష్యం అని మంత్రి వివేక్ తెలిపారు.

క్రికెట్‌లో అపారసేవలందించిన సయీద్ కిర్మాణీ జీవితంలోని విశేషాలను, అనుభవాలను స్టంప్డ్ పుస్తకంలో ఆవిష్కరించారు. ఈ పుస్తక ఆవిష్కరణకు హాజరైన అతిథులు కిర్మాణీ కృషిని,క్రీడా స్ఫూర్తిని కొనియాడారు.

# బిసి బిల్లుపై తెలంగాణలో బిజెపి అడ్డంకులు

## రాష్ట్రపతి సమ్మతి కోసం నాలుగు నెలలు ఎందుకు ఆపారు?

## ఎక్స్‌లో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి జైరాంరమేశ్


**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు బిల్లుపై కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ స్పందించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా తెలుగులో ఆసక్తికర పోస్ట్ వేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని పలు అంశాలపై ప్రశ్నించారు. 2023 నవంబర్ 9న, బీహార్ అసెంబ్లీ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఓబిసిలు, వెనుకబడిన వర్గాలకు (ఈబిసి) రిజర్వేషన్ల 65శాతానికి పెంచే బిల్లును ఆమోదించిచారని తెలిపారు. నవంబర్ 10, 2023న లెజిస్లేటివ్ కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపిందన్నారు. గవర్నర్ తన సమ్మతి ఇచ్చిన తర్వాత, ఆ బిల్లు 2023 నవంబర్ 21న అధికారికంగా చట్టంగా మారిందని పేర్కొన్నారు.తెలంగాణ అసెంబ్లీలో 2025 మార్చి 17న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన వర్గాల (బిసీ) రిజర్వేషన్లను 67శాతానికి (ఇందులో 42శాతం బిసిలకు రిజర్వేషన్) పెంచే బిల్లును ఆమోదించిందని తెలిపారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ మరుసటి రోజే ఆమోదం తెలిపిందని, మార్చి 30, 2025న గవర్నర్ ఆ బిల్లును భారత రాష్ట్రపతికి సమ్మతి కోసం పంపారని గుర్తుచేశారు. నాలుగు నెలలు గడిచినా సమ్మతి ఇప్పటికీ రాలేదని తెలిపారు. బీహార్ చట్టం అమల్లోకి వచ్చినప్పుడు నితీశ్ కుమార్ ఇంకా పార్టీ మార్పు చేయకుండా జేడియు, ఆర్‌జెడి, ఐఎన్సీ కూటమి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ట్వీట్టర్‌లో పేర్కొన్నారు. బిహార్‌లో సామాజిక వాస్తవాల దృష్ట్యా, ఆ బిల్లుకు గవర్నర్ సమ్మతిని ఆలస్యం చేయించడం లేదా అడ్డుకోవడం బిజెపికి సాధ్యం కాలేదన్నారు. గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి సమ్మతి కోసం పంపలేదని గమనించడం ముఖ్యమన్నారు. అయితే, తెలంగాణలో మాత్రం బిజెపి అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. ఇది తమ సామాజిక న్యాయానికి కట్టుబాటు ఎంత వరకు ఉందో బయటపెడుతోందని, రాష్ట్రపతి సమ్మతి కోసం నాలుగు నెలలకు పైగా ఎందుకు నిలిపివేశారు? అంటూ ప్రశ్నించారు.

# ఓటింగ్ పద్ధతి మార్చడంలో తప్పలేదు

## గుంటూరులో యలమంచిలి శివాజీని కలిసిన మాజీ మంత్రి జానారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** నాడు ప్రజాభిప్రాయం ప్రకారం బ్యాలెట్ పేపర్ నుంచి ఈవీఎం వైపు మొగ్గు చూపి ఎన్నికల సంస్కరణలు జరిగాయని మాజీ హోంమంత్రి, తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. మళ్లీ అదే ప్రజలు మార్పు కోరుకుంటే ప్రజాభిప్రాయ సేకరణ చేసి మార్చడంలో తప్పులేదని అభిప్రాయపడ్డారు. ఆదివారంనాడు గుంటూరులో మాజీ ఎంపీ యలమంచిలి శివాజీని జానారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు గుంటూరు జిల్లా ఇంఛార్జి మంత్రిగా పలు అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేసుకున్నారు. నేటి యువత విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. చారిత్రక కారణాలతో ఉమ్మడి రాష్ట్రం భౌగోళికంగా విడిపోయినా.. మానసికంగా తెలుగు ప్రజలు విడిపోలేదన్నారు.

# బిగ్‌బాస్‌లో ఛాన్స్ ఇప్పిస్తానని రూ.10 లక్షలకు టోపీ!



**ముంబయి, ఆగస్టు 10:** దేశవ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ పొందిన టెలివిజన్ రియాలిటీ షో 'బిగ్ బాస్'లో పాల్గొనే అవకాశం ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి తనను రూ. 10 లక్షలు మోసం చేశాడని భోపాల్‌కు చెందిన చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ అభినీత్ గుప్తా ఆరోపించారు. ఈ ఘటనపై ఆయన ముంబైలోని ఓషివారా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో భోపాల్‌లోనూ ఓసారి ఫిర్యాదు చేసినప్పటికీ, తాజాగా ముంబైలో కేసు నమోదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభినీత్ గుప్తా ఈ మోసం వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2022లో కరణ్ సింగ్ అనే వ్యక్తి తనను సంప్రదించి, 'బిగ్ బాస్'నిర్వా హకులతో తనకు మంచి పరిచయాలు ఉన్నాయని నమ్మబలికాడు. షోలో పాల్గొనేందుకు మొదట కోటి రూపాయలు డిమాండ్ చేయగా, అంత డబ్బు తన వద్ద లేదని అభినీత్ చెప్పారు. ఆ తర్వాత రూ. 60 లక్షలకు ఒప్పందం కుదిరిందని, ఆ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాలని కరణ్ సూచించాడు. ఈ క్రమంలోనే తనను ముంబైకి పిలిపించి, ఎండెమోల్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హరీశ్ షాతో సమావేశం ఏర్పాటు చేసినట్లు కరణ్ చెప్పాడని, ఆ తర్వాత డబ్బు డిమాండ్ చేయడంతో తాను రూ. 10 లక్షలు అత డికి బదలీ చేశానని అభినీత్ పేర్కొన్నారు. అయితే, 'బిగ్ బాస్' సీజన్ 16 కంటెస్టెంట్ల జాబి తాలో తన పేరు లేకపోవడంతో కరణ్‌ను ప్రశ్నిం చగా, వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా మధ్యలో పంపిస్తా నని చెప్పాడని తెలిపారు. ఆ సీజన్ ముగిశాక, తర్వాతి సీజన్‌లో అవకాశం ఇప్పిస్తానని మాట మార్చాడని అభినీత్ ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ 17 కూడా ముగిసి పోవడంతో నా డబ్బు వాపస్ ఇవ్వాలని కరణ్‌ను కోరాను. కానీ అతడు నన్ను తిప్పుతూనే ఉన్నాడు. చివరకు పోలీసులను ఆశ్రయించగా, దాదాపు రెండేళ్ల తర్వాత ఎంతో కష్టపడి ఎఫ్ఐఆర్ నమోదు చేయగలిగానని ఆయన వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 420 కింద మోసం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తనలా మరెవరూ ఇలాంటి మోసగాళ్ల బారిన పడకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని బయటపెడుతున్నట్లు అభినీత్ గుప్తా స్పష్టం చేశారు.



జ్యోతి వెలిగించి శివశంకర్ చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, వినయ్‌కుమార్, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, మహేష్‌కుమార్, మామిడి హరికృష్ణ, హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ, కెవిపి తదితరులు

# అందరికీ ఆదర్శప్రాయుడు శివశంకర్

## త్వరలో హైదరాబాద్‌లో విగ్రహం ఏర్పాటు

## జయంతి సభలో డి.సిఎం భట్టి


**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 10, ప్రభాతవార్త :** జీవితంలో ఒక లక్ష్యాన్ని పెట్టుకుని చిత్తశుద్ధి తపనతో పనిచేస్తే ఏదైనా తప్పక సాధిస్తామని నిరూపించిన శివశంకర్ ప్రతీఒక్కరికీ ఆదర్శప్రాయుడని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దానికి ఏ పేదరికం, వెనుకబడినతనం అడ్డుకాదని నిరూపించారని చెప్పారు. ఇదే విషయాన్ని తన ఆత్మకథలో కూడా వ్రాసారని గుర్తుచేశారు. దేశ ప్రధాన మంత్రులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల తర్వాతి 2వస్థానం మంత్రిగా స్వయంకృషితో పనిచేసి పేరుగాంచారని వివరించారు. భవిష్యత్తులో శివశంకర్‌ను స్ఫూర్తిగా పొందడం కోసం హైదరాబాద్ నగరంలో ఒక సముచితమైన ప్రదేశాన్ని చూసి త్వరలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా వారు చేసిన కార్యక్రమాలు గుర్తుతెచ్చుకొని సామాజికన్యాయం కోసం పనిచేసే విధంగా ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి, గవర్నరు, న్యాయకోవిదుడు బహుముఖ ప్రజ్ఞాశీలి పుంజాల శివశంకర్ 96వ జయంతి ఉత్సవం ఆదివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవంగా జరిగింది. ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ నిర్వహణలో డా. పి.వినయన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వి.శ్రీహరి, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, హర్యానా మాజీ గవర్నరు బండారు దత్తాత్రేయ, కెవిపి.రామచంద్రరావు, కె.కేశవరావు, పద్మనాభయ్య, కోదండరెడ్డి, వెన్నెల, అద్దంకి దయాకర్, ఎన్.శారద, జె.బి.రాజు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కమిషన్ల ఛైర్మన్లు, రాజకీయ నాయకులు పాల్గొని ముందుగా పి.శివశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతిప్రకాసనంచేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. శివశంకర్ నుండి మనమంతా స్ఫూర్తి పొందాల్సింది రెండు అంశాలన్నారు. శివశంకర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఎదగడానికి, ఆశయసాధనకు మార్గం సుగమం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. పి.శివశంకర్ కుమారుడు పి.వినయ్‌కుమార్ స్వాగతోపన్యాసం కావించారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశీలి అయిన శివశంకర్ ఏవిషయంలోను, సమస్యలకు తలవంచని మహోన్నతవ్యక్తి అని, ఆయన జీవితవిశేషాలను తెలుపుతూ ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని పంచుకున్నారు. అనంతరం మంత్రులు, తదితర నాయకులు మాట్లాడారు.

# 'శివ్హ త్వరలో తెలుగులో రీరిలీజ్

**శివ రీరిలీజ్ టీజర్** ఆగస్టు 14న విడుదల కానున్న కూలీతో వస్తోంది. ఆడియన్స్ డాల్బీ అట్మోస్‌లో 4 కె విజువల్స్‌తో శివ కొత్త సౌండ్, విజువల్ ని ఎక్స్ పీరియన్స్ చేయొచ్చు. ఇండియన్ సినిమాల్లో మైలురాయిగా నిలిచిన శివ ముప్పై యేళ్ల తర్వాత మళ్లీ చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ సారి సౌండ్ మొత్తం హై ఎండ్ ఎఐ టెక్నాలజీతో రీ-డిజైన్ చేశారు.

అన్నపూర్ణ స్టూడియోస్ ప్రొడక్షన్‌లో, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన శివా తనరా ఇంటెన్సిటీ, రియలిస్టిక్ యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమాకు కొత్త డెఫినిషన్ ఇచ్చింది. బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు విమర్శకుల ప్రశంసలను అందుకుంది. సిఎన్ఎన్- ఐబిఎన్ 100 ఇండియన్ ఫిల్మ్‌లో స్థానం సంపాదించింది.

ఇప్పుడు, అన్నపూర్ణ స్టూడియో 50వ వార్షికోత్సవం సందర్భంగా, మళ్లీ థియేటర్స్‌లోకి వస్తోంది. ఒరిజినల్ మోనో మిక్స్ సౌండ్‌ను తొలిసారి డాల్బీ ఆట్మాస్, హై ఎండ్ టి ఇంజనీరింగ్‌తో రీ-క్రియేట్ చేశారు. ఈ రీ-రిలీజ్ గురించి నాగార్జున మాట్లాడుతూ, శివ నన్ను ఐకానిక్ హీరోగా నిలబెట్టిన సినిమా. నా క్యారెక్టర్ మరిచిపోలేని స్థాయికి వెళ్లింది. ఇన్ని ఏళ్ల తర్వాత కూడా ఈ సినిమాను గురించి మాట్లాడుకుంటూ ఉండటం చూసి, నా అన్నయ్య వెంకట్ అక్కినేని, నేను కలిసి, దీన్ని గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయాలని భావించాం. ఈ సినిమాను



కల్ట్ క్లాసిక్‌గా ప్రేక్షకులకే కాకుండా, యూట్యూబ్‌లో చూసిన కొత్త జెనరేషన్‌కి కూడా థియేటర్‌లో అనుభవం ఇవ్వాలని అనుకున్నాం. అందుకే వెంకట్, నేను కలసి, డాల్బీ ఆట్మాస్ సౌండ్‌తో, 4కె విజువల్స్‌తో మళ్లీ ప్రెజెంట్ చేస్తున్నాం అన్నారు.

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, నాగార్జున, ప్రొడ్యూసర్స్ నాపై పెట్టిన నమ్మకమే ఈ సినిమాను ఇంత ఎత్తుకు తీసుకెళ్లింది. ఈ రోజుకీ ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్‌ను గుర్తుపెట్టుకోవడం నాకు అద్భుతంగా అనిపిస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్ రీ-రిలీజ్ చేయాలని నిర్ణయించుకోవడం నాకు నిజంగా థ్రిల్ ఇచ్చింది. ఒరిజినల్ సౌండ్ అప్పట్లో చాలా హైగా అప్రిషియేట్ చేయబడినా, ఈ రోజు స్టాండర్డ్స్‌కి సరిపడేలా మొత్తం రీ-డూ చేయాలని నిర్ణయించుకున్నాం. అడ్వాన్స్‌డ్ ఎఐ టెక్నాలజీతో, మోనో మిక్స్‌ను డాల్బీ ఆట్మాస్‌కి మార్చాం. శివని అందరూ చూసే ఉంటారు, కానీ ఈ కొత్త సౌండ్‌తో ఎవరూ ఇంతవరకూ ఎక్స్ పీరియన్స్ చేయలేదు. ఈ సారి ఆ ఎక్స్ పీరియన్స్ గ్యారంటీ అన్నారు .

# గోల్డెన్ ప్రొడక్షన్స్ ప్రొడక్షన్ నం1. గ్రాండ్‌గా లాంచ్



**గగన్ బాబు,** కశికా కపూర్ హీరో హీరోయిన్‌గా సత్యం రాజేష్, సాయి రోనక్ కీలక పాత్రలలో ఎ కె జంపన్న దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం1 గా తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న కొత్త చిత్రం ఈ రోజు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి క్లాప్ కొట్టారు. వివేక్ కూచిభట్ల కెమరా స్విచాన్ చేశారు. నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వరరావు, దర్శకుడు ఎ కె జంపన్నకి స్క్రిప్ట్ ఆందజేశారు. ఫస్ట్ షాట్‌కు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో పృథ్వీ, మణిచందన, మహేష్ విట్టా, రంగస్థలం మహేష్, నాగ మహేష్, ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. డీవోపీ వికె రామరాజు. జెకె మూర్తి ఆర్ట్ డైరెక్టర్.

మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో డైరెక్టర్ జంపన్న మాట్లాడుతూ, ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సాహుకి, వివేక్‌కి, శంకర్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా కథని నిర్మాత కోటేశ్వరరావుతో చెప్పినప్పుడు సినిమా ఖచ్చితంగా తానే చేయాలని గోల్డెన్ ప్రొడక్షన్ అనే బ్యానర్ పెట్టి ఆయనే ప్రొడ్యూస్ చేస్తున్నారు. అన్ని రకాలుగా ముందుండి నడిపిస్తున్నారు. ఇదొకఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్. చాలా లేయర్స్ ఉంటాయి. అందరూ మాట్లాడుకునే విధంగా ఉంటుంది. త్వరలోనే షూటింగ్ మొదలు పెడతాం అన్నారు.

నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వరరావు మాట్లాడుతూ, డైరెక్టర్ ఈ కథ చెప్పగానే నేనే ఒక బ్యానర్‌ని స్టార్ట్ చేసి ఈ సినిమాని తీయాలనుకున్నాను. గోల్డెన్ ప్రొడక్షన్స్‌లో వస్తున్న ఫస్ట్ ఫిల్మ్ ఇది. మా సినిమాకి మ్యూజిక్ ఇస్తున్న అనూప్ రూబెన్స్, ఇది అద్భుతమైన స్టోరీ ఇది. దేశం అంతా మాట్లాడుకునే విధంగా ఉంటుంది.

హీరో గగన్ మాట్లాడుతూ ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సాహుకి, వివేక్‌కి, శంకర్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు. డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. అద్భుతమైన ఎమోషన్స్ వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్ ఇది. నిర్మాత ఈ కథ విన్న వెంటనే తనే ప్రొడ్యూస్ చేస్తానని ముందుకు వచ్చారు. ఈ సినిమా కంప్లీట్‌గా మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది క్లైమాక్స్ ఎక్స్ట్రా డినరీగా ఉంటుంది. ఇది ప్యూర్ ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ చేస్తాం. హీరోయిన్ కశికా కపూర్ మాట్లాడుతూ, ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా నాకు చాలా స్పెషల్. ఇలాంటి మాస్టర్ పీస్ మూవీ లో భాగంగా చాలా ఆనందంగా ఉంది. ఈ మూవీ జర్నీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అన్నారు. నటీనటులు: గగన్ బాబు, సత్యం రాజేష్, సాయి రోనఖ్, కశికా కపూర్, పృథ్వీ, మణిచందన, మహేష్ విట్టా, రంగస్థలం మహేష్, నాగమహేష్, టెంపర్ వంశీ, కిల్లి క్రాంతి. బ్యానర్: గోల్డెన్ ప్రొడక్షన్స్, నిర్మాత: తోట లక్ష్మీ కోటేశ్వరరావు, రచన, దర్శకత్వం: ఎ కె జంపన్న, సంగీతం: అనూప్ రూబెన్స్ డిఓపి: వికె రామరాజు, ఆర్ట్ డైరెక్టర్: జెకె మూర్తి, పీఆర్వో: వంశీ శేఖర్

# 'పరదా' థియెట్రికల్ ట్రైలర్ లాంచ్



**అనుపమ పరమేశ్వరన్** కథానాయికగా, దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రల్లో సినిమా బండి ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల 'పరదా' అనే మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. 'ది ఫ్యామిలీ మ్యాన్హ సిరీస్ మేకర్స్ రాజ్, డికె మద్దతు ఇస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈరోజు ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.

'పరద్హా కథ సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) చుట్టూ తిరుగుతుంది. తన ఊరిలోని కఠినమైన, మగవారికి మాత్రమే మద్దతు ఇచ్చే సంప్రదాయాల వల్ల విసిపోయిన సుబ్బు, ఓ ధైర్యమైన నిర్ణయం తీసుకుంటుంది. ఇద్దరు అపరిచితులు (దర్శన రాజేంద్రన్, సాంగీత)తో కలసి, ఓ ఎనర్జీతో నిండిన రోడ్ ట్రిప్‌కి వెళుతుంది. కానీ, కథ ఒక్కసారిగా సీరియస్ మలుపు తిప్పుతుంది. సుబ్బు అదృశ్యమవుతుంది. ఊరిలో ఆమె కోసం ఓ ప్రమాదం పొంచి ఉంటుంది.

దర్శకుడు ప్రవీణ్ కంద్రెగుల తెరకెక్కించిన ఈ కథ, పాతుకుపోయిన సంప్రదాయాలపై నేరుగా ప్రశ్నలు వేస్తూ, నిజాయితీగా సాగుతుంది. అనుపమ పరమేశ్వరన్ తన కెరీర్‌లోనే బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది. సుబ్బు పాత్రలో అద్భుతంగా నటించింది. దర్శనరాజేంద్రన్, సంగీత కూడా బలమైన నటనతో మెప్పించారు. రాగ్ మయూర్ కూడా తనదైన ఇంపాక్ట్ క్రియేట్ చేశారు.

మృదుల్ సుజిత్ సేన్ సినిమాటోగ్రఫీ, పల్లెజీవితానికి, హిమాలయాల అందాలకు మధ్య ఉన్న డిఫరెన్స్ అందంగా చూపించింది. గోపీ సుందర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి కావాల్సిన ఇంటెన్సిటీని పర్ఫెక్ట్‌గా అందించింది. బలమైన ప్రొడక్షన్ విల్యూస్‌తో పరదా ఒక పవర్‌ఫుల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. 'పరద్హా ఆగస్ట్ 22న థియేటర్స్‌లో రిలీజ్ అవుతోంది.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా స్టోరీ లైన్ నాకు తెలుసు. చాలా అద్భుతమైన కథ. డెఫినెట్‌గా ఇలాంటి సినిమాలు ఎంకరేజ్ చేయాలి. బాలీవుడ్‌లో లాపతలేడీస్ లాంటి సినిమాలు చూస్తుంటాం. మనం ఎందుకు అలాంటి సినిమాలు చేయలేమని ఆలోచిస్తుంటాం. ఇలాంటి సినిమాలు నిర్మిస్తున్న నిర్మాతల్ని తప్పకుండా ప్రోత్సహించాలి. ఈ సినిమా హిట్ అయి నిర్మాతలకు చాలా డబ్బులు రావాలని కోరుకుంటున్నాను. ఇలాంటి సినిమాలు విజయాలు సాధిస్తే నిర్మాతలకి ధైర్యం వస్తుంది. ప్రవీణ్ తీసిన సినిమా బండి సినిమా నాకు చాలా ఇష్టం. ఈ సినిమాతో అతను మరో అద్భుత విజయం సాధించాలని కోరుకుంటున్నాను. గోపీసుందర్ మ్యూజిక్ అద్భుతంగాఉంది. అనుపమ నాకు చాలా మంచి ఫ్రెండ్. ఏ క్యారెక్టర్ ఇచ్చిన 100ఎఫర్ట్ పెడుతుంది. తనకి సినిమా అంటే చాలా పాషన్. ఈ సినిమాలో ఫెంటాస్టిక్ పెర్ఫార్మన్స్ ఇచ్చింది. ఆగస్టు 22న ఈ సినిమా రిలీజ్‌అవుతుంది. మిస్ అవ్వకుండా చూడండి అన్నారు. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, రామ్ నాకు బెస్ట్ ఫ్రెండ్. పరదా సినిమా నాకు ఎంత ఇంపార్టెంటో ఆయనకు తెలుసు. ఆయనతో మాట్లాడినప్పుడు ఈ సినిమాకి సంబంధించి ఏ సపోర్ట్ కావాలన్నా నన్ను అడుగు అని అన్నారు. రామ్ లాంటి ఫ్రెండు నాకు ఉండడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన బిజీ షెడ్యూల్‌లో మా కోసం వచ్చి ఈ ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను కూడా ఆంధ్ర కింగ్ కోసం ఎదురుచూస్తున్నాను. ఈ సినిమా ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. చాలా మంచి సినిమా ఇది. తప్పకుండా అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను.

ప్రొడ్యూసర్ విజయ్ మాట్లాడుతూ, మన మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే రోజున సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాని ప్రాణం పెట్టి పనిచేశాం. అనుపమ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. ఈ సినిమాతో అనుపమ 2.0 చూడబోతున్నాం. మా ట్రైలర్ లాంచ్ చేసిన రామ్‌కి ధన్యవాదాలు. ఆయన ఒక మంచి సినిమాని ఎంకరేజ్ చేద్దామని రావడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. 100 చెప్తున్నాను. ఈ సినిమా మిమ్మల్ని డిసప్పాయింట్ చేయదు. ఆగస్టు 22 అందరం థియేటర్స్‌లో కలుద్దాం.

డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ, మా ట్రైలర్ లాంచ్ చేసిన రామ్‌కి ధన్యవాదములు. చాలా పెద్ద సపోర్ట్ ఇచ్చారు. ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాతో అనుపమ కొత్త వర్షన్ చూడబోతున్నారు. ఈ సినిమా రివ్యూ బాగుంటేనే సినిమా చూడండి అన్నారు.

ప్రొడ్యూసర్ శ్రీధర్ మాట్లాడుతూ, సూపర్ స్టార్ మహేష్ బాబు బర్త్ డే రోజున ట్రైలర్ రిలీజ్ చేస్తున్నాం. మెగాస్టార్ చిరంజీవి బర్త్డే రోజున సినిమా రిలీజ్ అవుతుంది. మా సినిమాని ప్రమోట్ చేయడానికి విచ్చేసిన రామ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఇప్పటివరకు కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సినిమా చూసిన తర్వాత మంచి థియేటర్ ఎక్స్పీరియన్స్ ఈ సినిమా ఇస్తుంది. అందరూ ఈ సినిమాకి తప్పకుండా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. మూవీ యూనిట్ అంతా ఈ వేడుకలో పాల్గొన్నారు.

# 'కె-ర్యాంప్హ నుంచి 'ఓనమ్' లిరికల్ సాంగ్ విడుదల



**సక్సెస్ ఫుల్ హీరో** కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కె-ర్యాంప్హ . ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. 'కె-ర్యాంప్హ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ రోజు'కె-ర్యాంప్హ సినిమా నుంచి 'ఓనమ్హ లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సురేంద్ర కృష్ణ లిరిక్స్ రాయగా, ఎనర్జిటిక్ ట్యూన్‌తో కంపోజ్ చేసి సాహితీ చాగంటితో కలిసి పాడారు మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్. 'ఓనమ్హ లిరికల్ సాంగ్ ఎలా ఉందో చూస్తే ఇన్ స్టా ఆపేశానే, ట్విట్టర్ మానేశానే, నీకే ట్యాగ్ అయ్యానే మలయాళీ ఫోనే మార్చేశానే, ఛాటింగ్ ఆపేశానే, నీకే సింక్ అయ్యానే వదలను ఇల్లా వైబే వచ్చేసిందే నిన్నే చూడగానే, లెఫ్టే ఉన్న గుండె రైటు రైటందే... అంటూ మాస్ మెలోడీతో ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. కేరళ పండుగ ఓనమ్ సందడి అంతా ఈ పాటలో కనిపించింది. 'ఓనమ్హ పాటలో హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ యుక్తి తరేజా మాస్ స్టెప్స్ స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

# ఆరు కొత్త సినిమాల స్క్రిప్టులు లాక్ చేసిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్



**ప్రముఖ నిర్మాణ సంస్థ** 70ఎమ్ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఆరు కొత్త సినిమాల స్క్రిప్టులు లాక్‌చేస్తూ, ఇవాళ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. వచ్చే రెండేళ్లలో ఈ ఆరు సినిమాలను వరుసగా తెరకెక్కించి విడుదల చేయనున్నారు. వేర్వేరు జానర్స్‌లో ఎప్పటిలాగే క్వాలిటీ స్టోరీటెల్లింగ్‌కి ప్రాధాన్యం ఇస్తూ ప్రేక్షకుల్ని అలరించేలా ప్లాన్ చేస్తున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి స్థాపించిన 70ఎమ్ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇప్పటివరకు క్రిటిక్స్, ప్రేక్షకుల ప్రసంశలు పొందిన ఎన్నో హిట్ సినిమాలు అందించింది. 2015 - భలే మంచిరోజు (సుధీర్ బాబు, వామికా గబ్బి), 2017 - ఆనందో బ్రహ్మ (తాప్సీ పన్ను, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిషోర్), 2019 - యాత్ర (మమ్ముట్టి), 2021 - శ్రీదేవి సోడా సెంటర్ (సుధీర్ బాబు, ఆనంది) - సోషల్ మెసేజ్‌తో కూడిన విజువల్‌గా రిచ్ డ్రామాగా నిలిచింది. వచ్చే ప్రాజెక్టుల గురించి నిర్మాతలు మాట్లాడుతూ, ప్రతి సినిమా థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఉంటుంది. మేము ఎప్పుడూ క్వాలిటీ కంటెంట్‌కే ప్రాధాన్యం ఇస్తాం. ఈ ఆరు సినిమాలు కూడా అదే ట్రెడిషన్‌ను కొనసాగిస్తాయి.. డైరెక్టర్లు, హీరోల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

# సాయి దుర్గ తేజ్‌కు 'యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డు



**యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్** గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 కార్యక్రమం హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో జరిగింది. మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమకు చెందిన కొంతమంది ప్రముఖులు కలిసి సందడి చేశారు. ఈ క్రమంలో సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మోస్ట్ డిజైరబుల్ (మేల్) అవార్డును గెలుచుకున్నారు.

ఈఅవార్డును సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌ప్రదానం చేశారు. ఈ అవార్డుని తల్లి విజయ దుర్గ, తండ్రి డాక్టర్ శివ ప్రసాద్ చేతుల మీదుగా తీసుకోవాలని సాయి దుర్గ తేజ్ కోరుకున్నారు. ఇక వేదికపైనే ఈఅవార్డుని, గౌరవాన్ని సాయి దుర్గతేజ్ తన తల్లికి అంకితం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో తనను తల్లి కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేసుకున్నారు. నేను అంతా కోల్పోయానని అనుకున్నప్పుడు, నా తల్లి నాకు అండగా నిలిచి ధైర్యం చెప్పారు. ఆమె నాఆత్మవిశ్వాసాన్ని పెంచి నన్ను సాధారణ స్థితికి తీసుకువచ్చారు అని అన్నారు. 'కంఫర్టబుల్‌గా ఉండే దుస్తుల్ని ధరించండి. ప్రశాంతంగా, సంతోషంగా, ఉండండి అని ఆయన అన్నారు. తన స్టైల్ ఐకాన్‌లను పేర్కొంటూ రామ్ చరణ్, పవన్ కల్యాణ్‌లను ఎంచుకున్నారు. ఆరెంజ్ సినిమాలో రామ్ చరణ్ లుక్స్ తన ఆల్ టైం ఫేవరేట్ స్టైల్, లుక్స్ అని సాయి దుర్గ తేజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాని, అడివి శేష్, సుధీర్ బాబు, సందీప్ కిషన్, మాళవిక మోహనన్, తేజ సజ్జ, అనిల్ రావిపూడి, నాగ వంశీ, ప్రగ్యా జైస్వాల్, రాశిఖన్నా, మంచు లక్ష్మి, భాగ్యశ్రీ బోర్సే, అదితి రావు హైదరి, సిద్ధార్థ్, చిన్మయి శ్రీపాద, దేవి శ్రీ ప్రసాద్ వంటి అనేక మంది ప్రముఖ సినీ ప్రముఖులు పాల్గొన్నారు. సాయి దుర్గ తేజ్ ప్రస్తుతం రోహిత్ కెపి దర్శకత్వంలో ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా హైబడ్జెట్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటి గట్టు' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా 2025 చివరిలో విడుదల కానుంది.

# 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తుల్లు ఫస్ట్‌లుక్ విడుదల




**వడ్డే జిష్ణు** సమర్పణలో "వడ్డే క్రియేషన్స్హ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా నిర్మాతగా చేస్తున్న చిత్రం 'ట్రాన్స్ ఫర్ త్రిమూర్తుల్హ, కమల్ తేజ నార్ల ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు డైరెక్టర్‌తో పాటు కథ స్క్రీన్ ప్లేను వడ్డే నవీన్ ఈ చిత్రానికి అందించడం విశేషం. ఇక ఈ మూవీలో వడ్డే నవీన్‌కి జోడీగా రాశీసింగ్ నటిస్తున్నారు.

వడ్డే నవీన్ తండ్రి వడ్డే రమేష్ తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రముఖ నిర్మాత అని అందరికీ తెలిసిందే. ఆయన సంస్థ అయిన "విజయ మాధవి కంబైన్స్హ నుంచి ఎన్టీఆర్‌తో "బొబ్బిలి పుల్హి, మెగాస్టార్ చిరంజీవితో "లంకేశ్వరుడ్హ, రెబల్ స్టార్ కృష్ణంరాజుతో "కటకటాల రుద్రయ్హ, ఏఎన్ఆర్ ఇంకా కృష్ణ లాంటి ఎందరో పెద్ద పెద్ద స్టార్లతో చిత్రాలు నిర్మించి "మోస్ట్ సక్సెస్ఫుల్హ నిర్మాణ సంస్థగా రూపొందింది. ఇప్పుడు ఆ నిర్మాణ సంస్థ కొనసాగింపుగా "వడ్డే క్రియేషన్స్హ అనే బ్యానర్‌ని స్థాపించి, వడ్డే నవీన్ తండ్రి బాటలో పయనించాలని నిర్ణయించుకుని ఇకపై"వడ్డే క్రియేషన్స్ బ్యానర్హ లో సినిమాలు రూపొందించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే మొదట చిత్రంగా "ట్రాన్స్ ఫర్ త్రిమూర్తుల్హ నిర్మిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వడ్డే నవీన్ సినిమాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే, ఇక ఆయన త్వరలోనే "ట్రాన్స్ ఫర్ త్రిమూర్తుల్హ చిత్రంతో అందరిని అలరించబోతునారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ మే 15, 2025, నుండి మొదలై ఇప్పటివరకు దాదాపు 80శాతం చిత్రీకరణ పూర్తయినట్లుగా సమాచారం. తాజాగా రిలీజ్ చేసిన ఈ మూవీ "ఫస్ట్ లుక్హ అందర్నీ ఆకట్టుకుంది. ఈ "ఫస్ట్ లుక్హ పోస్టర్ ని గమనిస్తే కామెడీ యాంగిల్ కూడా వడ్డే నవీన్ ఇందులో మరింతగా చూపించబోతున్నారని అర్థమవుతుంది. వడ్డే నవీన్, రాశీ సింగ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో రఘు బాబు, సాయి శ్రీనివాస్, బాబా మాస్టర్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, దేవీ ప్రసాద్, సూర్యకుమార్ భగవదాస్, శివ నారాయణ, ప్రమోదిని, గాయత్రి భార్గవి, జ్వాల కోటి, దేవి మహేష్, ఊహా రెడ్డి, రేఖా నిరోష, గాయత్రి చాగంటి, సాత్విక్ రాజు, అంజలి ప్రియ వంటి వారు కీలక పాత్రలను పోషించారు. ఈ మూవీకి కార్తిక్ సుజాత సాయికుమార్ కెమెరామెన్‌గా, కళ్యాణ్ నాయక్ సంగీత దర్శకుడిగా, విజయ్ ముక్తావరపు ఎడిటర్‌గా పని చేశారు.



ప్రియాంక మోహన్

11 -8pg 9 cheli_11 -8pg 9 cheli.qxd 08-08-2025 17:32 Page 1



# మెడ మెరిసేలా..



ముఖం అందంగా కనిపించడం కోసం ఎన్నో రకాల క్రీములు, ప్యాక్‌లు వాడతాం.కానీ మెడ భాగానికొచ్చేసరికి నిర్లక్ష్యం చేస్తుంటాం. ఇరవైల్లో పెద్దగా తేడా తెలియకపోయినా.. వయసు పెరిగేకొద్దీ ఆ ప్రభావం మెడ మీద బాగా కనిపిస్తుంది. మెడ చుట్టూ నల్లటి వలయం, సన్నటి ముడతలు, చిన్న చిన్న పొక్కులతో క్రమంగా చర్మం కాంతి విహీనంగా తయారవుతుంది. ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మెడ సౌందర్యాన్ని తిరిగి పెంపొందించుకోవచ్చు. అవేంటో తెలుసుకుందాం..

**ఇలా శుభ్రపరచుకోవాలి..** ముఖంపై ఉండే చర్మం కన్నా మెడ చర్మం చాలా పల్చగా, సున్నితంగా ఉంటుంది. అందుకని ఎక్కువ గాఢత కలిగిన సబ్బులను వాడకూడదు. వీలైనంత వరకు రసాయనాలు లేని సబ్బు/బాడీ వాష్‌లను వాడాలి. అంతేకాదు.. ముఖాన్ని శుభ్రం చేసుకునే ప్రతిసారీ మెడను కూడా శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

**స్క్రబ్ వాడాలి ....** చెమట వల్ల మెడపై చాలా త్వరగా మురికి చేరుతుంది. అంటేకాదు నిత్యం మనం ధరించే చెయిన్ల వల్ల



కూడా మెడ పైన మురికి పేరుకునే అవకాశం ఉంది. సబ్బుతో పైపై మురికి పోయినా, చర్మ రంధ్రాల్లో పేరుకున్న మలినాలు పోవాలంటే స్క్రబ్బర్ తప్పని సరి. ఆ జరగకుండా ఉండాలంటే మనం వేసుకునే చెయిన్లను శుభ్రంగా ఉంచుకోవాలి. వారానికి నాలుగుసారునడుల స్క్రబ్బర్ వాడాలి.

- బాదం పలుకులని బరకగా పొడి చేసి, కొద్దిగా పాలుకలిపి పేస్ట్‌లా చేసి మెడకు పట్టించాలి. భుజాల నుంచి ముఖం వైపుగా ఐదు నిమిషాల పాటు స్క్రబ్ చేసి, చల్లటి నీటితో కడగేయాలి. ఐదు నిమిషాలకు మించి స్క్రబ్ చేయకూడదు. ఎందుకంటే అతిగా స్క్రబ్ చేయడం వల్ల పల్చని మెడ చర్మం దెబ్బతినే ప్రమాదం ఉంది.

**నెక్ ప్యాక్ !..** ఫేస్ ప్యాక్ వాడుతున్న ప్రతిసారీ మెడకి కూడా ప్యాక్ వేసుకోవడం తప్పనిసరి. బాగా పండిన అరటి పండు లేదా గుమ్మడి పండు, బొప్పాయి గుజ్జుతో ప్యాక్ వేసుకుని 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఫ్రూట్ ప్యాక్‌లను వాడటం వల్ల చర్మం కాంతివంతంగా తయారవుతుంది.



- పాలమీగడలో పావు చెంచా నిమ్మరసం, చిటికెడు పసుపు కలిపి మెడకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేస్తే మెడ చుట్టూ పేరుకున్న నలుపు క్రమంగా తగ్గుతుంది.

**టోనింగ్...** ముఖంపై చర్మానికి టోనర్ వాడేప్పుడు మెడకు కూడా టోనర్ అప్లై చేయడం అలవాటు చేసుకోవాలి. కానీ మెడకి టోనర్ రాసుకునేప్పుడు నేరుగా చేతి వేళ్లతో కాకుండా దూదిని వాడాలి.

# ఆకాశంలో గోల్డెన్ గర్ల్



ఆకాశంలో విమానం... ఎలా ఎగురుతుంది? ఎవరు నడుపుతారు? ఈ ప్రశ్నలే ఆ చిన్నారికి ఆకాశంలో ఎగరాలనే కోరిక కలిగించింది. నింగిలో వేల గంటలకు చేశాపై విమానం నడిపి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేలా ఉంది. ప్రస్తుతం ఈమె డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఇన్‌స్పెక్టర్ కూడా. ఫ్లైట్ ఆపరేషన్‌ని పరిశీలించడమే కాదు, విమానంలో అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో శిక్షణ ఇచ్చే స్థాయికి చేరుకున్నారు. కెప్టెన్ పూనమ్ దేవరాఖ్యానీ. భోపాల్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగారు పూనమ్. అక్కడే ఏవియేషన్‌లో డిగ్రీతోపాటు, ఏరోస్పేస్ ఏవియేషన్‌లో ఎంబీఏ పూర్తిచేశారీమె. తనకి ఓ తమ్ముడు... విజయ్. అతను పుట్టుకతోనే 98 శాతం లోకోమోటార్ డిజెబిలిటీ, సెరిబ్రల్ పాల్సీతో బాధపడేవాడు. దాంతో ఆమె తండ్రి సంపాదన అంతా వైద్య ఖర్చులకే సరిపోయేది. చిన్నప్పటి నుంచి పూనమ్ పైలట్ అవ్వాలనే కోరిక. 'ఆ పసిడి నాన్నకి చెబితే' పూటగడవని పరిస్థితులు మనవి. ఒకసారి ఆలోచించు మనలాంటివాళ్లకు సాధ్యమేనా? పైగా ఆడపిల్లవి కష్టం అన్నారు. దాంతో నా చదువు నాన్నకి ఆర్థిక భారం కాకూడదనుకున్నా. జెట్ ఎయిర్వేస్లో పార్ట్ టైం జాబ్ చేసేదాన్ని. అక్కడ పని చేస్తుంటే ఎందుకో తెలీదు నా కలలకి దగ్గరున్నట్లుండేది. రాత్రుళ్లు విమానాల మధ్యలో కూర్చునే చదువుకునేదాన్ని. అలా నా సొంత డబ్బుతోనే కొన్నాళ్లకి పైలట్ అయ్యా. మొదటిసారి కాక్పెట్‌లో కూర్చుని గాల్లో ఎగురుతుంటే చిన్నప్పుడు డాబా మీద కూర్చుని కలలుగన్న రోజులు గుర్తొచ్చాయి అంటారు పూనమ్. 2019లో జెట్ ఎయిర్‌వేస్ మూసివేతకు దగ్గరగా ఉన్నప్పుడు కొన్ని నెలలపాటు ఖాళీ విమానాలు నడుపుతూ జీతం లేకుండా కూడా పనిచేశారట. తర్వాత అనేక సంస్థల్లో పనిచేసి 2021లో డీజీసీఏ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తన మొత్తం ప్రయాణానికి స్ఫూర్తి మాత్రం ఆమె తమ్ముడేనట. సమస్యల్లో ఉన్నప్పుడు ఎలా ధైర్యం తెచ్చుకోవాలి? వాటినే లక్ష్యాలుగా ఎలా మార్చుకోవాలనేది తన దగ్గరే నేర్చుకున్నా. ఎందుకంటే వైకల్యంతో బాధపడుతూనే అత్యధిక దూరం జిప్‌లైన్‌ను నడిపిన వ్యక్తిగా విజయ్ రికార్డు సృష్టించాడు. ఆసియా, ఇండియా, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించాడు. అందుకే ఏదైనా సమస్య వస్తే ధైర్యం కోసం వెంటనే తననే గుర్తుచేసుకుంటా అంటారు పూనమ్.

**ఆపదలో ఎలా కాపాడాలో తెలియాలి....**

డీజీఏలో ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నంత సేపూ చాలా ఏకాగ్రతతో ఉండాలి. ఆకాశంలో ఎగిరే ప్రతి విమానాన్ని పర్యవేక్షిస్తుండాలి. పైలట్ కూడా అలర్ట్‌గా ఉండాలి. వందలమంది ప్రాణాలు మనచేతిలోనే ఉంటాయి. ఓసారి దోహా నుంచి వస్తుండగా విమానంలో కార్గోడోర్ అలర్ట్ కారణంగా టేకాఫ్ను నిలిపివేయాల్సి వచ్చింది. మరోసారి విమానాన్ని గాల్లోనే ఉంచి రిపేరు చేశాం. ఇంకోసారి ఇంజిన్‌లో మంటలు చెలరేగగా... మేము వెంటనే చెల్లిస్ట్‌ను తీసుకుని దగ్గర్లో ఉన్న ఎయిర్‌పోర్టులో విమానాన్ని ఆపేశాం. ఒక పైలట్ ఇలాంటి సందర్భంలో ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవడం చాలా కష్టం. అందుకే ప్రతి ఆరునెలలకు ఓసారి పైలట్లకు శిక్షణ ఇస్తుంటాం. ఈ ప్రక్రియ రెండు రోజులు జరుగుతుంది. ప్రామాణిక ఆపరేటింగ్ విధానాల్లో నావిగేట్, ఏవియేట్, కమ్యూనికేట్ చేయడం... ఈ మూడు అంశాలు తప్పక నేర్పుతాం. నావిగేట్ అంటే ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవడం, ఏవియేట్ చేయడం అంటే విమానాన్ని నడపడం, కమ్యూనికేట్ అంటే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌తో టచ్‌లో ఉండటం.. వీటితోపాటు ఇంజిన్ వైఫల్యం నుంచి క్యాబిన్ ప్రెజర్ సమస్య వరకూ తెలిసి ఉండాలి. విమానంలో సమస్యలు వేటికవే భిన్నంగా ఉంటాయి. ఏ సమస్య వచ్చినా రక్షణచర్యలు చేపట్టాల్సిన బాధ్యత పైలట్ చేతుల్లోనే ఉంటుంది అంటారీమె. విమానయాన రంగంలో ఉత్తమ సాంకేతిక నైపుణ్య సేవలు అందించినందుకు గానూ విమానయాన మంత్రిత్వ శాఖ 37 మంది మహిళలకు పౌర పురస్కారాలు అందించింది. అందులో పూనమ్ 'యంగ్ ఉమన్ ఏవియేషన్ లీడర్' అవార్డుని అందుకున్నారు. విమానయాన రంగంలో ఆమె సాధించిన ఈ విజయాలే.. 'గోల్డెన్ గర్ల్' అన్న బిరుదును తెచ్చిపెట్టాయి.

# పంచదారను పరిచయం చేసింది..



బూరెలు, బొబ్బట్లు, జిలేబి, జాంగ్రి, పాయసం, ఖీర్, రసమలై, గులాబ్ జామూన్..ఇలా మనదేశంలో ప్రసిద్ధమైన స్వీట్లు 200వరకు ఉన్నాయి. వాటిల్లో కొన్ని మాత్రమే బెల్లంతో చేసేవి కాగా, తక్కినవన్నీ పంచదారతో తయారయ్యేవే. హాని చేసే ఈ పంచదారను మనకు పరిచయం చేసింది పోర్చుగీసు వాళ్లు. అంతకుముందు మనవాళ్లు మిఠాయిలన్నిటినీ పండ్లగుజ్జు, తేనెతోనే చేసేవారు.

# నాచుతో అందంగా !

అందంగా కనిపించాలని ఎవరికి ఉండదు. అందుకోసం చాలా ఉత్పత్తులే వాడతా కదా! అయితే, చర్మ సంరక్షణకు వాడే ఔషధాల జాబితాలోకి ఈసారి ఆల్గే చేరడమే కాదు, ట్రెండ్‌గానూ మారింది. ఇంతకీ ఇది మేలు చేసేనా? నాచు అంటే వర్షాకాలంలో ఇంటి చుట్టు పక్కల చేరేది అనుకునేరు! దీన్ని ప్రత్యేకంగా సముద్రాలు, నదుల నుంచి సేకరిస్తారు. ఇది కొన్ని దేశాల్లో ఆహారం కూడా. దీనిలోని పాలీశాకరైడ్లు చర్మంలో తేమను బంధించి ఉంచుతాయి. ఇన్‌ఫ్లమేషన్‌నీ దరిచేరనీయవు. వాతావరనంలో మార్పులు, కలుష్యం కారణంగా ఏర్పడే హాని నుంచి రక్షిస్తాయి. అందుకే బ్యూటీ ఉత్పత్తుల్లో నాచుకి చోటిస్తున్నారు. దీనిలోని అమైనో యాసిడ్లు, పాలీశాకరైడ్లు, పాలీఫినాల్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. తద్వారా వృద్ధాప్యఛాయల్ని త్వరగా దరి చేరనీయవు. ఎన్నో పరిశోధనలూ దీన్ని రుజువు చేస్తున్నాయి. వీగన్.. ఇప్పుడు చాలామంది బ్యూటీ ఉత్పత్తుల్లో చూస్తున్నది ఇదే! ఆల్గేని వృక్షజాతుల కిందే లెక్కేస్తారు కాబట్టి, ధైర్యంగా వాడొచ్చంటారు నిపుణులు. సీరమ్, మాయిశ్చరైజర్లలో దేన్నైనా నాచుతో తయారు చేస్తే ప్రయత్నించమంటున్నారు. వారానికోసారి దీంతో తయారు



చేసిన మాస్క్‌ని వేసుకున్నా ప్రయోజనమేనట. నిజానికి మన వాడే చాలారకాల యాంటీ పిగ్మెంటేషన్, యాంటీ యాక్నే ఉత్పత్తుల్లో చాలావరకూ ఆల్గే ప్యాక్‌ల పేరుతో ఆన్‌లైన్ వేదికల్లో ట్రెండ్ అవుతున్నాయి. నాచులోని విటమిన్లు, మినరల్స్ చర్మానికి మేలు చేస్తాయన్నది వాస్తవమే. టాక్సిన్లు, మలినాలను తొలగించి చర్మకణాల పునుద్ధరణకూ తోడ్పడతాయి. అయితే కొందరిలో ఇవి దురద, దద్దుర్లకు దారితీస్తాయి. కాబట్టి, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అదండీ సంగతి. మీరూ ప్రయత్నిస్తారా ఈ ఆల్గే ట్రెండ్?

# ఉల్లి పాయ కదలదిక..




చాపింగ్ బోర్డు మీద చాకుతో ఉల్లి పాయలు, కూరగాయలు కొస్తున్నప్పుడు ఒక్కోసారి ఎగిరి చుట్టుపక్కల చెల్లాచెదురుగా పడుతుంటాయి. అలా కిందపడ్డవాటిని పారేయడంతో వృథా కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇలాంట ఇబ్బందు లేవీ లేకుండా చేస్తుంది హోల్డర్. దీన్ని ఉల్లిపాయ లకు గట్టిగా గుచ్చి పట్టు కోవడంతో ఎటూ కదల కుండా ఉంటాయి. అలాగే నిమ్మకాయలు, కీరాలనూ పలుచగా, చక్రాల్లా కోసుకోవచ్చు కూడా.

# పిల్లలకు బొమ్మల బ్యాగులు













అమ్మా నాకు స్పైడర్ మ్యాన్ టీషర్ట్ కొను... అవెంజర్స్ బ్యాగ్ కావాలి... బాటిల్ మీద బార్బీ దాల్ ఉంటేనే నేను నీళ్లు తాగుతా.. బెన్టిన్ వాచీ రేపటిలా నాకు ఇవ్వాల్సిందే... లేదంటే నేను స్కూలికి వెళ్లను అంటూ పిల్లలు మారాం అంతాఇంతా కాదు. వాళ్లకి సర్దిచెప్పి స్కూల్కి పంపాలంటే ఇంట్లో అమ్మలకి పెద్ద టాస్కే మరి, అందుకే చిట్టి ఏనుగు... చిన్న కప్ప... క్యూట్ అమ్మాయి... బుల్లి పాండా... టెడ్డీ అంటూ వారి మనసుకు నచ్చే ఆకారాల్లో రకరకాల రంగుల్లో బ్యాక్ ప్యాక్‌లు వచ్చేశాయి. అచ్చంగా వాటి రూపంలో ఉ ఈ బ్యాక్ ప్యాక్స్‌ను వారికి ఇచ్చి చూడండి. వారి ఆనందానికి హద్దులుండవు. వాళ్ల కలల ప్రపంచం వారి కళ్ల ముందే మురిసిపోతుంటారు. ఈ బ్యాక్ ప్యాక్ నోట్బుక్స్ మాత్రమే కాదు. బేఫేన్ బాక్స్, వాటర్ బాటిల్ అంటూ చాలానే పెట్టుకోవచ్చు. స్కూల్లో ఎక్స కర్షన్కి వెళ్లాలన్నా. ప్యామిలీతో కలిసి ట్రిప్ ప్లాన్ చేసిన వారికి సంబంధించిన వస్తువులను తీసుకెళ్లడానికి ఓ బ్యాగ్ కావాలి కదా. అందుకే ప్రతి వస్తువులోనూ ఆట బొమ్మల్ని కోరుకునే చిన్నారులకి ఇవి ఇచ్చి చూస్తే తప్పక నచ్చుతాయి. అంతేకాదు, ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే వారి వస్తువులను అందులో సర్దుకోమనండి. దీంతో వారికి వస్తువులపై జాగ్రత్త కూడా పెరుగుతుంది. కొనిచ్చేయండి మరి, ఆలస్యమెందుకు







# స్క్రాచ్ బుక్ చిన్నారి సృజనకు..

బుజ్జాయిల కలల ప్రపంచా న్నంతా కళ్ల ముందు ఆవిష్కరించేలా చేస్తుంది 'స్క్రాచ్ బుక్' ఇందులో పేజీపై పాపాయి గీసే ప్రతి గీత రంగుల వారివిల్లుగా ఆరిపోతుంది. కళాప్రపంచాన్ని వారెదుట ప్రత్యక్షమయ్యేలా చేసే ఈ బుల్ల పుస్తకం గురించి తెలుసుకుందాం.. ఆర్ట్.. చిన్నా, పెద్ద సైజుల్లో మార్కెట్‌లో లభ్యమయ్యే 'ఆర్ట్ స్క్రాచ్ బుక్‌లోవన్నీ నల్లని పేజీలే. ఈ డ్రాయింగ్ బుక్‌పై చెక్క పెన్సిల్‌నే ఉపయోగిం చాలి. కందేలు, ఏనుగు, ప్రకృతిదృశ్యం, సూర్య చంద్రులు, అంతరిక్ష మంటూ మనసు కు నచ్చిన వాటిని పెన్సిల్‌తో ఈ పేజీలపై గీస్తే చాలు. రంగురంగుల బొమ్మలు ప్రత్యక్షమవుతూయి. చిన్నారుల సృజనాత్మకతను వెలికి తీస్తాయి. పిల్లలు గీసే ఈ చిత్రలేఖనాలను జ్ఞాపకాలుగా ఫ్రేమ్స్ చేసివారి గదికి అలంకరణగా మార్చితే చాలు. వారి కళ్లల్లో ఆనందం ఇంటినంతటినీ కళకళలాడేలా చేస్తుంది. ప్రేమగా.. స్క్రాచ్ పేపర్‌నోట్ బుక్‌లో తమ మనసులోని మాటకు పిల్లలు రంగులద్దొచ్చు. ప్రత్యేక రోజుల్లో అమ్మానాన్నలకు, స్నేహితులకు ప్రేమగా ఈ పేజీలపై రంగురంగుల అక్షరాలతో శుభాకాంక్షలు రాయొచ్చు. ఆరి మనసులో భావాలను అందంగా తీర్చిదిద్ది మరీ కానుకగా అందించొచున. వీటిని తల్లిదండ్రులు ఫ్రేమ్‌లుగా మార్చి ఇంటి అలంకరణలోనూ భాగం చేసుకోవచ్చు. ఇంట్లోనే స్వయంగా.. చిన్నారుల ఆలోచనలను రంగులుగా మార్చే స్క్రాచ్ బుక్‌ను ఇంట్లోనూ తయార ఎచేసుకోవచ్చు. ముందుగా దళసరి షీట్‌ను సిద్ధం చేసుకొని దానిపై రంగురంగుల క్రేయాన్స్‌తో పేజి మొత్తంగా గీయాలి. రెండు చెంచాల సబ్బు నీటిలో నలుపు రంగు అక్రిలిక్ పెయింట్ గంటలు అరనిస్తేచాలు. ఆర్ట్ స్క్రాచ్ పేజీ సిద్ధమైనట్టే.



# దేవుడికి దగ్గరైతే..

ఒక చోట పెద్ద సంత జరుగుతోంది. దానికి దూరంగా ఉన్నప్పుడు మనిషికి భారీ శబ్దం మాత్రమే వినిపిస్తుంది. అంతా గోలగోలగా ఉంటుంది. తీరా సంతలోకి వెళ్తే అంతకు ముందులాగా హోరు శబ్దం వినిపించదు. కేవలం అక్కడి బేరసారాలు మాత్రమే చెవిన పడతాయి. అలాగే భగవంతుడికి దూరంగా ఉన్న వారికి వ్యర్థ వాగ్వాదాలు ఎన్నో వినిపిస్తాయి. దేవుడికి దగ్గరైతే ఆ పరమాత్మ లీలలు స్పష్టంగా తెలుస్తాయి అని ఒక సందర్భంలో వివరించారు రామకృష్ణ పరమహంస. ఇలాంటిదే మరొక ఉపమానాన్ని ఆయన చెప్పారు. అన్నసమారాధనకు అతిథులు చాలామంది చేరినప్పుడు పెద్ద కోలాహాలం చెలరేగుతుంది. తీరా వారు భోజనానికి కూర్చొని వడ్డన మొదలై ఒక్కో పదార్థం వస్తున్న కొద్దీ ఆ శబ్దం కనుమరుగు అవుతుంది. అలాగే భగవంతుడికీ మరింతగా దగ్గరయ్యే కొద్దీ ఆయనకు సంబంధించిన వాదవివాదాలన్నీ అంతరిస్తాయి. మనిషి సమాధి స్థితికి చేరి నిర్మలానందాన్ని అనుభవిస్తాడు అని వివరించారు పరమహంస. అలాగే తన



పాండిత్యం, ఐశ్వర్యం చూసి గర్వంతో మిడిసిపడే వారికి దివ్యజ్ఞానం లభించదని హెచ్చరించారు.

ఆధ్యాత్మికం

# నూనె మరకలు మాయమైపోతాయి !

తాలింపు వేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నా చుట్టూ నూనె చిందుతుంది. గారెలు,, బూరెల్లాంటి పిండివంటల సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిందే లేదు. ఇలా తరచూ చిందే నూనె మీద దుమ్ము చేరితే ఒకపట్టాన వదలదు. శుభ్రం చేయాలంటే మహా కష్టం. ఈ సమస్యకి పరిష్కారంగా వచ్చిందే 'గ్రీజ్ స్ప్లాటర్ గార్డ్' లేదా 'స్టవ్ షీల్డ్' ఇది నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారైనందున తుప్పు పట్టదు. మన్నిక ఎక్కువ. శుభ్రపరచడమూ తేలికే. ఇది అరలుగా ఉండి.. అవసరమైనట్లు అమర్చడానికి వీలుగా ఉంటుంది.





నాన్‌స్టిక్ కోటింగ్ వల్ల నూనె అతుక్కోదు కనుక తేలిగ్గా కడిగేయొచ్చు. గాలికి మంట ఆరిపోకుండానూ ఆపుతుందీ సాధనం.

ఆట

## ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# రమేష్‌కు చరిత్రాత్మక కాంస్యం
### తొలి భారతీయ సర్ఫర్‌గా రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్-2025, ఓపెన్ పురుషుల విభాగంలో పతకం గెలుచుకున్న తొలి భారతీయ సర్ఫర్‌గా రమేష్ బుడిహాల్ నిలిచాడు. ఆదివారం జరిగిన పోటీల్లో 27 ఏళ్ల బుడిహాల్ పతక రౌండ్‌లో 12.60 పాయింట్లు సాధించి, అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ఈ ఎడిషన్‌లో హోమ్ వాటర్స్‌లో కాంస్యం సాధించాడు. దక్షిణ కొరియాకు చెందిన కనోవా హీజే 15.17 పాయింట్లతో స్వర్ణం సాధించగా, ఇండోనేషియాకు చెందిన పజార్ అరియానా 14.57 పాయింట్లతో రజతం గెలుచుకున్నాడు. సెమీఫైనల్లో, బుడిహాల్ డిఫెండింగ్ ఛాంపియన్ పజార్ అరియానా, జపాన్‌కు చెందిన కీ కోబయాషిలతో లైనప్‌ను ఎదుర్కొన్నాడు. ఒత్తిడి ఉన్నప్పటికీ, రెండవ స్థానాన్ని దక్కించుకోవడానికి 11.43 పాయింట్లను అందించాడు. సెమీఫైనల్ తర్వాత జరిగిన క్వార్టర్ ఫైనల్ 14.84 పాయింట్లతో అధిగమించాడు. ఫిలిప్పీన్స్‌కు చెందిన నీల్ సాంచెజ్ (12.80) రెండవ స్థానంలో నిలిచాడు. ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్ ఓపెన్ పురుషుల విభాగంలో భారతదేశం ఇంతకు ముందు ఎప్పుడూ పతకం గెలవలేదు. అలాగే తోటి భారత సర్ఫర్ కిషోర్ కుమార్ కూడా ఆకట్టుకున్నాడు, తన హీట్‌లో 8.10 పాయింట్లతో సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. శ్రీకాంత్ డి క్వార్టర్ ఫైనల్స్‌ను తృటిలో దాటి తన రేసులో మూడవ స్థానంలో నిలిచాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లలో ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, చైనా, జపాన్ మరియు దక్షిణ కొరియా నుండి అగ్రశ్రేణి సర్ఫర్లు పాల్గొన్నారు.

## ఫిబా ఆసియా కప్‌లో
# భారత్ ఘోర ఓటమి
### 59 - 84తో సౌదీ విజయం

**న్యూఢిల్లీ:** ఫిబా ఆసియా కప్-2025లో భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు తమ సి గ్రూప్ మూడవ మ్యాచ్‌లో సౌదీ అరేబియా చేతిలో ఘోరంగా ఓడి పోయింది. దీంతో భారత్ జట్టు గ్రూప్ దశలోనే టోర్నీ నుండి నిష్క్రమించింది. సౌదీ అరేబియాలోని జెద్దాలోని కింగ్ అబ్దుల్లా స్పోర్ట్స్ సిటీలో ఆదివారం జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లో జోర్డాన్, ఆ తర్వాత చైనా చేతిలో ఓడిన భారత్, తదుపరి ప్రపంచ నం. 65 సౌదీ అరేబియాతో మ్యాచ్‌లోకి దిగింది. ఆ తర్వాత గ్రూప్ దాటి ముందుకు సాగాలంటే గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో క్వార్టర్‌ను సౌదీ అరేబియా కంటే 25-24తో ముందంజలో ముగించారు. అయితే, ఆ తర్వాత, సౌదీ అరేబియా తన గేర్‌ను మార్చుకుని అద్భుతంగా రెండవ క్వార్టర్‌ను ఆడింది, 21 పాయింట్లు సాధించి, భారతదేశానికి కేవలం 6 పాయింట్లు మాత్రమే ఇచ్చింది. మూడో క్వార్టర్‌లో భారత్ 18 పాయింట్లు సాధించి వెనక్కి తగ్గింది, కానీ సౌదీ అరేబియా వరుసగా రెండో క్వార్టర్‌లో 21 పాయింట్లు సాధించి ముందుకు సాగింది. చివరి క్వార్టర్‌లో చేయాల్సింది చాలా మిగిలి ఉండగా, భారత్ చివరి విజిల్ సమయానికి 59-84తో ఓడిపోయింది. వరుసగా మూడు ఓటములతో భారత్ ఇప్పుడు టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది.





## మహిళల టి20లో టైటిల్
# విజేతగా ఆస్ట్రేలియా
### 4 పరుగుల తేడాతో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఇండియాను ఆస్ట్రేలియా 4పరుగుల తేడాతో ఓడించి, మహిళల టి20 సిరీస్‌ను 3-0 తేడాతో గెలుచుకుంది. మాకేలోని గ్రేట్ బారియర్ రీఫ్ అరీనాలో జరిగిన రెండో టీ20లో ఇండియా 114 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన మరుసటి రోజే ఆదివారం ఆస్ట్రేలియా మెరుగైన ప్రదర్శన ఇచ్చి 144/8 స్కోరు చేసింది. ప్రేమ రావత్, రాధా యాదవ్ తలా మూడు వికెట్లు తీసుకున్నారు. ఓపెనర్ షఫాలీ వర్మ 25 బంతుల్లో ఆరు ఫోర్లు, ఒకసిక్స్‌తో 41 పరుగులు చేసి జట్టు విజయానికి ఊపునిచ్చింది. కానీ క్వీన్స్‌ల్యాండ్ జింజర్‌కు చెందిన 20 ఏళ్ల ఆల్ రౌండర్ సియానా ఎనిమిదో ఓవర్‌లో షఫాలీని తొలగించి,15వ ఓవర్‌లో రాఘవ్వీ బిస్ట్‌ను స్టంప్ చేయడం ద్వారా ఆస్ట్రేలియాకు అనుకూలంగా మ్యాచ్‌ను మార్చింది. సియానా 19వ ఓవర్‌లో రాధా, సజన సజీవన్‌లను అవుట్ చేసింది. కేవలం 3పరుగులు మాత్రమే ఇచ్చి టెయిల్ క్రీజులో ఉండగా,చివరి ఓవర్‌లో టెస్ఫ్లింటాఫ్ దానిని డిఫెండ్ చేసి ఆస్ట్రేలియాకు గట్టి విజయాన్ని అందించింది. దీంతో భారత్ 140/8 స్కోరుకు పరిమితమైంది. అంతకుముందు అలిస్సా హీలీ 21 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులు చేసింది. తహ్లియా విల్సన్ (14), అనికా యోరాయిడ్ (22) శుభారంభం చేశారు. మాడెలిన్ పెన్నా 32 బంతుల్లో 39 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆ తర్వాత సియానా ఏడు బంతుల్లో అజేయంగా 17 పరుగులు చేసి ఆస్ట్రేలియాను 144/8 స్కోరుకు చేర్చింది.సంక్షిప్తస్కోర్లు: ఆస్ట్రేలియా 144/8 (మాడెలైన్ పెన్నా39, అలిస్సా హీలీ 27, ప్రేమ రావత్ 324, రాధా యాదవ్ 331), భారత్ 140/8 (షఫాలీ వర్మ 41, మిన్ను మణి 30, సియానా జింజర్ 416) నాలుగు పరుగుల తేడాతో లూసీ హామిల్టన్ 162.

## టెస్ట్ క్రికెట్ భారత్ టీంలో
# చిచ్చరపిడుగులు
### 18 యేళ్లలోపే అరంగేట్రం.. అతి పిన్న ఏజ్ ప్లేయర్లుగా గుర్తింపు



**న్యూఢిల్లీ:** భారతదేశంలో ప్రతిభకు కొదవ లేదు. యువ వైభవ్ సూర్యవంశీ చిన్న వయసులోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ యొక్క దాదాపు అన్ని ప్రీమియం రికార్డులను బద్దలు కొట్టాడు. అతను అతి పిన్న వయస్కుడైన అరంగ్రేటం చేసి సెంచరీ సాధించిన చిచ్చర పిడుగు. భారతదేశం తరపున టెస్ట్ క్రికెట్ గురించి మాట్లాడుకుంటే, ఈ రికార్డు ప్రస్తుతం గొప్ప సచిన్ టెండూల్కర్ పేరు మీద ఉంది. టీమిండియాలోని ఐదుగురు అతి పిన్న వయస్కులైన టెస్ట్ అరంగేట్ర ఆటగాళ్లలో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. గ్రేట్ సచిన్ టెండూల్కర్ తన తొలి టెస్ట్ మ్యాచ్‌ను కేవలం 16 సంవత్సరాల 205 రోజుల వయసులో ఆడాడు. అతను నవంబర్ 15, 1989న కరాచీలో వసీం అక్రమ్‌వకార్ యూనస్‌పై పాకిస్తాన్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేశాడు. అలాగే పియూష్ చావ్లా తన తొలి టెస్ట్ మ్యాచ్‌ను 17 సంవత్సరాల 75 రోజుల వయసులో ఇంగ్లాండ్‌తో మొహాలిలో మార్చి 9, 2006న ఆడాడు. అతను భారత జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాడు. లక్ష్మణ్ శివరామకృష్ణన్ తన తొలి టెస్ట్ మ్యాచ్‌ను 17 సంవత్సరాల 118 రోజుల వయసులో ఆడాడు. అతను 1983 ఏప్రిల్ 28న సెయింట్ జాన్స్ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. ఈ జాబితాలో పార్థివ్ పటేల్ నాల్గవ స్థానంలో ఉన్నాడు. పార్థివ్ పటేల్ తన టెస్ట్ కెరీర్‌ను తక్కువ వయస్సులోనే ప్రారంభించాడు. పొట్టి ఎత్తు ఎడమచేతి వాటం బౌలర్ పార్థివ్ 18 సంవత్సరాల కంటే తక్కువ వయసులో టెస్ట్ అరంగేట్రం చేశాడు.

అతను 17 సంవత్సరాల 152 రోజుల వయసులో ఇంగ్లాండ్‌పై అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్ 8 ఆగస్టు 2002న నాటింగ్‌హామ్‌లో జరిగింది. అలాగే టీమిండియా తరపున టెస్ట్ క్రికెట్‌లో చిన్న వయస్సులోనే అరంగేట్రం చేసిన వారిలో మణీందర్ సింగ్ ఒకరు. 1982 డిసెంబర్ 23న జరిగిన ఈ మ్యాచ్‌లో మణీందర్ సింగ్ పాకిస్థాన్‌తో జరిగిన కరాచీలో భారత్ తరఫున అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్‌లో మణీందర్ సింగ్ వయసు 17 సంవత్సరాల 193 రోజులు.



## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# నిషా, ముస్కాన్, రాహుల్‌కు స్వర్ణాలు
### భారత్ ఖాతాలో 14 పతకాలు

**న్యూఢిల్లీ:** అండర్ 19 ఆసియాబాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2025లో 3స్వర్ణాలు భారత్‌ఖాతాలో చేరాయి. థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో భారత్‌కు చెందిన నిషా (54 కిలోలు), ముస్కాన్ (57 కిలోలు) స్వర్ణం సాధించగా, మరో ఐదుగురు రజతాలు గెలుచుకున్నారు. పురుషుల ఫైనల్స్‌లో రాహుల్ కుందు (75 కిలోలు) మరో స్వర్ణాన్ని సాధించాడు. దీంతో భారత్ 3 స్వర్ణాలు, 7 రజతాలు, 4 కాంస్య పతకాలతో సహా మొత్తం 14 పతకాలను సాధించింది. మాజీ జూనియర్ ప్రపంచ ఛాంపియన్ నిషా చైనాకు చెందిన సిరుయ్ యాంగ్‌పైన, ముస్కాన్ కజకిస్తాన్‌కు చెందిన అయాజాన్ ఎర్మెక్‌పై స్వల్ప తేడాతో విజయం సాధించారు. మిగిలిన ఐదుగురు బాక్సర్లు, విని (60 కిలోలు), నిషా (65 కిలోలు), ఆర్తి కుమారి (75 కిలోలు), కృతికా వాసన్ (80 కిలోలు), ప్రాచి టోకాస్ (80+ కిలోలు) తమ తమ ఫైనల్స్‌లో ఓడిపోయి రజతాలతో సరిపెట్టారు. ఉజ్బెక్, చైనీస్ బాక్సర్లపై వరుసగా ఏకగ్రీవ (0-5) నిర్ణయంతో విని, ఆర్తి ఓటమిని ఎదుర్కొన్నారు. అయితే నిషా (కిలోలు) స్ప్లిట్ (1-4) జపాన్‌కు చెందిన అరింద అకిమోటో చేతిలో ఓడిపోయింది. హెవీవెయిట్ బాక్సర్లు కృతిక, ప్రాచి ఇద్దరూ ఫైనల్‌లో ఓడిపోయారు. 2-3 తేడాతో కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ ఆటగాళ్లతో వారి వారి బౌట్‌లను కోల్పోయారు. ఇక పురుషుల బాక్సింగ్‌లో రాహుల్ కుందు (75 కిలోలు) భారత్‌కు బంగారు పతకం సాధించిన ఏకైక బాక్సర్‌గా ఉన్నాడు. మోసమ్ సుహాగ్ (65 కిలోలు), హేమంత్ సంగ్వాన్ (90 కిలోలు) ఫైనల్స్‌లో ఓడిపోయారు. రాహుల్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముహమ్మద్‌జోన్ యాకుబోవ్‌ను 4-1 తేడాతో ఓడించి, వరుసగా మూడు రజత పతకాల పరుగును ముగించాడు. ఇక మోసమ్ ఫైనల్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జఖోంగిర్ జైనిడినోవ్ చేతిలో 0-5 తేడాతో ఓటమిని ఎదుర్కొన్నాడు. అలాగే హేమంత్ కజకిస్తాన్‌కు చెందిన రసుల్ అస్సాంఖానోవ్ చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకున్నాడు.

వాణిజ్యం




## ఫండ్స్‌లో అధిక రిటర్నులిచ్చే మూడు
# కొత్త ఫండ్స్!

**ముంబయి, ఆగస్టు 10:** మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్కువ రిటర్నులు ఆశించేవారికోసం ఈ వారం మూడు కొత్తపథకాలు లాంచ్ అవుతున్నాయి. ఈ వారం మూడు పాసివ్ మ్యూచువల్ ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్ ఓపెన్ అవుతున్నాయి. కొత్త పథకాల ద్వారా తమ పోర్ట్‌ఫోలియోను వైవిధ్యభరితం చేయాలని ఏఎంసీలు భావిస్తున్నాయి. ఈ మూడు ఫండ్లలో ఒకటి కమోడిటి, ఒక ఈక్విటీ, మరోకటి హైబ్రిడ్ ఆధారిత ఫండ్స్ ఉన్నాయి. ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్‌నుంచి ఒక స్కీమ్ లాంచ్ అవుతుండగా 'మిరే' అసెట్ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు పథకాలు వస్తున్నాయి. ఎడెల్వీస్ మల్టీ అసెట్ ఓమ్నిఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈ నెల 12న మొదలవుతోంది. ఈనెల 26వ తేదీవరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100గా నిర్ణయించారు. 'మిరే' అసెట్ మ్యూచువల్ ఫండ్ నుంచి మిరే అసెట్ గోల్డ్ సిల్వర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్‌తోపాటు మిరే అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్‌ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సోమవారం నుంచిమొదలవుతోంది. యూనిట్ల కొనుగోలు కోసం 25వ తేదీ వరకు అందుబాటులో ఉం టుంది. ఈ రెండు పథకాల్లో కనీస పెట్టుబడి రూ. 5000 గా నిర్ణయించారు. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ హైరిస్క్ ఉంటుంది. ఈక్విటీ ఆధారిత ఫండ్లు మార్కెట్ ఒడుదొడుకులకు లోనవుతుంటాయి. ఇన్వెస్టర్ తన రిస్క్ సామర్థ్యం, పెట్టుబడి లక్ష్యం, భవిష్యత్తు అవసరాల వంటి వివిధ అంశాల ఆధారంగా పోర్ట్ ఫోలియో నిర్మించుకోవాలి. ఎంచుకునే స్కీమ్ తమ లక్ష్యాలను చేరుకోగలదా అనే విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. సరైన ఫండ్ ఎంచుకుని దీర్ఘకాలం పాటు కొనసాగినప్పుడే హైరిటర్న్లు పొందేందుకు అవకాశం ఉంటుంది.

## డివిడెండ్, బోనస్ షేర్లు ప్రకటించనున్న
# 90 కంపెనీలు!




**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** కార్పొరేట్‌రంగంలో ఈవారంలోసుమారు 90 కంపెనీలు డివిడెండ్లు ప్రకటించనున్నాయి. వీటిలో దిగ్గజ కార్పొరేట్‌లు అయిన ఐసిఐసిఐబానయంకు, హిందూస్థాన్‌పెట్రోలియం, రిలయన్స్, గ్రాసిమ్, గోద్రెజ్ కన్స్యూమర్ వంటి కంపెనీలుకూడా ఉన్నాయి ఈనెల 11నుంచి 15వ తేదీలోపు వీటిని ప్రకటించాల్సి ఉంది. కార్పొరేట్ కార్యాచరణ క్యాలెండర్‌లో ఎఫ్ఎంసిజి, బ్యాంకింగ్, ఇంధనం, ఉత్పత్తిరంగం, ఇన్‌ఫ్రారంగాల్లో టిప్లస్‌వన్ సెటిల్‌మెంట్లు చేయాల్సి ఉంటుంది. నిర్ణీత తేదీకి కనీసం ఒక్కరోజయినా ముందు షేర్లు కొనుగోలుచేసినవారికి ఈ చెల్లింపులు వర్తిస్తాయి. 11వ తేదీ అక్జోనోబెల్ ఇండియా ఒక్కోషేరుకు ప్రత్యేక డివిడెండ్ కింద 156 రూపాయలు చెల్లిస్తోంది. కలానయణి స్టీల్స్ ప్రతిషేరుకు పదిరూపాయలు, ఇతర ట్రా క్యాస్ట్రాల్ ఇండియా 3.5 రూపాయలు, ఇండో కౌంట్ రూ.2, జియో ఫైనాన్షియల్ రూ.0.5, నీల్‌మలాయ్ ఆగ్రో ఇండస్ట్రీస్‌షేరుకు 30 రూపాయలు డివిడెండ్లుప్రకటిస్తున్నాయి. ఐసిఐసిఐబ్యాంకు రూ.11 చొప్పున డివిడెండ్‌ప్రకటించింది. గ్రాసిమ్ రూ.10, అరవింద్ ఫ్యాషన్స్ రూ.1.6, రైట్స్ 1.3, ఇండియా పెస్టిసైడ్స్, ఎన్ జి ఎల్ ఫైన్‌కెమ్, హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్‌లు కూడా ఇదే జాబితాలో ఉన్నాయి. ఇక 1ఆవ తేదీ పిడిలైట్ ఇండస్ట్రీస్ రూ.10 అంటే వెయ్యిశాతం డివిడెండ్ ఇస్తోంది. గోద్రెజ్ కన్స్యూమర్ రూ.5, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ రూ.10 చొప్పున డివిడెండ్ చెల్లింపులు చేస్తాయి. పేజ్ ఇండస్ట్రీస్, రైల్‌టెల్;సన్‌టివి, ఎన్‌బిసిసిలు కూడా ఈ రోజే డివెండ్‌ప్రకటించనున్నాయి. ఇక 14వ తేదీ హెచ్‌పిసిఎల్ రూ.10.5, రిలయన్స్ రూ.5.5, గ్లాండ్ ఫార్మా రూ.18, విఆర్ఎల్ లాజిస్టిక్స్ 1:1 బోనస్ ప్రకటించింది. బంధన్‌బ్యాంకు, మహానగర్ గ్యాస్, ఎన్సీసి, ఎన్ఎండిసి, ఆర్ఇసి, వెస్ట్‌కోస్ట్ పేపర్; జెన్ టెక్నాలజీస్ వంటివి ఉన్నాయి. 15వ తేదీ ఎన్‌బిఐ ఇండస్ట్రీయల్‌ఫైనాన్స్ రూ.0.5 చొప్పున ఈ వారం ముగిస్తోంది. ఇన్వెస్టర్లు రికార్డుచేసిన తేదీలను చూసి అప్రమత్తంగా ట్రేడింగ్‌చేయాలని సూచిస్తున్నారు.

# కనకవర్షం కురిపించిన ఎన్ఎస్‌డిఎల్ షేర్లు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** లిస్టింగ్ అయిన మూడురోజుల్లోనే ఎన్ఎస్డీఎల్ షేర్లు గణనీయంగా పెరగడంతో పెట్టుబడులు పెట్టిన బ్యాంకింగ్ యుటిఐ సంస్థల షేర్ల విలువలు ఒక్కసారిగా భారీ ఎత్తున పెరిగిపోయాయి. ఎస్‌బిఐ, ఐడిబిఐ బ్యాంకు, సూటీ సంస్థలు 650 రెట్లు షేర్లు పెరిగాయి.మరికొన్ని సంస్థలు కూడా లాభసాటిగా షేరు విలువలు పెంచుకోగలిగాయి. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఊహించని జాక్‌పాట్ తగిలింది. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)లో కేవలం రూ.1.20 కోట్లతో కొనుగోలు చేసిన వాటా విలువ, స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన మూడంటే మూడు రోజుల్లోనే ఏకంగా రూ.7,801 కోట్లకు చేరడం సంచలనం సృష్టిస్తోంది.

NSDL
Technology, Trust & Reach

ఎన్ఎస్‌డీఎల్ కంపెనీ ఆగస్టు 8న స్టాక్ మార్కెట్‌లో అరంగేట్రం చేసింది. ఇష్యూ ధర రూ.800 కాగా, 10 శాతం ప్రీమియంతో రూ.880 వద్ద లిస్ట్ అయింది. అప్పటి నుంచి వెనుదిరిగి చూడని ఈ షేరు, కేవలం 72 గంటల్లోనే రూ.1,300.30 స్థాయికి దూసుకెళ్లింది. దీంతో ఇష్యూ ధరతో పోలిస్తే 62.5 శాతం వృద్ధి నమోదైంది. ఈ భారీ లాభాలతో అందరికంటే ఎక్కువగా లబ్ధి పొందింది ఎస్‌బీఐ. చాలా సంవత్సరాల క్రితం, ఎస్‌బీఐ కేవలం రూ.2 చొప్పున 60 లక్షల ఎన్ఎస్‌డీఎల్ షేర్లను కొనుగోలు చేసింది. దీని కోసం అయిన ఖర్చు కేవలం రూ.1.20 కోట్లు మాత్రమే. నేడు ఆ వాటా విలువ రూ.7,801.80 కోట్లకు పెరిగింది. అంటే, ఎస్‌బీఐకి పేపర్ ప్రాఫిట్ రూ.7,800.60 కోట్ల లాభం వచ్చినట్టు. ఇది దాదాపు 6,50,050 శాతం రాబడి కావడం గమనార్హం. ఎస్‌బీఐతో పాటు ఇతర బ్యాంకులు కూడా భారీ లాభాలను ఆర్జించాయి. ఐడీబీఐ బ్యాంక్ కూడా రూ.2 చొప్పున రూ.5.99 కోట్లతో కొన్న వాటా విలువ ఇప్పుడు రూ.3,898 కోట్లకు చేరింది. యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూయూటీఐ) రూ.2.04 కోట్లతో కొన్న షేర్ల విలువ రూ.1,332 కోట్లకు పెరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) రూ.12.28 చొప్పున పెట్టిన రూ.36.84 కోట్ల పెట్టుబడి, ఇప్పుడు 105 రెట్లు పెరిగి రూ.3,900 కోట్లకు చేరింది. అదేవిధంగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.150.54 కోట్ల పెట్టుబడిపై రూ.1,507 కోట్ల లాభం పొందగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2.66 కోట్ల పెట్టుబడిపై రూ.664 కోట్ల లాభాన్ని ఆర్జించింది. మొత్తంగా ఎన్ఎస్‌డీఎల్ లిస్టింగ్ దాని ప్రారంభ పెట్టుబడిదారులకు కనకవర్షం కురిపించింది.




# నాలుగు కొత్త ఐపిఒలు.. 11కంపెనీల లిస్టింగ్!
### ఈ వారం అంతా మార్కెట్లలో స్టాక్ సందడే..

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఈ వారం ఐపిఒల సందడి పెరుగుతోంది. నాలుగు కొత్త ఐపిఒలు మార్కెట్‌కు వస్తున్నాయి. దీనితోపాటు 10కిపైగా కంపెనీలు మార్కెట్‌లో లిస్ట్ అవుతున్నాయి. బ్లూస్టోన్ జ్యూయెలరీ, రీగల్ రీసోర్సెస్ వంటి మెయిన్ ఐపిఒలు కూడా ఉన్నాయి. ఇప్పటికే షురూ అయిన ఏడు ఐపిఒలల్లో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. రెండుమెయిన్‌బోర్డు అయితే మిగిలినవన్నీ ఎస్ఎంఇ కేటగిరీలోనే ఉన్నాయి. 11 కంపెనీలషేర్లు స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్ట్ అవుతున్నాయి. ఐకోడెక్స్ పబ్లిక్ సొల్యూషన్స్ 42.03 కోట్లు ఐపిఒకు వస్తోంది. 11న ప్రారంభించి 13న ముగుస్తుంది.షేర్ల ఇష్యూధర రూ.98 నుంచి 102గా ఉంది. 1200 షేర్లు లాట్‌సైజు ఉంటుంది. 19వ తేదీ బిఎస్ఇ ఎస్ఎంఇలో లిస్ట్ అవుతుంది. ఇక బ్లూస్టోన్ జ్యూయెలరి 1540.65 కోట్లు ఐపిఒకు వస్తోంది. 11నుంచి 13తేదీలమధ్య షేర్ల బిడ్డింగ్, లాట్‌సైజు కనిసం 29 షేర్లు, షేరుధరలు 492నుంచి 517వరకూ ఉంటుంది. 19వ తేదీనే బిఎస్ఇ,ఎన్ఎస్ఇల్లో లిల్టింగ్ అవుతుంది. మహీంద్ర రియాల్టర్స్ 49.45కోట్ల ఐపిఒకు వస్తోంది. 12నుంచి 14 వరకూ బిడ్డింగ్‌కాగా షేరుధర రూ.75నుంచి 85 మధ్యలో ఉంది. లాట్‌సైజు 1600 షేర్లు, లిస్టింగ్ ఈనెల 20వ తేదీ ఎన్ఎస్ఇ ఎస్ఎంఇలో అవుతుంది. ఇక రీగల్ రీసోర్సెస్ ఐపిఒ రూ.306 కోట్లకు ఉంది. 12నుంచి 14 వతేదీ మధ్యలో బిడ్డింగ్, షేరుధర బ్యాండ్ రూ.96 నుంచి 102 మధ్యలో ఉంటుంది. లాట్‌సైజు అంటే 144షేర్లు కనిష్ట కొనుగోళ్లు. ఇప్పటికే జెఎస్‌డబ్ల్యు 3600 కోట్లతోను, సవాలియా ఫుడ్స్ ప్రొడక్ట్స్ 34.83 కోట్లతోను, కాన్‌ప్లెక్స్ సినిమాస్ ఐపిఒ 90.27 కోట్లతోను, ఆల్‌టైమ్‌ప్లాస్టిక్స్ ఐపిఒ 400.60 కోట్లతోను మార్కెట్‌కు వచ్చాయి. ఎఎన్‌బి మెటల్‌కాస్ట్ ఐపిఒరూ. 49.92 కోట్లతోను, మెడిస్టెప్ హెల్త్‌కేర్ రూ.16.10 కోట్లమేర నిధుల సమీకరణకు ఐపిఒలు జారీచేసాయి. ఇక ఈవారంలో 11 కంపెనీలుస్టాక్ ఏక్ఛేంజిల్లో నమోదవుతున్నాయి.

# ఆదానీకి మెగా విద్యుత్ ప్రాజెక్టు ఆర్డర్
### 300 కోట్ల డాలర్లతో బీహార్‌లో గ్రీన్‌ఫీల్డ్ థర్మల్ పవర్ ప్లాంట్

**ముంబయి, ఆగస్టు 10:** ఆదానిపవర్ బీహార్ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కంపెనీ 2400 మెగావాట్ గ్రీన్‌ఫీల్డ్ థర్మల్‌పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆర్డర్ లభించింది. 300 కోట్ల డాలర్ల పెట్టుబడుతో బీహార్‌లోని భాగల్పూర్‌వద్ద ఈప్లాంట్ నిర్మాణానికి నిర్ణయించారు. ఈ పోటీ బిడ్డింగ్‌లో ఆదాని పవర్ అతితక్కువ బిడ్డింగ్ వేసింది. ఎన్‌బిపిడిసిఎల్, సౌత్ బీహార్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌కంపెనీలకు రూ.6.075కిలోవాట్‌ధరకు పంపిణీచేస్తుంది. ఇందుకు సంబంధించి లెటర్ ఆఫ్ అవార్డును కూడా సాధించినున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రభుత్వ రంగ సంస్థలతో పవర్ సరఫరా ఒప్పందాలకు ఆదాని ముందంజలో ఉంది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్; అండ్ ఆపరేట్ పద్ధతిలో ఈ ప్లాంట్ నిర్మాణం అవుతుంది. మూడు 800 మెగావాట్ల అల్ట్రా సూపర్‌క్రిటికల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుద్వారా బీహార్‌లోని విద్యుత్ అవాంతరాలకు చెక్‌పెట్టగలమని చెపుతున్నారు.




ఈ ప్లాంట్ 60 నెలల్లో పూర్తిచేస్తామని ఆదాని హామీ ఇచ్చింది. ఆదానిపవర్ సిఇఒ ఎస్‌బి ఖ్యాలియా మాట్లాడుతూ మాకు 2400 మెగావాట్ల థర్మల్‌ప్రాజెక్టు లభించిందని నిర్ణీతగడువులోపు పూర్తిచేస్తామని ప్రకటించారు. ఈప్రాజెక్టువల్ల పదివేలనుంచి 12 వేలమందికి ఉపాధి కల్పిస్తుంది. నిర్మాణదశలోనే మూడువేలమందికి ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వశక్తి పాలసీ కింద కేటాయించిన గనులనుంచి బొగ్గు లభిస్తుంది. ఆదానిపవర్ దేశంలోనే అతిపెద్ద థర్మల్‌పవర్ ఉత్పత్తిదారుగా ఉంది.

మొత్తం 18,110 మెగావాట్లతో కూడిన 12 ప్లాంట్లు వివిధ రాష్ట్రాల్లో ఉన్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఉన్న ఈప్లాంట్లతోపాటు 40 మెగావాట్ల సౌరవిద్యుత్‌ప్లాంట్‌కూడా గుజరాత్‌లో ఏరాటుచేసింది.

# ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఫ్రీడమ్ ఆఫర్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక ఫ్రీడమ్‌సేల్‌నుప్రకటించింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశీయ సర్వీసులు, అంతర్జాతీయ సర్వీసుల్లోను భారీ ఆఫర్లుప్రకటించింది. పదోతేదీనుంచే ఈ సేల్‌ను వెబ్‌సైట్‌లో ప్రారంభించింది. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల పైనా బుకింగ్‌లను అనుమతించింది. 15వ తేదీ వరకూ మాత్రమే ఉంటుందని, అన్ని బుకింగ్ ప్లాట్‌ఫారాలపైనా ఈ టికెట్లసేల్ ఉంటుందని ప్రకటించింది. ఆగస్టు 19నుంచి 2026 మార్చి 31లోపు ప్రయాణాలకు బుక్‌చేసుకున్న వారికి ఈఆఫర్ వర్తిస్తుంది. అలాగే ప్రముఖ పండుగలు ఓనమ్, దుర్గాపూజ, దీపావళి, క్రిస్మస్ పండుగలకు కూడా ఈ భారీ ఆఫర్లు వర్తిస్తాయి. ఈ స్కీం కింద దేశీయ టికెట్‌ధరలు రూ.1279నుంచి ప్రారంభం అవుతున్నాయి. అంతర్జాతీయ టికెట్ల ధరలు చూస్తే రూ.4279నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మొత్తం 500 రోజువారి విమానాలు నడుపుతోంది. మొత్తం 38 దేశీయ 17 అంతర్జాతీయ గమ్యస్థానాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వెళుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ లైట్‌ఫేరిట బ్యాగేజి జీరోచెక్‌ఇన్ ఉంటుంది. ఎయిర్‌లైన్ వెబ్‌సైట్‌లోమాత్రమే బుక్‌చేసుకోవాలి. ఎక్స్‌ప్రెస్ వాల్యూకింద 1379కి దేశీయ రూట్లలోను, 4479 అంతర్జాతీయ రూట్లలోను ప్రామాణిక బ్యాగేజి చెకిన్ ఉంటుంది. ఎక్స్‌ప్రెస్ బిజ్ సర్వీసుల్లో 58 ఇంచల సీటు లభిస్తుంది. కొత్తగా తీసుకున్న విమానంలో ఇపుడు 40 సీట్లవరకూ ఆఫర్ ఇస్తుంది. ఎయిర్‌లైన్స్ లాయల్టీప్రోగ్రామ్‌కింద ఉన్నవారికి 25 శాతం ఎక్స్‌ప్రెస్ బిజ్‌ఫేర్లలో రాయితీ ఉంటుంది. అదనపు బ్యాగేజిపై 20శాతం డిస్కౌంట్ ఇస్తుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.